



www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

శనివారం
29-06-2024

సంపుటి : 01 | సంచిక : 56 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్

V3 NEWS




పార్టీని వీడి దొంగల్లో కలిసెటోళ్ల గురించి

# బాధలేదు

**తెలంగాణ సాధించిన మనకు గిదో లెక్కనా?**

నాడైనా నేడైనా నాయకులను తయారు చేసింది పార్టీనే..

మెరికల్లాంటి యువ నాయకులను పార్టీ సృష్టిస్తది..

కార్యకర్తలతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

**విశ్వంభర, హైదరాబాద్:** సమైక్యవాదులతో కలబడి నిలబడి అత్యంత కష్టతరమైన తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ఒక లెక్కనే కాదని, పార్టీ నుంచి పోయి దొంగల్ల కలుస్తున్న నాయకుల గురించి ఏమాత్రం ఆలోచించవలసిన అవసరం లేదని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పష్టం చేశారు. ఒకరు పోతే పదిమంది నాయకులను పార్టీ తీర్చిదిద్దుకుంటుందని పునరుద్ఘాటించారు. తెలంగాణ

మిగతా2లో...

## రుణమాఫీకి రేషన్ కార్డు ప్రామాణికం కాదు

- అది కేవలం కుటుంబాన్ని గుర్తించడం కోసమే..
- పాస్ బుక్ ఆధారంగా రూ.2లక్షల వరకు రుణమాఫీ
- మరో నాలుగు రోజుల్లో మార్గదర్శకాలు విడుదల
- ఢిల్లీ వేదికగా ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి



**విశ్వంభర, ఢిల్లీ:** తెలంగాణ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రుణమాఫీ పై మరో నాలుగు రోజుల్లో మార్గదర్శకాలు విడుదల చేయనున్నట్టు సీఎం రేవంత్ తెలిపారు. శుక్రవారం ఆయన ఢిల్లీలోని మీడియాతో

మిగతా2లో...

## వలస ఎమ్మెల్యేలకు రేవంత్ రెడ్డి

# బిగ్ షాక్

## ఢిల్లీ వేదికగా సంచలన వ్యాఖ్యలు

వలస ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు లేవంటూ క్లారిటీ

కాంగ్రెస్ బీఫాంపై గెలిచిన వారికే కేబినెట్‌లో చోటు

ఫిరాయింపులకు తెలంగాణ ఒక్కటే ప్రత్యేకం కాదు

కేబినెట్ విస్తరణ, పీసీసీ చీఫ్ నియామకంపై కసరత్తు

మీడియా చిట్ చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి



**విశ్వంభర, ఢిల్లీ :** బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వలస ఎమ్మెల్యేలకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి షాకిచ్చారు. త్వరలో రెండవ కేబినెట్ విస్తరణ ఉన్న నేపథ్యంలో రేవంత్ కీలక ప్రకటన చేశారు. దీంతో ఒకవేళ బీఆర్ఎస్ నుంచి మంత్రి పదవులు ఆశించి ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువా కప్పుకుంటే వారికి ఆశాభంగం కలుగక మానదు. ఎందుకంటే కాంగ్రెస్ బీఫాం మీద పోటీ చేసిన వాళ్ళకే మంత్రివర్గంలో చోటు ఉంటుందని సీఎం తేల్చి చెప్పారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో మీడియాతో చిట్ చాట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేబినెట్ విస్తరణ, పీసీసీ చీఫ్ నియామకంపై కసరత్తు జరుగుతుందన్నారు. ఎవరికి మంత్రి పదవి ఇవ్వాలి, ఎవరికి పీసీసీ చీఫ్ బాధ్యతలు అప్పగించాలి అనే అంశాలపై అధిష్టానందే కీలక నిర్ణయం అన్నారు. పోటీలో ఎవరైనా ఉండొచ్చన్న రేవంత్. సామాజిక న్యాయం మాత్రం తప్పనిసరిగా ఉంటుందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళలు, ఈబీసీ ఎవరినైనా, దేనికైనా

మిగతా2లో...




### కాంగ్రెస్ గూటికి కాలె యాదయ్య

- ఢిల్లీలో హస్తం పార్టీలో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే
- సీఎం సమక్షంలో కండువ కప్పి ఆహ్వానించిన దీపాదాస్ మున్షీ
- ఆరుకు చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరిక

2

### ఢిల్లీ విమానాశ్రయంలో కూలిన పైకప్పు

- శుక్రవారం తెల్లవారు జామున ఘటన
- ఒకరు మృతి, ఐదుగురికి గాయాలు



9

### నీట్ పరీక్షపై లోక్‌సభలో రచ్చ

- లోక్‌సభ సోమవారానికి వాయిదా
- రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానం
- వాయిదా తీర్మానం ఇచ్చిన విపక్షం
- 12 గంటల వరకు సభ వాయిదా వేసిన స్పీకర్
- అటు రాజ్యసభలోనూ ఇదే గందరగోళం



9

### పదేళ్లలో నేనే పీసీసీ చీఫ్, సీఎం అవుతా..

- గాంధీ భవన్‌లో తనకు అటెండర్ పదవి ఇచ్చినా చేస్తా
- ఎవరు పీసీసీ అయినా పాలన బాగానే ఉంటుంది
- మోదీ పవర్ తాత్కాలికమే..
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



2



## సౌత్ గ్లాస్ పరిశ్రమలో ఘోర ప్రమాదం

- కంప్రెసర్ గ్యాస్ పేలి ఐదుగురు మృతి, 15 మందికి తీవ్రగాయాలు
- మృతులు ఉత్తర ప్రదేశ్, బిహార్ రాష్ట్రాలకు చెందిన కార్మికులు
- అధికారులను అప్రమత్తం చేసిన సీఎం రేవంత్ రెడ్డి

**విశ్వంభర, షాద్ నగర్:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పరిధిలోని బూర్గుల గ్రామ శివారులో ఉన్న సౌత్ గ్లాస్ పరిశ్రమలో శుక్రవారం రాత్రి ఘోర ప్రమాదం జరిగింది. కంపెనీలోని కంప్రెసర్ గ్యాస్ బ్లాస్ట్ పేలడంతో సుమారు 15 మందికి తీవ్ర గాయాలు కాగా ఐదుగురు మృతి చెందారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ

మిగతా2లో...



### రాష్ట్ర డీఎస్సీ పరీక్షల షెడ్యూల్ విడుదల

- జులై 18 నుంచి ఆగస్టు 5 వరకు ఎగ్జామ్స్
- రెండు షిఫ్ట్ ల్లో పరీక్షల నిర్వహణ
- 11 వేల ఉద్యోగాలకు 2.79 లక్షల మంది దరఖాస్తు

2

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



**నేటి చికెన్ ధరలు**

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 110 | ₹ 132 |
| స్కిన్ | స్కిన్‌లెస్ |
| ₹ 191 | ₹ 218 |



5

### ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన వ్యక్తి పీవీ

ప్రపంచం దృష్టిని ఆకర్షించిన గొప్ప మేధావి

ఆయన జీవితాన్ని కేంద్రం పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

### మేడిగడ్డ బ్యారేజ్ మరమ్మతులకు బ్రేక్

- ప్రాణహితకు భారీగా పెరిగిన వరద ప్రవాహం
- మేడిగడ్డలో 85 గేట్లకు 84 గేట్లు ఓపెన్
- వర్షా కాలం తర్వాతే మరమ్మతులు పున:ప్రారంభం



**విశ్వంభర, వరంగల్:** మేడిగడ్డ బ్యారేజ్ మరమ్మతు పనులకు బ్రేక్ పడింది. మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రాణహితలో వరద ప్రవాహం ఒక్కసారిగా పెరిగింది. దీంతో మరమ్మతు పనులను నిలిపివేసిన అధికారులు.. మొత్తం 85 గేట్లకు గాను 84 గేట్లను తెరిచారు. మేడిగడ్డకు ఎగువ నుంచి 10వేల క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. వర్షా కాలం తర్వాతే బ్యారేజ్ మరమ్మతు పనులు పున: ప్రారంభమయ్యే అవకాశం

మిగతా2లో...

### కవితతో హరీశ్ రావు ములాఖాత్

యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న మాజీ మంత్రి

ధైర్యంగా ఉండమని కవితకు సూచన



**విశ్వంభర, హైదరాబాద్ :** ఢిల్లీలోని తీహార్ జైలులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితతో ఆ పార్టీ నాయకులు, మాజీ మంత్రి హరీష్ రావు శుక్రవారం ఉదయం ములాఖాత్ అయ్యారు. ములాఖాత్ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండమని కవితకు సూచించారు. ఇటీవలే మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి, కేటీఆర్

మిగతా2లో...

# రుణమాఫీకి రేషన్ కార్డు ప్రామాణికం కాదు

**(మొదటి పేజీ తరువాయి)**
మాట్లాడుతూ రుణమాఫీపై కీలక ప్రకటన చేశారు. పంట రుణాల మాఫీకి రేషన్ కార్డు ప్రామాణికం కాదన్న ఆయన... రేషన్ కార్డు కేవలం కుటుంబాన్ని గుర్తించడం కోసమేనన్నారు. పాస్ బుక్ ఆధారంగా రూ.2లక్షల వరకు రుణమాఫీ ఉంటుందని సీఎం మరోసారి స్పష్టం చేశారు.మహిళలకు ఉచిత బస్సు పథకం కోసం నెలకు రూ.350 కోట్లకు పైగా ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు. ఈ పథకంతో ఆర్టీసీ ఆక్యుపెన్సీ పెరిగి, సంస్థ ఆదాయం బాట పట్టిందన్నారు. కేంద్ర బడ్జెట్ పెట్టిన రెండు రోజుల తర్వాత రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై దృష్టి పెడతామని చెప్పారు. రాష్ట్రానికి రూ.7 లక్షల కోట్లకు పైగా అప్పులున్నాయన్న సీఎం రేవంత్.... వాటి వడ్డీల్లో ఏమాత్రం తగ్గినా ప్రతి ఏటా వెయ్యి కోట్ల వరకు ప్రభుత్వానికి ఆదా అవుతుందని అభిప్రాయపడ్డారు.

# కాంగ్రెస్ గూటికి కాలె యాదయ్య

**విశ్వంభర, ఢిల్లీ:** బీఆర్ఎస్‌కు వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఆ పార్టీ నుంచి వలసలు కొనసాగుతున్నాయి. తాజాగా మరో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాంగ్రెస్ లో చేరారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఢిల్లీలో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ దీపాదాస్ మున్షీ సమక్షంలో ఆయన హస్తం గూటికి చేరారు. ఇటీవలే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, సంజయ్ కుమార్ లు కాంగ్రెస్ లో చేరిన సంగతి తెలిసిందే. ఇప్పటివరకు బీఆర్ఎస్ నుంచి ఆరుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ గూటికి చేరారు. బీఆర్ఎస్ కు చెందిన ఎమ్మెల్యేలు వరుసగా కాంగ్రెస్ లో చేరుతున్న పరిస్థితులు ఉన్నాయి. ఇప్పటివరకు ఐదుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువా కప్పుకోగా.. తాజాగా బీఆర్ఎస్ కు చెందిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కాంగ్రెలో చేరిపోయారు. ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ దీపాదాస్ మున్షీ సమక్షంలో కాలె యాదయ్య కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. బీఆర్ఎస్ కు చెందిన మెజార్టీ ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకోవాలని కాంగ్రెస్ పట్టుదలగా ఉంది. బీఆర్ఎస్ శాసనసభా పక్షాన్ని కాంగ్రెస్ లో విలీనం చేసుకోవాలని చూస్తోంది. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ చేరిక తర్వాత సీనియర్ నేత జీవన్ రెడ్డి తిరుగుబాటు నేపథ్యంలో.. చేరికల వేడి కాస్త తగ్గినట్లు అనిపించింది. అయితే, తాజాగా కాలె యాదయ్య ద్వారా మళ్లీ కాంగ్రెస్ లో చేరికల జోష్ నెలకొంది.

# కవితతో హరీశ్ రావు ములాఖాత్

**(మొదటి పేజీ తరువాయి)**
కవితతో ములాఖత్ అయిన విషయం విదితమే. ఢిల్లీ మద్యం విధానం కేసులో రిమాండ్‌లో ఉన్న ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీని మరోసారి పొడిగించిన సంగతి తెలిసిందే. జూలై 5 వరకు ఆమె కస్టడీని పొడిగిస్తూ రౌస్ ఎవెన్యూ కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. అధికారులు జూన్ 21వ తేదీన ఆమెను వర్చువల్‌గా కోర్టు ముందు హాజరుపరిచారు. ఈ కేసును జూలై 3వ తేదీన రౌస్ ఎవెన్యూ కోర్టు మరోమారు విచారణ జరుపనుంది. కవిత బెయిల్ పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది.

# తెలంగాణ డీఎస్సీ పరీక్షల షెడ్యూల్ విడుదల

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ డీఎస్సీ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. జులై 18 నుంచి ఆగస్టు 5 వరకు డీఎస్సీ పరీక్షలు నిర్వహించనున్నారు. రోజుకు రెండు షిఫ్టుల్లో సీబీఆర్టీ విధానంలో పరీక్షలు నిర్వహించనున్నారు. మొత్తం 11,062 పోస్టులకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల కాగా 2,79,966 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.


**డీఎస్సీ షెడ్యూల్ ఇదే**
తెలంగాణలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించనున్న డీఎస్సీ పరీక్షకు అధికారులు పూర్తి షెడ్యూల్ విడుదల చేశారు. జులై 18 నుంచి ఆగస్టు 5వరకు డీఎస్సీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. జులై 18న మొదటి షిఫ్ట్ లో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్, సెకండ్ షిఫ్ట్ లో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పరీక్షను నిర్వహిస్తారు. జులై 19 నుంచి 22వ తేదీ వరకు వివిధ మాధ్యమాల ఎస్జీటీ పరీక్షలు నిర్వహిస్తారు. జులై 20న ఎస్జీటీ, సెకండరీ గ్రేడ్ ఫిజికల్, స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్షలు జరుగుతాయి. జులై 22న స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్, జులై 24న స్కూల్ అసిస్టెంట్ బయలాజికల్ సైన్స్, జులై 26న తెలుగు భాషా పండిట్, సెకండరీ గ్రేడ్‌టీచర్ పరీక్ష నిర్వహిస్తారు. జులై 30న స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్ ఎగ్జామ్ నిర్వహిస్తారు.

**భారీగా అప్లికేషన్లు**
తెలంగాణ డీఎస్సీ 2024 అప్లికేషన్ల ప్రక్రియ పూర్తైంది. అభ్యర్థుల నుంచి భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఈసారి మొత్తం 2,79,956 దరఖాస్తులు వచ్చాయి. జులై 18వ తేదీ నుంచి డీఎస్సీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. గతంతో పోల్చితే దరఖాస్తులకు అదనంగా మరో లక్షమంది కొత్త అప్లికేషన్లు వచ్చాయి. మొత్తం 11,062 ఉద్యోగాల్లో....2,629 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నాయి. భాషా పండితులు 727, పీఈటీలు 182, ఎస్జీటీలు 6,508, ప్రత్యేక కేటగిరీలో స్కూల్ అసిస్టెంట్లు 220, ఎస్జీటీ (స్పెషల్ ఎడ్యుకేషన్) 796 ఉద్యోగాలు ఉన్నాయి.

**పరీక్ష విధానం**
డీఎస్సీ 2024 ఉద్యోగాల భర్తీని కంప్యూటర్ ఆధారిత రిక్రూట్‌మెంట్ టెస్ట్ కింది ఆన్‌లైన్లో నిర్వహిస్తారు. మొత్తం 80 మార్కులకు పరీక్ష ఉంటుంది. 160 ప్రశ్నలు ఉంటాయి. రెండు గంటల 30 నిమిషాల సమయం ఉంటుంది. డీఎస్సీ పరీక్షలో జనరల్ నాల్డెజ్, టీచింగ్ తో పాటు సబ్జెక్టు నుంచి ప్రశ్నలు ఉంటాయి. మిగతా 20 మార్కులకు టెట్ వెయిటేజ్ ఉంటుంది. రాతపరీక్ష తర్వాత టెట్ వెయిటేజీని కలిపి తుది జాబితాను ప్రకటిస్తారు.

# సంస్కరణలతో దేశ ప్రగతిని పరుగులు పెట్టించిన పీవీ

○ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్ :** సంస్కరణలతో దేశ ఆర్థిక ప్రగతిని పరుగులు పెట్టించిన ఘనత మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావుకు దక్కుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు జయంతిని పురస్కరించుకొని ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో పీవీ చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్రంలో వివిధ శాఖల మంత్రిగా, ప్రధానమంత్రిగా పి.వి. చేసిన సేవలు మరువరానివని పేర్కొన్నారు. ముఖ్యమంత్రితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఎన్.పద్మావతి రెడ్డి పి.వి. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# పార్టీని వీడి దొంగల్లో కలిసెటోళ్ల గురించి బాధలేదు



**(మొదటి పేజీ తరువాయి)**
ప్రగతి ప్రస్థానంలో చేరుకోవాల్సిన మైలురాళ్లు ఇంకా చాలా మిగిలి వున్నయని, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను,కలలను నెరవేర్చగలిగే అవగాహన మనకు మాత్రమే ఉన్నదని అన్నారు. తెలంగాణ ఆత్మను అర్థం చేసుకుంటూ సమస్యల లోతును పట్టుకోగలిగి పరిష్కరించగలిగే సత్తా ఉద్యమాన్ని నడిపించి రాష్ట్రాన్ని సాధించిన బిఆర్ఎస్ కు మాత్రమే ఉన్నదని కేసీఆర్ వివరించారు. బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ తో పార్టీ కార్యకర్తల సమావేశం శుక్రవారం కూడా కొనసాగింది. కోరుట్ల జగిత్యాల నియోజక వర్గాల నుంచి వందలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు నేతలతో కేసీఆర్ సమావేశమయ్యారు.

**ఆనాడు మనం ఉద్యమానికి దిగినప్పుడు మనతో ఎవరున్నారు.?**
ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ..”మనం రెట్టించిన ఉత్సాహంతో భవిష్యత్తులో ఇంకా బాగా ప్రజలకోసం పనిచేయాల్సి వుంది. ప్రజలు అవకాశమిస్తే..గత పదేండ్లు చిత్తశుద్ధితో రాజీపడకుండా ఉద్యమ ఆకాంక్షల సాధనదిశగా లక్ష్యం ప్రకారం పనిచేసి ప్రగతిని సాధించి ప్రజల మన్ననలను పొందినం.కుల మతాలకతీతంగా పని చేస్తూ వ్యవసాయం, సాగునీరు, విద్యుత్తు వంటి అనేక మౌలిక వ్యవస్థలను మెరుగుపరుస్తూ అనేక ప్రజా సమస్యలకు పరిష్కారం చూపినం. కుల వృత్తులను అభివృద్ధి చేసి గ్రామ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసినం. అయితే... అయితే కొన్ని కొన్ని సార్లు ప్రజాస్వామ్యంలో అబద్ధపు ప్రచారాలను నమ్మి ప్రజలు బోల్తపడుతుంటారు. మొన్నటి ఎన్నికల్లో అదే జరిగింది.అంతమాత్రాన నిరుత్సాహపడొద్దు. అధికారం ఉంటేనే పనిచేస్తామంటే పద్ధతికాదు. మనం ఏ హోదాలో వున్నకానీ ప్రజలకోసం పనిచేయాల్సిందే. అంతిమ లక్ష్యం తెలంగాణ ప్రజల సంక్షేమం అభివృద్ధి మాత్రమే. ఇంకా నెరవేరాల్సిన ప్రజల కలలను మనం మాత్రమే నెరవేరుస్తాం. ఆనాడు మనం ఉద్యమానికి దిగినప్పుడు మనతో ఎవరున్నారు.?నాడైనా నేడైనా నాయకులను తయారు చేసుకునేది పార్టీనే. మొన్న జగిత్యాల నుంచి ఒకాయన పోయి దొంగలల్ల కలిసిండు. బాధ పడేదేమీలేదు. ఆయనను తయారుచేసింది పార్టీనే . అంతకన్నా మెరుగైన నాయకత్వాన్ని పార్టీ తయారుచేసుకుంటది.” అని వివరించారు.

### కోరుట్ల ఎమ్మెల్యేకు కేసీఆర్ ప్రశంసలు

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కే. సంజయ్ కుమార్ ఒక పక్క డాక్టర్ గా మరోపక్క ఎమ్మెల్యే గా ప్రజాసేవలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని కేసీఆర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, మాజీ మంత్రి ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, కోరుట్ల ఎమ్మెల్యే డా సంజయ్ , ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, బాల్క సుమన్,జీవన్ రెడ్డి, జాజాల సురేందర్, గంప గోవర్ధన్, హన్మంత్ షిండే, ఎల్ రమణ, జగిత్యాల జెడ్పీ చైర్మన్ వసంత సురేష్, పెద్దపెల్లి టీఆర్ఎస్ నేత ఉష తదితరులు పాల్గొన్నారు.
అంతకుముందు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నేతలతో కేసీఆర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్టీ బలోపేతం పై చర్చించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్రెడ్డి, జీవన్ రెడ్డి, గంప గోవర్ధన్, జాజల సురేందర్, హన్మంత్ షిండే తదితరులు పాల్గొన్నారు.

# సౌత్ గ్లాస్ పరిశ్రమలో ఘోర ప్రమాదం



**(మొదటి పేజీ తరువాయి)**
సిబ్బంది, పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. మరణించిన వారి మృతదేహాలు ఛిద్రమవడంతో వారిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. మృతి చెందిన కార్మికులు అస్సాం, బీహార్ రాష్ట్రాలకు చెందిన వారిగా గుర్తించారు. బాధితుల్లో ఎక్కువ మంది ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే శంషాబాద్ డీసీపీ రాజేశ్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాద జరిగిన సమయంలో కంపెనీలో 150 మంది కార్మికులు పని చేస్తున్నట్లు సమాచారం. ఘటనా స్థలంలో ముమ్మరంగా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదంలో గాయపడ్డ కార్మికులను ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల్లో ఉత్తర ప్రదేశ్ కు చెందిన నికిత్ కుమార్ (22), రామ్ సెత్ (24), బీహార్ కు చెందిన రామ్ ప్రకాష్ (31), చిత్ర రంజన్ (31) ఒరిస్సాకు చెందిన రతికాంత్ (25) అనే యువ కార్మికులు దుర్మరణం పాలైనట్లు ఆర్డీవో మాధవరావు స్పష్టం చేశారు.

**సివియర్ యాక్షన్ ఉంటుంది: రాజేశ్, శంషాబాద్ డీసీపీ**
కంప్రెషర్ బ్లాస్ట్ లో ఐదుగురు చనిపోయారు. 10 మందికి గాయాలయ్యాయి. వేరు వేరు ఆసుపత్రుల్లో వారికి చికిత్స అందిస్తున్నారు. చనిపోయిన వారిలో ఉత్తరప్రదేశ్, బీహార్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన వారున్నారు. రెవిన్యూ అధికారులు కంప్లైంట్ తీసుకుని విచారణ చేస్తాము. ఆపరేషన్స్, షిఫ్ట్ మేనేజర్లను అదుపులోకి తీసుకుంటాము. ఇన్ స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, ఫైర్ డిపార్ట్ మెంట్ రిపోర్ట్ కూడా తీసుకుంటాము. ఘటనపై సివియర్ యాక్షన్ ఉంటుంది.

**గ్యాస్ సేఫ్టీ వాల్ పని చేయకపోవడంతో ప్రమాదం : శశాంక, రంగారెడ్డి జిల్లా కలెక్టర్**
గ్లాస్ ఫ్యాక్టరీ లోని నామినేషన్ చేసే మిషన్ వద్ద ఈ ప్రమాదం జరిగింది. గ్యాస్ సేఫ్టీ వాల్ పని చేయకపోవడంతో కంప్రెషర్ గేట్ ఒత్తిడికి గుర్రై పేలింది. ప్రాథమిక సమాచారం మేరకు ఐదుగురు చనిపోయారు. 10మందికి గాయాలయ్యాయి. వారు వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ప్రమాద విషయం తెలియగానే అన్ని శాఖల అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ముఖ్యమంత్రి అదేశాల మేరకు క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందిస్తున్నాము. లైటింగ్ లేకపోవడంతో ప్రమాద తీవ్రతను అంచనా వేయలేక పోతున్నాము.

**షాద్ నగర్ ఘటనపై అధికారులకు రేవంత్ ఆదేశాలు**
హైదరాబాద్ పరిధిలోని షాద్ నగర్ లో జరిగిన ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వెంటనే అధికారులను అప్రమత్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన వారిని వెంటనే ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు అందించాలని ఆదేశించారు. ఈ మేరకు కలెక్టర్ తో ఆయన ఫోన్ లో మాట్లాడారు. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ, కార్మిక, పరిశ్రమలు, వైద్య బృందాలు ఘటనా స్థలిలోనే ఉండి సమన్వయంతో సహాయక చర్యలు ముమ్మరం చేయాలని సీఎం ఆదేశించారు.

**కేసీఆర్ దిగ్భ్రాంతి...**
షాద్ నగర్ ప్రమాదంలో ఆరుమంది మృతి చెందడం, పలువురు గాయపడడం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మరణించిన కుటుంబాలకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతి తెలిపి, సంతాపం ప్రకటించారు. మరణించిన వ్యక్తుల కుటుంబాలను ఆదుకోవాలని, గాయపడిన వారికి తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించాలని కేసీఆర్ ప్రభుత్వాన్ని కోరారు.

**ప్రమాద ఘటనపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి**
షాద్ నగర్ సమీపంలోని పరిశ్రమలో జరిగిన



పేలుడు ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించారు. ఆ ప్రమాదంలో గాయపడిన వారిని తక్షణం ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందించాలని ప్రమాద స్థలన్ని పరిశీలించాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ, కార్మిక, పరిశ్రమలు, వైద్య బృందాలు ఘటనా స్థలంలోనే ఉండి సమన్వయంతో సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించారు.

**గాయపడిన వారిని పరామర్శించిన కలెక్టర్ శశాంక్**
సౌత్ గ్లాస్ ప్రవేట్ లిమిటెడ్ కంపెనీలో గ్యాస్ ఆటోక్ లేవు బ్లాస్ట్ జరగడం వలన ఆరుగురు చనిపోయారు. 12 మంది గాయాలైన వారు షాద్ నగర్ వి.వ ఆస్పటల్ లో ట్రీట్మెంట్ పొందుతున్న వారిని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్, మరియు జిల్లా డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, మరియు ఆర్డీవో వెంకట మాధవ్ డిప్యూటీ డీఎం ఎం హెచ్ ఓ డాక్టర్ విజయలక్ష్మి, ట్రీట్మెంట్ పొందుతున్న పేషంట్లతో మాట్లాడి పరామర్శించారు. మరియు వివా హాస్పిటల్ డాక్టర్ శ్రీనివాస్ అందరిని జాగ్రత్తగా ట్రీట్మెంట్ చేయమని తెలియజేశారు. మరియు బూర్గుల డాక్టర్ రాఘవేందర్ మరియు వారి టీం మెంబెర్స్ ని నైట్ డ్యూటీ పేషెంట్లు అందర్నీ ఫాలోఅప్ చేయమని అలాట్మెంట్ చేశారు.

**సంఘటన స్థలాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే**
ప్రమాదంలో గాయపడిన వారిని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పరామర్శించి, దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మరణించిన కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపి, సంతాపం ప్రకటించారు. ప్రమాదంలో మరణించిన కుటుంబాలను ఆదుకోవాలని, గాయపడిన వారికి తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

**భద్రత ప్రమాణాలపై ఎంపి డీకే అరుణ ఆరా**
ప్రమాదం పై మహబూబ్ నగర్ పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ స్పందించారు. సౌత్ గ్లాస్ పరిశ్రమలో రియాక్టర్ పేలి ఐదు మంది కార్మికులు దుర్మరణం పాలైన సంఘటనపై ఆమె తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మరణించిన కార్మికుల కుటుంబాలను పరిశ్రమ యాజమాన్యం ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె కోరారు. జరిగిన సంఘటనపై శంషాబాద్ డిసిపి రాజేష్ తో ఫోన్ ద్వారా మాట్లాడారు. సంఘటనకు సంబంధించిన విషయాలను ఆమె తెలుసుకున్నారు. అనంతరం ఆమె ఫోన్లో మీడియాతో మాట్లాడుతూ.. జరిగిన సంఘటన ఎంతో విషాదకరమని కార్మికుల కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తామని అన్నారు. ఐదు మంది చనిపోయారని మరి కొంతమంది గాయపడ్డారని అధికారులు పూర్తి వివరాలు సేకరిస్తున్నారని పూర్తి సమాచారం అందాక బాధితులకు జరగాల్సిన న్యాయం పై అధికారులతో మాట్లాడతానని డీకే అరుణ స్పష్టం చేశారు. పరిశ్రమలో కార్మికుల భద్రత సౌకర్యాలు తదితర కార్మిక సంక్షేమం విషయాలు పరిశీలిస్తామని చెప్పారు. ఈ సంఘటనలో తప్పు ఎవరిదైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అమాయకులైన వలస కార్మికుల ప్రాణాలకు పరిశ్రమల్లో భద్రత కరువైందని డీకే అరుణ విచారం వ్యక్తం చేశారు. సంఘటనపై సమగ్ర జరపాలని స్థానిక అధికారులకు ఆమె ఆదేశించారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు తగు న్యాయం చేయాలని ఆమె కోరారు. ఇదిలా ఉండగా పార్లమెంటు పరిధిలోని అనేక పరిశ్రమల్లో కార్మికుల భద్రత ప్రమాణాలపై ఎంపీ డీకే అరుణ ఆరా తీస్తున్నారు. రాష్ట్రస్థాయిలో డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారి పరిధిలో ఎలాంటి చర్యలు తీసుకున్నారు? స్థానిక ఫ్యాక్టరీ ఇన్స్పెక్టర్ ఈ సంఘటనపై ఏం విచారణ జరుపుతున్నారు? వాటి నివేదికలను తెప్పించుకుంటానని ఆమె స్పష్టం చేస్తున్నారు. పరిశ్రమల్లో వలస కార్మికుల బ్రతుకులు ఛిద్రం అవుతున్నాయని అనేక సంఘటనల ద్వారా మీడియా ద్వారా తెలుస్తున్నాయని వీటిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించేందుకు అవసరమైతే కేంద్ర స్థాయిలో ఫిర్యాదు చేయనున్నట్టు ఎంపీ డీకే అరుణ మీడియాకు తెలిపారు.



# మేడిగడ్డ బ్యారేజ్ మరమ్మతులకు బ్రేక్

**(మొదటి పేజీ తరువాయి)**
ఉంది. ఎగువున భారీ వర్షాలు కురుస్తున్నాయి. మహారాష్ట్ర నుంచి వస్తున్న వరద నీరు.. ప్రాణహిత నదికి భారీగా చేరుకుంది. ప్రాణహితలో వరద ప్రవాహం పెరిగి.. ఆ వరద మేడిగడ్డ బ్యారేజీకి రావడంతో.. బ్యారేజీ మరమ్మతు పనులు కొనసాగించే పరిస్థితులు లేకుండా పోయాయి. ప్రస్తుతం తాత్కాలికంగా మరమ్మతు పనులకు బ్రేక్ పడింది. రోజురోజుకి వరద ప్రవాహం పెరుగుతోంది. ఈ కారణంగా.. ఎగువున, దిగువున పనులు నిర్వహించే పరిస్థితులు లేవు. అన్ని గేట్ల నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. దాంతో మరమ్మతులు ఇక కొనసాగించలేము అనే నిర్ధారణకు అధికారులు వచ్చారు. ప్రస్తుతం యంత్రాలు అన్నింటిని బ్యారేజీ నుంచి బయటకు తీసుకొస్తున్నారు. బ్యారేజీలో 85 గేట్లు ఉండగా అందులో 84 గేట్లను పూర్తి స్థాయిలో లిఫ్ట్ చేశారు. 7వ బ్లాక్ లో 20వ గేటు మొరాయించడంతో గ్యాస్ కట్టర్ సాయంతో కట్ చేసి అందులోని భాగాలను విడదీశారు. 7వ బ్లాక్ లో ఉన్న అన్ని గేట్ల ద్వారా నీరు వెళ్లిపోయే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ప్రాణహిత నదితో పాటు గోదావరి పరివాహక ప్రాంతంలోనూ వర్షాలు కురుస్తుండటంతో రోజురోజుకి వరద ప్రవాహం పెరుగుతోంది. ప్రస్తుతానికి మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతు పనులకు తాత్కాలికంగా బ్రేక్ పడినట్లైంది.

# వలస ఎమ్మెల్యేలకు రేవంత్ రెడ్డి బిగ్ షాక్

**(మొదటి పేజీ తరువాయి)**
ఎంపిక చేయొచ్చన్నారు. ఫిరాయింపులకు తెలంగాణ ఒక్కటే ప్రత్యేకం కాదన్న ఆయన... కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ లలో కూడా ఎమ్మెల్యేలు ఫిరాయించారని గుర్తు చేశారు. నలుగురు రాజ్యసభ ఎంపీలతో బీఆర్ఎస్ ఏకంగా టీడీపీనే విలీనం చేసుకుందని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ బీఫామ్ పైన పోటీ చేసిన ఎమ్మెల్యేలకు మంత్రివర్గ విస్తరణలో ఛాన్స్ ఇస్తున్నట్టు స్పష్టం చేశారు. పీసీసీ చీఫ్, క్యాబినెట్ విస్తరణ నిర్ణయాలు ఒకే సారి ఫైనల్ అవుతాయని సీఎం రేవంత్ క్లారిటీ ఇచ్చారు. టీపీసీసీ చీఫ్ గా తాను రెండు ఎన్నికలు పూర్తి చేశానని, జూలై 7తో మూడేళ్లు పూర్తి కానున్నాయని తెలిపారు.

# పదేళ్లలో నేను పీసీసీ చీఫ్, సీఎం అవుతా..

**విశ్వంభర, నాంపల్లి :** పదేళ్లలో తాను పీసీసీ చీఫ్ అవుతానని, ఆ తర్వాత ముఖ్యమంత్రిని కూడా అవుతానని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... గాంధీ భవన్‌లో తనకు అటెండర్ పదవిని ఇచ్చినా తప్పకుండా చేస్తానన్నారు. తమ పార్టీ అగ్రనాయకులు సోనియా, రాహుల్ గాంధీలు ఏం చెబితే అదే చేస్తానన్నారు. అధిష్ఠానం తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటానని తెలిపారు. తాను ఢిల్లీలో పైరవీలు చేయడం లేదని... ఎవరు పీసీసీ అయినా పాలన బాగానే ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీల పవర్‌కు, ప్రధాని మోదీ పవర్‌కు చాలా తేడా ఉందన్నారు. పర్మినెంట్ పొలిటికల్ పవర్ సోనియా, రాహుల్ గాంధీలదే అన్నారు. కానీ రాజకీయాల్లో మోదీది తాత్కాలిక పవరే అని బీజేపీ వారు గుర్తించాలన్నారు. ప్రధానిగా ఆయన దిగిపోయాక బీజేపీలోనే పవర్ ఉండదన్నారు. ప్రజలు మూడోసారి చాలా కష్టంగా మోదీకి అధికారం అప్పగించారన్నారు. గత పదేళ్లలో తాను ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని అంగీకరించి... ఇప్పుడైనా వాటిని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గోద్రా అల్లర్లు, పుల్వామా ఘటనలపై పార్లమెంట్‌లో చర్చించే దమ్ము ఉందా? అని ప్రశ్నించారు. ఎమర్జెన్సీ అని మాట్లాడే బీజేపీ... ఆ సమయంలో లేనే లేదన్నారు. నాడు జనతా పార్టీలో ఉన్న వాజపేయి... ఇందిరా గాంధీని దుర్గామాతతో పోల్చారని గుర్తు చేశారు.

# జాతీయ రహదారుల నిర్మాణంలో వేగం పెంచండి

**విశ్వంభర, హైదరాబాద్ :**రాష్ట్రానికి రహదారులు జీవనాడులని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఇలాంటి రహదారులను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం మూలంగా గత మూడేండ్లలో కేంద్రం నుంచి అతితక్కువగా నిధులు తెలంగాణ రాష్ట్రానికి మంజూరు అయ్యాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇక నుంచి అలాంటి అలసత్వానికి తావులేకుండా కృషి చేయాల్సిన అవసరం ఉందని అధికారులకు మార్గనిర్దేశనం చేశారు. శుక్రవారం హైటెక్ సిటీలోని న్యాక్ ఆఫీసులో జాతీయ రహదారులపై సమీక్ష నిర్వహించిన మంత్రి ఎన్.హెచ్ , ఎన్.హెచ్.ఏ.ఐ అధికారులకు పలు సూచనలు చేశారు. రాష్ట్రానికి మణిహారంగా మారనున్న ఆర్.ఆర్.ఆర్ పై మరింత పకడ్బందీగా కసరత్తు చేయాలని చెప్పారు. జూలై మొదటి వారంలో రాష్ట్రానికి ఎన్.హెచ్. ఉన్నతాధికారుల బృందం రానున్న నేపథ్యంలో ప్రస్తుతం మంజూరీ అయి పనులు నడుస్తున్నవి, పలు అనుమతుల కోసం ఆగిపోయినవి, అప్ గ్రేడ్ కోసం విన్నవించిన జాతీయ రహదారులకు సంబంధించిన సమస్త సమాచారంతో సిద్ధంగా ఉండాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ డీపీఆర్ సిద్ధం**
ముఖ్యంగా ఆర్ఆర్ఆర్ విషయంలో అధికారులు ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా అధ్యాయనం చేయాలని.. ఎలాంటి పొరపాట్లకు తావు ఇవ్వకుండా పనులను ముందుకు తీసుకుపోదామని సూచించారు. అనంతరం ఎన్.హెచ్65 (హైదరాబాద్‌విజయవాడ) జాతీయ రహదారికి సంబంధించిన కాంట్రాక్ట్ ను ఫోర్ క్లోజ్ చేసి.. వచ్చే నెలలో కొత్త టెండర్లు పిలిచి.. సెప్టెంబర్ లో పనులు ప్రారంభించేలా ప్రణాళికలు రూపొందించామని.. ఇందులో ఎలాంటి అవంతరాలు ఎదురుకాకుండా ప్రతీది నిత్యం పర్యవేక్షించాలని జాతీయ రహదారుల సంస్థ ఆర్.ఓ. రాజాక్ ను ఆదేశించారు.

# 111 డాక్టరేట్ల డాక్టర్

## అత్యంత ప్రతిభాశాలి డాక్టర్ సాగి సత్యనారాయణ



**గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్సులో నాలుగుసార్లు చోటు**

**ఆస్కార్ ఇన్ ఎక్సెలెన్సీ దక్కించుకున్న ఘనపాఠి**

**2016 జనవరి 28న తొలి గిన్నిస్ రికార్డు**

**నంది అవార్డు అందజేసిన తెలంగాణ ప్రభుత్వం**

స్వల్ప వ్యవధిలో అనేక గ్రంధాలు రాసిన జ్ఞానయోగి వివిధ అంశాలకు సంబంధించి డాక్టర్ సాగి సత్యనారాయణ ప్రతిభాపాఠవాలకు అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ గుర్తింపు లభించింది. భారత ప్రతిభా రత్న అంటూ ఆస్కార్ సంస్థ ఆయనపై ప్రశంసల జల్లు కురిపించింది. వివిధ అంశాలపై ఆయన రాసిన పుస్తకాల పేర్లను ప్రస్తావిస్తూ 2020 డిసెంబర్ 25న ఆస్ట్రేలియాలో జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారం ప్రకటించింది.ఈ మేరకు ఆస్కార్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ డైరెక్టర్ గాల్వీ ఓ పత్రం పంపారు.


– విశ్వంభర, హైదరాబాద్


### నంది అవార్డుతో పురస్కారం

1980-2021 మధ్య కాలంలోనే ఇదంతా పూర్తయింది. ప్రస్తుతం రెండు విశ్వవిద్యాలయాలకు ఉపకులపతిగా వ్యవహరిస్తున్నారు. అందులో ఒకటి గుజరాత్ కేంద్రంగా పనిచేసే మహర్షి వేదవ్యాస ఇంటర్నేషనల్ వేదిక్ విశ్వవిద్యాలయం. 2020 ఫిబ్రవరి 15వ తేదీన డాక్టర్ సాగిని ఈ విశ్వవిద్యాయం “ఉపకులపతిగా నియమించింది. గుజరాత్ లోని మైక్రోబయాలజీ విశ్వవిద్యాలయానికి కూడా ఆయన వైస్ చాన్సలర్ గా పనిచేస్తున్నారు. 2020-21 సంవత్సరానికిగాను తెలంగాణ ప్రభుత్వం నంది అవార్డు అందజేయడమే కాకుండా సత్కరించింది.

### సత్యనారాయణకు ఆగని డాక్టరేట్లు

డాక్టర్ సాగి సత్యనారాయణ ప్రతిభాపాఠవాలకు గుర్తింపు లభిస్తూనే ఉంది. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ కేంద్రంగా పనిచేస్తున్న మా భువనేశ్వరి విశ్వవిద్యాలయం...ఈ డాక్టర్‌గారికి మరో డాక్టరేట్ ఇచ్చి సత్కరించింది. అలాగే తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వేదిక్ విశ్వవిద్యాలయం ఇంకో డాక్టరేట్, గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న వేదిక్ హిందూ విశ్వవిద్యాలయం మరో డాక్టరేట్‌ను అందజేశాయి. వైద్యుడిగా కొనసాగుతున్న ఈ డాక్టరేట్ల డాక్టర్‌ను ఈ సందర్భంగా సన్మానించాయి.









### ప్రపంచంలోనే అత్యధిక డాక్టరేట్లను సాధించిన వ్యక్తిగా..

మల్కాజ్‌గిరి నివాసి డాక్టర్ సాగి సత్యనారాయణ. వైద్యుడిగా కొనసాగుతూనే మూడు దశాబ్దాల కాలంలో ఆధ్యాత్మికం, వైద్యం, జ్యోతిష్యం,యోగ తదితర అంశాలపై తెలుగు ఆంగ్ల భాషల్లో 180 పుస్తకాలు రచించారు. వీటిద్వారా ఇప్పటి వరకు నాలుగు గిన్నిస్ రికార్డులను దక్కించుకున్నారు. తొలి గిన్నిస్ రికార్డును 2016 జనవరి 28న అందుకోగా రెండోది అదే ఏడాది ఆగస్టులో వచ్చింది. మూడో గిన్నిస్ రికార్డును 2019 అక్టోబర్ 3వ తేదీన దక్కించుకున్నారు. 2022 ఆగస్టు 22న నాలుగోసారి గిన్నిస్ వరల్డ్ రికార్డును సాధిం చారు. ప్రపంచవ్యాప్తంగా అనేక విశ్వవిద్యాలయాలనుంచి అత్యధికంగా111 డాక్టరేట్లను పొందారు డాక్టర్ సాగి సత్యనారాయణ. ఇందులో డాక్టర్ ఆఫ్ సైన్స్ 15 .. డాక్టర్ ఆఫ్ లిటరేచర్లు 25తోపాటు 71 డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీలను దక్కించుకున్నారు. ఇదంతా కేవలం 41 ఏళ్ల వ్యవధిలోనే సాధించారు. ఇప్పటివరకు అత్యధికంగా 180 గ్రంధాలను రచించారు. మొత్తం 111 డాక్టరేట్లను ఆయన సొంతం చేసుకున్నారు. ప్రపంచంలోనే అత్యధిక డాక్టరేట్లను సాధించి న గొప్ప వ్యక్తిగా నిలిచారు.

# రాష్ట్రంలో తుగ్లక్ పాలన

- మంత్రులు కేవలం డమ్మీలుగా ఉన్నారా
- తెలంగాణలో ఫేక్ ప్రభుత్వం నడుస్తోంది
- కాంగ్రెస్‌పై మన్నే క్రిశాంక్ ఫైర్



**విశ్వంభర, హైదరాబాద్:** నకిలీ బీర్లు తయారు చేసే సోమ్ డిస్టిలరీస్‌కు అనుమతులు ఇచ్చిన విషయం తనకు తెలియదని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చెబుతున్నారని... అసలు ఇది ప్రజాపాలనా? తుగ్లక్ పాలనా? అని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ ప్రశ్నించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులందరూ ఏది అడిగినా తమకు తెలియదని, సంబంధం లేదని చెబుతున్నారని విమర్శించారు. తెలంగాణలో ఫేక్ ప్రభుత్వం నడుస్తోందనడానికి ప్రస్తుత ముఖ్యమంత్రి, మంత్రుల పరిస్థితిని చూస్తే అర్థమవుతోందన్నారు. రెండు సంవత్సరాల నుంచి రద్దు చేస్తూ వచ్చిన కాంట్రాక్టు మూడు రోజుల్లో ఎలా ఇచ్చారు..? అని క్రిశాంక్ ప్రశ్నించారు. టెండర్ లేకుండా కోట్ల రూపాయల కాంట్రాక్టు ఎలా ఇచ్చారు? అని నిలదీశారు. మూడు రోజుల్లో ఆర్టీసీ డెలిగేషన్ దేశం మొత్తం వెళ్లి స్టడీ చేసిందా? అని అడిగారు. ఏయే రాష్ట్రాలకు వెళ్లారు. ఏ అధికారులను కలిశారు. వాళ్ళు ఏం డీటెయిల్స్ ఇచ్చారు అని ఆర్టీఐ ద్వారా సమాచారం కోరితే ఆర్టీసీ అధికారుల సింపుల్‌గా ఆర్టీసీ టిక్కెటింగ్ మెషీన్ల కాంట్రాక్టుపై మేం వివరణ ఇవ్వలేము, అది మా పరిధిలో లేదు అన్నారని క్రిశాంక్ తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్న మంత్రులు.. కేవలం డమ్మీలుగా ఉన్నారా? వారి నిర్ణయాలు డమ్మీగా ఉన్నాయా? అధికారులు మంత్రులకు చెప్పడం లేదా? లేదా తప్పించుకునేందుకు మంత్రులే సాకులు చెబుతున్నారా? అసలు సీఎం రేవంత్ రెడ్డి ఏం చేస్తున్నారు? అని నిలదీశారు. ఆయనకు సమాచారం లేకుండానే పోలీస్ శాఖ వారు రాత్రి పదిన్నర వరకు పౌరులపై ఆంక్షలు పెడుతున్నారా? చెప్పాలన్నారు. ఈ అంశంపై మీడియాలో, సోషల్ మీడియాలో చర్చ జరిగినప్పుడు మాత్రం, తప్పుడు న్యూస్ అని ముఖ్యమంత్రి, మంత్రులు చెబుతున్నారన్నారు. కోట్లాది రూపాయల ఆర్టీసీ టిక్కెటింగ్ కాంట్రాక్ట్ గురించి తనకు సమాచారం లేదని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అంటున్నారని విమర్శించారు. ఈ పరిణామాలు చూస్తుంటే ప్రభుత్వాన్ని కాంగ్రెస్ నడిపిస్తున్నట్లుగా కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. తుగ్లక్ పాలన కనిపిస్తోందన్నారు. ఏ విషయం గురించి అడిగినా తమకు తెలియదని మంత్రులు అంటున్నారని, మరి ప్రభుత్వం ఎలా నడుస్తుందో చెప్పాలని మన్నే క్రిశాంక్ డిమాండ్ చేశారు.

## ఓమ్ని హాస్పిటల్ ఆధ్వర్యంలో రేపు ఉచిత న్యూరోవైద్య శిబిరం

**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని సూరారం గ్రామంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి డా బీఆర్ చారి బెస్ట్ మెడ్ క్లినిక్‌లో మెదడు, వెన్నుపూస, శస్త్ర చికిత్స నిపుణులు, ఓమ్ని హాస్పిటల్ హైద్రాబాద్ సీనియర్ న్యూరో సర్జన్ డా”ప్రవీణ్ అంకతి (%వీజన%) ఆధ్వర్యంలో ఉచిత న్యూరోవైద్య శిబిరం నిర్వహించబడునని, కావున మహాదేవపూర్ మండలంలోని పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీఆర్. చారి బెస్ట్ మెడి క్లినిక్ వారు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9014104631 ఫోన్ నెంబర్‌లో సంప్రదించవలసిందిగా కోరారు.

## ప్రతీ సోమవారం ఎంఆర్‌వో కార్యాలయంలో ప్రజావాణీ

**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాల మేరకు భూసంబంధిత సమస్యలపై ప్రతి సోమవారం ఉదయం 10:30 నుంచి 1:00 గంటల వరకు ప్రజావాణి కార్యక్రమము మహాదేవపూర్ తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించబడునని మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని మహాదేవపూర్ ఎంఆర్‌వో ప్రహ్లాద్ రాథోడ్ ఒక ప్రకటనలో తెలిపారు.






# సింగరేణికి గనులు కేటాయించి ప్రభుత్వ రంగ సంస్థను కాపాడాలి



దేశవ్యాప్తంగా 60 గనులను కేంద్రం వేలం వేయుచున్న నేపథ్యంలో తెలంగాణలోని 'శ్రావణపల్లి' గనితో పాటు గతంలో రెండున్నర సంవత్సరాల క్రితం వేలం వేసి ప్రైవేటు వారికి కేటాయించినప్పటికీ వారు ఉత్పత్తి ప్రారంభించినందున వాటిని కూడా సింగరేణికి కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతున్నది. తెలంగాణ నుంచి రెండవ సారి పార్లమెంటు సభ్యులుగా ఎన్నికైన జి.కిషన్ రెడ్డి కేంద్ర గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి వారి సారద్యంలోనే హైదరాబాదులో ఈ నెల జూన్ 21 నుండి గనుల వేలంపాట నిర్వహిస్తున్నందున ఆయన సింగరేణిని కాపాడుకుంటామని గత ఎన్నికల్లో వాగ్దానం చేసిన మేరకు.. ఈ వేలములో తెలంగాణలోని 'శ్రావనపల్లి' గని సింగరేణికి కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం, ప్రతిపక్ష పార్టీలు, కార్మిక సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

**ప్రైవేటీకరణ విధానమే ముద్దు అంటున్న మోడీ :**

నరేంద్రమోడీ నాయకత్వం లోని ఎన్,డీ.ఏ ప్రభుత్వం ఎల్.జీ.పీ( లిబరలైజేషన్, గ్లోబలైజేషన్, ప్రైవేటైజేషన్) విధానాలతో ముందుకు వెళుతున్నది. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ వారికి అప్పజెప్పేందుకే మొగ్గు చూపుతుంది. 'తమ ప్రభుత్వం వ్యాపారం చేయదని' అందుకే ప్రభుత్వ రంగ పరిశ్రమలు ప్రైవేటికరిస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 2014 లో అధికారంలోకి వచ్చిన వెంటనే స్పష్టమైన ప్రకటన చేశారు. దానికి అనుగుణంగానే ప్రైవేటీకరణ స్పీడును పెంచారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మటానికి డీస్ ఇన్వెస్ట్మెంట్ కొరకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేశారు. అందుకు అనుగుణంగానే '2015 మార్చి 4, 20 తేదీలలో పార్లమెంటు ఉభయ సభల్లో "బొగ్గు గనుల నిబంధనల ప్రత్యేక చట్టం 2015" ఆమోదించారు. ప్రభుత్వ బోగ్గు పరిశ్రమకు రక్షణగా ఉన్న "బొగ్గు గనుల జాతీయకరణ చట్టం 1973" ను 2018 జనవరి 18న రద్దు చేశారు." మైన్స్ అండ్ మినరల్ (డెవలప్మెంట్ అండ్ రెగ్యులేషన్) యాక్ట్2016 ప్రకారం వేలం పాటలు నిర్వహిస్తున్నారు. వేలం ప్రాతిపదికన బొగ్గు గనులను కేటాయిస్తున్నారు. దీనితో ప్రభుత్వ బొగ్గు పరిశ్రమ భవిష్యత్తుపై ఆందోళనలు ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలో సంస్కరణలను మరింత స్పీడ్ గా అమలు చేపడుతున్నామని కేంద్ర ఆర్థిక మంత్రిగా నిర్మల సీతారామన్ బాధ్యతలు చేపడుతూ ప్రకటించారు. అందుకు వారు ఎంచుకున్నది, గత సంవత్సరంపాటుగా వాయిదా పడుతు వస్తున్న బొగ్గు గనులను వేలం ద్వారా ప్రైవేట్ వారికి అప్పజెప్పాలని నిర్ణయించారు.

**సింగరేణి నేపథ్యం :**

1889 లో బొగ్గు ఉత్పత్తి ప్రారంభమైన 135 ఏండ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన సంస్థ. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రధాన భాగస్వామ్యమైన సంస్థ. పాలకులు అనుసరిస్తున్న విధానాలకు గతంలో నష్టాలకు గురవుతూ బీఐఎఫ్ఆర్( బోర్డ్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఫైనాన్స్ రీ కన్స్ట్రక్షన్ ) పరిధి నుండి కాపాడుకున్నారు. 19981999 నుండి నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించుతూ లాభాలను సాధించుతున్నారు. సింగరేణిలో కేంద్రం వాటా 49 శాతం ఉండగా, 51 శాతం వాటాలు రాష్ట్ర ప్రభుత్వం కలిగి ఉన్నది. గడచిన పదేండ్లలో సింగరేణి కేంద్ర, రాష్ట్రా ప్రభుత్వాలకు రు. 49,666 కోట్లను పన్నుల రూపములో చెల్లించింది. రాష్ట్ర ప్రభుత్వానికి 9 రకాల టాక్సు, రాయల్టీల రూపములో రూ. 23,446 కోట్లను చెల్లించగా, కేంద్ర ప్రభుత్వానికి 21 రకాల పన్నుల ద్వారా రూ. 26,207 కోట్లు చెల్లించింది.

**బొగ్గు నిల్వలు తగ్గిపోతు మూసివేసేదశలో 11 బావులు:**

సింగరేణి పరిధిలో 17ఓపెన్ కాస్ట్, 27 అండర్ గ్రౌండ్(యుజీలు) గనులలో బొగ్గు వెలికితీయడం జరుగుతున్నది. మొదట్లో సింగరేణి వ్యాప్తంగా ఒక లక్ష 16 వేలకు పైగా కార్మికులు విధులు నిర్వర్తించే వారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆర్థిక సంస్కరణలు రావడం, మిషన్ మైనింగ్ యాంత్రీకరణ లాంటి సంస్కరణలు రావడంతో ప్రస్తుతం 42 వేల మంది కార్మికులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. గనులలో బొగ్గు నిల్వలు తగ్గిపోతూ రాబోవు 5 సంవత్సరాలలో 8 భూగర్భ గనులు, 3 ఓపెన్ కాస్టు మూతపడే పరిస్థితి దాపురించబోతున్నది. ఈ 10 సంవత్సరాల కాలంలో మరో 11 బావులు మూతపడనున్నాయి. కొత్త బొగ్గు బావులు త్రవ్వటం లేదు.

**సింగరేణికి కేటాయించాలని కార్మిక సంఘాలు అదోళనలు:**

సింగరేణిలోని 11 బొగ్గు డివిజన్ లలో ఏఐటీయూసీ, సీఐటీయూ అనుబంధ కార్మిక సంఘాలు పెద్దఎత్తున కేంద్రప్రభుత్వ వైఖరి నిరసిస్తూ జూన్ 21, 22 తేదీలలో సింఘరేణికి కేటాయించాలని కోరుతు ధర్నాలు, ప్రదర్శనలు సభలు చేపట్టారు.

**కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి :**

సింగరేణి ప్రాంతములోని శ్రావణపల్లి బొగ్గుగని వేలం వేస్తే ఊరుకోమని రాష్ట్ర తరపున పోరాడి తీరుతామని, రాష్ట్రంలోని బొగ్గు బ్లాకులన్నింటిని సింగరేణికి కేటాయించాలని నేడు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే వేలంలో తెలంగాణ గనులను సింగరేణికే కేటాయించాలని, ప్రధానమంత్రి నరేందర్ మోడీతో మాట్లాడి ఒప్పించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. అఖిల పక్షంతో ప్రధాని వద్దకు వెళ్తామని ఆర్థిక శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు.



- ఉజ్జిని రత్నాకర్ రావు
సెల్ :9490952646
ఏఐటీయుసీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి

## 60 బ్లాకుల వేలం

హైదరాబాద్ కేంద్రంగా దేశవ్యాప్తంగా ఉన్న 60 బ్లాక్ ల వేలం జరుగుతుంది. అందులో సింగరేణి గనుల మధ్యలో ఉన్న'శ్రావణపల్లి' బ్లాక్ ( శ్రీరాంపూర్, మందమర్రి)మధ్యలో ఉంది. వేలం ప్రక్రియను కేంద్రమంత్రి జీ కిషన్ రెడ్డి ప్రారంభిస్తున్నందున ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హాజరై శ్రావణ పళ్లి గనిని సింగరేణికి కేటాయించాలని కేంద్రాన్ని కోరారు. ఈ బ్లాక్ లో 11.99 కోట్ల టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లు గతంలోనే సింగరేణి నిర్వహించిన అన్వేషణలో తేలింది. అయితే సింగరేణి తాజా వేలంపాటలో పాలుగోని రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. సింగరేణి ప్రాంతంలో కొత్తగా మూడు బ్లాకులలో బొగ్గు నిల్వలు ఉన్నాయని స్వయంగా సింగరేణి అన్వేషించి గుర్తించింది. అయితే రెండున్నర ఏళ్ల క్రితం తెలంగాణలోని రెండు బ్లాకులను కేంద్ర ప్రభుత్వం వేలం వేసిన సందర్భంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వేలానికి దూరంగా ఉండిపోవాలనే నిర్ణయం మేరకు వేలంలో పాలుగోనలేదు. దాంతో సత్తుపల్లి బ్లాక్ -3, కోయగూడెం బ్లాక్ -3(ఇల్లందు) గనులను సింగిల్ బిడ్డర్లుగా ప్రైవేట్ సంస్థలు దక్కించుకున్నాయి. అయితే అవి బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించ లేకపోయాయి. బొగ్గును వెలికి తీసే సాధన సంపత్తి ఆ సంస్థలకు లేకపోవడమే ఈ పరిస్థితికి కారణమని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ రెండు బ్లాకులను కూడా తమకు కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. వేలంలో దక్కించుకున్న సంస్థలకు విధించిన షరతులన్నీ తాము నెరవేర్చడానికి సిద్ధంగా ఉన్నామని కూడా చెప్పింది. గతలో బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి పెంచకుండా వారి అనుచరులకు ఇప్పించుకుంది.

## పలు భావాల సమాహారం

# ఫొటోగ్రఫీ

### జాతీయ కెమెరా దినోత్సవం సందర్భంగా




ఎన్నో భావాలను ఒక్క చిత్రంతో తెలిపే గొప్పదనం ఒక్క ఫొటోగ్రఫీకి ఉంది. ఈ ఆధునిక కాలంలో మానవ జీవితంతో ఫొటోగ్రఫీకి విడదీయలేని బంధం ఉంది. ఫొటోగ్రఫీకి శతాబ్దాల చరిత్ర ఉంది. రసాయనాలతో రూపొందించిన ప్లేటుపై కాంతిచర్యతో ఓ రూపాన్ని బంధించడాన్ని ఫొటోగ్రఫీ అంటారు.

రెండు గ్రీకు పదాల కలయికే ఫొటోగ్రఫీ. "ఫోటో అంటే చిత్రం", "గ్రఫీ అంటే గీయడం" అని అర్థం. ఫొటోగ్రఫీ అంటే కాంతితో చిత్రాన్ని గీయడం. 18వ శతాబ్దంలో పారిస్‌లో నలుకు తెలుపులతో ప్రారంభమైన ఫొటోగ్రఫీ కాల క్రమంలో రంగులు అద్దుకుంటూ కొత్త పుంతలు తొక్కుతోంది. ఫ్రాన్స్‌కు చెందిన లూయిస్ జే.ఎం.డాగ్యూరే 1837లో ఫొటోగ్రఫీ ప్రాసెస్‌ను కనుగొన్నారు. 1839 జనవరి 9న ఫెంచ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ డాగ్యురే టైప్ ప్రాసెస్‌ను అధికారికంగా ప్రకటించింది.

పూర్తి రూపం ఇచ్చి ఫొటోగ్రఫీ అనే ప్రక్రియను ప్రపంచానికి తెలియ జెప్పేందుకు ఆ తర్వాత మరో 280 సంవత్సరాలు పట్టింది. ఈ మధ్యలో ఎందరెందరో పరి శోధకులు ప్రయోగాత్మకంగా దృశ్యాన్ని లోహం మీద బంధించేందుకు ప్రయత్నాలు చేశారు. కానీ చివరికి ఆ ఖ్యాతి దక్కింది ఎల్.జె.ఎల్. కు, 1837 ఫ్రెంచి ప్రభుత్వం ఆకాడమీ ఆఫ్ సైన్సెస్ వారి ముందు డాగురే తాను కనుగొన్న ఒక కొత్త పరికరాన్ని ప్రదర్శించాడు. బయటవున్న చిత్రాన్ని ఒక నల్లటి ఫలకంపై ముద్రించి, ఆ పైన దానిని ప్రాసెస్' చేసి ఆ చిత్రాన్ని శాశ్వతంగా ప్రదర్శించ గలిగినదే ఆ ప్రక్రియ. అది జరిగింది జనవరి 9, 1839. ఆ అద్భుత మైన ఆవిష్కారానికి హక్కులు పరిశోధకుడికి ఇచ్చారు. అయితే ఇది ఒక వ్యక్తి హక్కు కాకూడదని భావించిన ఫ్రాన్స్ ప్రభుత్వం, ఆ పాటోగ్రఫీ పేటెంట్ తాను కొనుగోలు చేసి, ప్రపంచానికి ఉచిత బహుమతిగా ప్రకటించిన తేదీ ఆగష్టు 19, 1839. అలా ప్రపంచమంతా పోటోలు తీసుకునే హక్కును పొందిన ఆ తేదీని ప్రపంచ పాటోగ్రఫీ దినోత్సవంగా జరుపు కుంటారు.

డిజిటల్ కెమెరా, చిత్రాలు మరియు వాటి ఆవిష్కరణ జ్ఞాపకార్థం జూన్ 29 న జాతీయ కెమెరా దినోత్సవం జరుపుకుంటారు. డిజిటల్ కెమెరా అనే పదం లాటిన్ పదబంధం “డిజిటల్ కెమెరా అబ్స్క్యూరా” నుంచి ఉద్భవించింది, ఇది “చీకటి గది” అని సూచిస్తుంది. ప్రపంచంలోని మొట్టమొదటి ఛాయాచిత్రాన్ని 1826 లో ఫ్రెంచ్ శాస్త్రవేత్త జోసెఫ్ నికోఫోర్ నిప్సే డిజిటల్ కెమెరా అబ్స్క్యురాతో తీశారు. ప్రాధమిక 35 ఎంఎం ఎస్ఎల్ఆర్ డిజిటల్ కెమెరాను ఇహాగీ క్లైన్ ఎక్సాక్తా 1 ప్రారంభించింది. ప్రాధమిక రంగు ఛాయాచిత్రం 1861 ను స్కాటిష్ భౌతిక శాస్త్రవేత్త జేమ్స్ క్లర్క్ మాక్స్వెల్ ప్రారంభించారు. ప్రపంచంలోని మొట్టమొదటి రంగు ఛాయాచిత్రం గులాబీ, నీలం మరియు పసుపు వడపోతల ద్వారా 3 సార్లు ఫోటో తీయడం ద్వారా ఉత్పత్తి చేయబడిన టార్టాన్ రిబ్బన్, ఇది ఒక రంగు మిశ్రమంగా తిరిగి కలపబడింది. 1878 లో, ఇంగ్లీష్ ఫోటోగ్రాఫర్ ఈడ్వర్డ్ ముయిబ్రిడ్జ్ చలనంలో మొదటి ఛాయాచిత్రాన్ని రూపొందించారు. తరువాత ఇది మొదటి కదలిక ఫోటోలకు దారితీసింది.నీటి అడుగున ఫోటోగ్రాఫ్‌ను గల్ఫ్ ఆఫ్ మెక్సికోలోని ఫ్లోరిడా కీస్‌ను డాక్టర్ విలియం లాంగ్లీ మరియు నేషనల్ జియోగ్రాఫిక్ వర్కర్స్ ఫోటోగ్రాఫర్ చార్లెస్ మార్టిన్ 1926లో తీశారు. నాసా యొక్క అపోలో 11 మూన్ మిషన్లలోని ఛాయాచిత్రాలను స్వాధీనం చేసుకోవడానికి ఉపయోగించిన మూవీని కొడాక్ తయారు చేసింది. ప్రస్తుతం, అతి పెద్ద డిజిటల్ కెమెరా కలగలుపు ముంబైకి చెందిన ఫోటో జర్నలిస్ట్ దిలీష్ పరేఖ్ సొంతం. అతను 4,425 పాతకాలపు కెమెరాలను కలిగి ఉన్నాడు.

మనదేశంలో 1857 వరకు ఫోటోగ్రఫీ అందుబాటులోకి రాలేదు. కేవలం బ్రిటిష్ రాజు, జమీందారులు, సిపాయిలు మాత్రమే దీనిని ఉపయోగించే వారు. 1977 నుంచి ఫోటోగ్రఫీ సామాన్యులకు అందుబాటులోకి వచ్చింది. భారత్‌లో మొట్ట మొదటి సారిగా లాలా దీనదయాళ్ ఫొటోగ్రఫీకి శ్రీకారం చుట్టారు. సమయం, సందర్భం ఏదైనా, నేడు ఫోటో లేని జీవితం ఊహించుకోలేం.

ఎన్నో భావాలను ఒక్క చిత్రంతో తెలిపే గొప్పదనం ఒక్క ఫొటోగ్రఫీకి ఉంది. ఈ ఆధునిక కాలంలో మానవ జీవితంతో ఫొటోగ్రఫీకి విడదీయలేని బంధం ఉంది. అప్పుడే పుట్టిన పసిబిడ్డ నుంచి అంతిమ యాత్ర వరకు ప్రతి దశ కెమెరాతో బంధించాల్సిందే. ఇప్పుడు ప్రతి సెల్ ఫోన్ ఒక కెమెరా. సెల్ ఫోన్ వున్న ప్రతి ఒక్కరూ ఫొటోగ్రఫీ లో నైపుణ్యం పొందుతున్నారు. ఫోటోగ్రాఫర్ తీసే ఫోటో చూస్తే కలిగే ఆనందం వేరు. నలుపు తెలుపు అయినా, సప్త వర్ణాలతో తీసింది అయినా మనసును తట్టి తీరుతుంది. ఎందరెందరో కెమెరాతో ట్రిక్కులు చేస్తున్నారు. తమ సృజనను ప్రదర్శిస్తున్నారు.

> నాగరికంగా మనిషి ఎదగటం మొదలైన దశలో మానవుడికి తాను చూస్తున్న వాటిని వారసత్వ సంపదగా అందించాలనే కోరిక ఉండేది. కోరిక నుండి ఉద్భవించిన మహాద్భుతమే ఫోటోగ్రఫీ. ఎక్కడో రాతి గుహల గోడల మీద సూర్యకాంతి పడిన చోట నల్లగా మారటం గమనించి, కొన్ని రసాయనాలు వెలుతురు పడిన మేర నల్లటి ఆకృతిని ఏర్పరుస్తాయన్న విషయం అర్థంచేసుకుని క్రమంగా ఫొటోగ్రఫీ ఆవిర్భావానికి బీజం వేశాడు మానవుడు.

- రామకిష్టయ్య సంగనభట్ల
9440595494

# బడ్జెట్ కేటాయింపులో సమతుల్యత – సమగ్రత

మన దేశంలో మెజార్టీ ప్రజలు గ్రామాల్లో నివసిస్తున్నారు. అధిక సంఖ్యాకులు వ్యవసాయం మీదనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ప్రతి రైతు తమ పంటలను రెండు విధాలుగా ఎంచుకుంటాడు.

1) స్వల్పకాలిక పంట 2) దీర్ఘకాలిక పంట

స్వల్పకాలిక పంటల్లో కూరగాయలు, ఆహార ధాన్యాలు, ఇక దీర్ఘ కాలానికి వస్తే పండ్ల తోటలు అవి 5 లేదా 10 సంవత్సరాలలో ఆదాయం వచ్చే లాగా ప్రణాళిక వేసుకుంటాడు. ప్రభుత్వం కూడా ఇదే పద్ధతి అనుసరిస్తే మంచిది.

"సంక్షేమం అభివృద్ధి" రెండూ, రెండు కండ్లే. సంక్షేమం ఫలితాలు వెంటనే ఫలితం కాపాడుతుంది. ఇక అభివృద్ధి అనేది వేల క్రమంలో ఫలితం కనపడుతుంది. 1950 నుంచి 1985 వరకు కేంద్ర ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రయోజనాలకు పెద్ద పీట వేశానారు. సాగునీటి భారీ ప్రాజెక్టులు, భారీ పరిశ్రమలు స్థాపించారు. వాటి ఫాలితాలు మనం అనుభవిస్తున్నదే. 1985లో ప్రారంభమైన సంక్షేమ పథకాలు 2019 24 వరకు అవి తీరా ప్రజాకర్షక పథకాలుగా మారాయి.

మనకు ఎన్నో జీవనదులున్నాయి. "ఉప్పొంగే నదీ జలాలు ఉప్పు సముద్రం పాలు" అన్నాడొక కవి. నాడు నెహ్రూ ప్రధానిగా కట్టిన భారీ నీటి పారుదల ప్రాజెక్టులు తప్పితే నేటికి ఒక్క భారీ నీటి ప్రాజెక్టు కట్టినట్టు కనపడటం లేదు. 30 కోట్ల జనాభా నుండి నేటికి 140 కోట్లకు చేరింది. జనాభా ఇంకా పెరిగే అవకాశం వుంది. పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని ఆహార ధాన్యాల ఉత్పత్తికి ప్రణాలికలు రచించాలి."

నదుల అనుసంధానం" అనేది కాగితాల పైనే ఉన్నది. కార్య రూపం దాల్చలేదు.

రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఒక్క తాటికి చేర్చి "నదుల అనుసంధానం" జరిగితే రైతులు వర్షాల కొరకు నిరీక్షించే బాధ తప్పుతుంది. ఆహార ధాన్యాల ఉత్పత్తి మరియు వరద నష్టాల నివారణ జరగగలదు.

సంక్షేమానికి నిధుల కేటాయింపు ఎవ్వరూ వ్యతిరేకించరు. అభివృద్ధికి కేటాయింపుల తరువాతనే ప్రాధాన్యత ఇవ్వాలి. అభివృద్ధిని మరిచి సంక్షేమానికి పెద్దపీట వేసిన దేశాలు కుప్పకూలిన ఉదాహరణలు కలవు. మన అదృష్టం కొద్ది మన దేశ జనాభాలో యువత 30% అని లెక్కలు చెబుతున్నాయి. నేటి యువతే మనకు భవిత, వారికి ఉపాధి, ఉద్యోగాలు కల్పించాలి. ఈ సమస్యాను యుద్ధ ప్రాతిపదికగా కార్యాచరణ ప్రణాళికలు రచించాలి. ప్రభుత్వ రంగంలో పరిశ్రమలు స్థాపించాలి. లేదా ప్రైవేటు పరంగా పరిశ్రమల స్థాపనకు ప్రోత్సహించాలి. వారికి కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించాలి. నైపుణ్య శిక్షణ కేంద్రాలను అధిక సంఖ్యలో ఏర్పాటు చేయాలి. అప్పుడే యువతకు "ఉపాధి ఉద్యోగ" అవకాశాలు ఉంటాయి.



140 కోట్ల జనాభాను దృష్టిలో ఉంచుకొని వైద్య సౌకర్యాలపై శ్రద్ధ వహించి, వైద్య కళాశాలలు, ఆసుపత్రులు స్థాపించాలి. విద్యా రంగంలో కూడా "చదువు ఆర్జన" పథకాల గురించి అలోచించాలి. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం రావాలంటే స్థానిక సంస్థలను బలోపేతం చేయాలి. "విధులు నిధులు" సక్రమంగా అమలయ్యేలా చూడాలి. పాలన వికేంద్రీకరణ జరిపి పట్టణాలకు వలసలు తగ్గగలవు.

రాష్ట్రాల నుంచి కేంద్రానికి పన్నుల రూపంలో గణనీయంగా నిధులు వస్తున్నాయి. రాష్ట్రాల నుంచి వచ్చిన ఆదాయంలో కేటాయింపులకు ఒక ప్రాతిపదిక ఉండాలి. ఒక రాష్ట్రానికి 60%, వేరొక రాష్ట్రానికి 100%, 120% కేటాయింపులు జరిగినవన్న విమర్శలు వినవస్తున్నాయి. కేటాయింపుల్లో వివక్ష చూపడం ఫెడరల్ వ్యవస్థకు మంచిది కాదు. దేశ సమైక్యతకు, సమగ్రతకు, మనస్పర్ధలకు తావిచ్చినవారవుతారు.

కొత్త మెడికల్ కాలేజీలు, నవోదయ పాఠశాల కేటాయింపులో కొన్ని రాష్ట్రాలను విస్మరించినట్టుగా వార్తలొచ్చాయి. ఈ వివక్ష ఏ మాత్రం మంచిది కాదు.

"సమభావన సహజీవనం" అనే సూత్రం పాటించాలి. సగటు మనిషి ఆశలను, ఆకాంక్షలను వచ్చే బడ్జెట్ ప్రతిబింబించాలని ప్రజలు ఆశిస్తున్నారు.

***"సర్వేజనా సుఖినోభవంతు"***



- జిన్నం అంజయ్య
రచయిత, కవి,
సీనియర్ రాజకీయ నాయకుడు
9849310392



## ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన వ్యక్తి పీవీ

### మాజీ మంత్రి కేటీఆర్

**విశ్వంభర, హైదరాబాద్:** దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన వ్యక్తి పీవీ నర్సింహారావు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన మాజీ ప్రధానమంత్రి పీవీ జయంతి వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. రాజకీయాలతో సంబంధం లేని ఒక ఆర్థిక వేత్తను తీసుకువచ్చి ఆర్థిక మంత్రిగా నియమించుకుని అద్భుతంగా ఆర్థిక సంస్కరణలను చేపట్టారని గుర్తు చేశారు. అసమాన్యమైన తెలివితేటలతో తన బహు భాషా ప్రజ్ఞా పాటవంతో ప్రపంచం దృష్టిని ఆకర్షించిన గొప్ప మేధావి పీవీ అని కొనియాడారు. ఒక కవిగా, కథకుడిగా, మేధావిగా, సంస్కరణశీలిగా పీవీని చరిత్రను దేశం ఎన్నడూ మర్చిపోదన్నారు. దేశం ఉన్నన్ని రోజులు ఆయన పేరును దేశ ప్రజలు గుర్తుంచుకుంటారన్నారు. తొలిసారి దక్షిణాది నుంచి దేశానికి ప్రధానిగా నాయకత్వం వహించిన గొప్ప వ్యక్తి అన్నారు. ఆర్థికంగా అతలాకుతలమై ప్రమాదం అంచున ఉన్న దేశానికి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించి కాపాడగలిగారన్నారు. పీవీకి ముందు, ఆయన పాలన తర్వాత అన్నతీరుగా దేశ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చారన్నారు. 16 భాషల్లో అద్భుతమైన భాషా ప్రావీణ్యం ఉన్నా కొన్నిసార్లు, తన మౌనమే తన భాషగా గొప్ప పాలన నిర్వహించారన్నారు. తన సొంత 800 ఎకరాల కుటుంబ భూమిని ప్రభుత్వానికి అప్పగించి దేశంలో కీలకమైన భూసంస్కరణలను ప్రారంభించారన్నారు. దేశంలో నవోదయ పాఠశాలలు, గురుకులాలు పెట్టి విద్యారంగానికి ఎనలేని సేవలు చేశారన్నారు. పీవీ గురించి ఎంత చెప్పినా తక్కువనే... ఆయన నిత్య విద్యార్థి, 80 ఏళ్ల వయసులో కంప్యూటర్ విద్య నేర్చుకున్న వ్యక్తి మనందరి జీవితాలకు ఆదర్శం అన్నారు. పీవీకి భారతరత్న అవార్డు ప్రకటించినందుకు కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు. పీవీ పేరును నెక్లెస్ రోడ్డుకు నామకరణం చేశామన్నారు.

పీవీ జీవితాన్ని కేంద్రం పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురభివాణిదేవి, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, జగదీష్ రెడ్డి, మహమూద్ అలీ, మాజీ ఎమ్మెల్యేలు బూడిద భిక్షమయ్యగౌడ్, రవీంద్ర కుమార్, మాజీ ఎంపీ కవిత, పల్లె రవికుమార్ గౌడ్, వాసుదేవరెడ్డి, గెల్లు శ్రీనివాస్ యాదవ్, మన్నె గోవర్ధన్ రెడ్డి, దేవిప్రసాద్, రాకేష్ పాల్గొన్నారు.



## ఎల్ఓసీ చెక్కు అందజేత

**విశ్వంభర, కల్వకుర్తి :** కల్వకుర్తి మండలం మార్చాల గ్రామానికి చెందిన నిరంజన్ బేగం అనే మహిళ నిమ్స్ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స తీసుకుంటున్నారు. వారు కల్వకుర్తి ఎమ్మెల్యేని సహాయం కోసం ఆశ్రయించగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి వెంటనే స్పందించి ప్రభుత్వం ద్వారా చికిత్స కొరకు 4,50,000 రూపాయల ఎల్ఓసీ చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మొహమ్మద్ నిజాముద్దీన్, దున్న భాస్కర్, గొడుగు జలాల్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీక్ కేసులో మరో ఇద్దరు అరెస్ట్



**విశ్వంభర, జార్ఖండ్ :** నీట్–యూజీ పరీక్ష పేపర్ లీక్ కేసుకు సంబంధించి కీలక పరిణామం చోటు చేసుకుంది. జార్ఖండ్‌లోని హజారీబాగ్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎహ్సానుల్ హక్, వైస్ ప్రిన్సిపల్ ఆలం ఒయాసిస్‌ను సీబీఐ అరెస్ట్ చేసింది. హజారీబాగ్‌లోని నీట్ పరీక్షకు ప్రిన్సిపాల్ హక్ జిల్లా కోఆర్డినేటర్‌గా ఉండగా, వైస్ ప్రిన్సిపాల్ ఆలం ఒయాసిస్ స్కూల్‌కు సమన్వయకర్తగా ఉన్నారు. వీరిరువురిని అరెస్ట్ చేసిన అనంతరం బీహార్‌కు తరలించినట్లు తెలుస్తోంది. ఇక పేపర్ లీకేజీకి సంబంధించి జిల్లాకు చెందిన మరో ఐదుగురిని సీబీఐ ప్రశ్నిస్తోంది. ఈ విషయానికి సంబంధించి ఒయాసిస్ స్కూల్ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ సహా మరికొందరు ఉపాధ్యాయులను సీబీఐ ప్రశ్నించిన ఒక రోజు తర్వాత ఈ పరిణామం చోటు చేసుకుంది. జూన్ 26న, ఎనిమిది మంది సభ్యుల బృందం పాఠశాలను క్షుణ్ణంగా సందర్శించింది. అదనంగా, ఈ బృందంలోని కొందరు సభ్యులు తమ విచారణలను జిల్లాలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ప్రధాన శాఖకు విస్తరించారు. ప్రశ్నపత్రాలను భద్రపరిచే బాధ్యత బ్యాంకు మేనేజర్‌దేనన్న నివేదికల కారణంగా ఈ సందర్శన జరిగినట్లు తెలుస్తోంది. నీట్–యూజీ పరీక్ష పేపర్ లీక్ కేసులో బీహార్‌లోని పాట్నాకు చెందిన ఇద్దరు వ్యక్తులను సీబీఐ గురువారం అరెస్టు చేసింది. మనీష్ కుమార్, అశుతోష్ కుమార్‌గా గుర్తించారు.

# నీట్‌పై రాద్ధాంతం జరుగుతున్నా సీఎం గప్‌చుప్!

- అసెంబ్లీ సమావేశాల్లో నీట్‌పై ఏకగ్రీవ తీర్మానం పెట్టాలి
- బీఆర్ఎస్ నేత వినోద్ కుమార్

**విశ్వంభర, హైదరాబాద్:** నీట్ పేపర్ లీకేజీపై రాద్ధాంతం జరుగుతున్నా సీఎం రేవంత్‌రెడ్డి తనకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండటం సిగ్గు చేటని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి నీట్ రద్దు కోసం ఏకగ్రీవ తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఆమోదించాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ కోరారు. శుక్రవారం మీడియా ప్రకటన విడుదల చేశారు. నీట్‌పై దేశ వ్యాప్తంగా నిరసనలు ఉధృతం అవుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. నీట్‌ను రద్దు చేయాలంటూ తమిళనాడు అసెంబ్లీ చేసిన ఏకగ్రీవ తీర్మానాన్ని స్వాగతించారు. నీట్ విషయంలో తమిళనాడు ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు యావత్ దేశానికే ఆదర్శనీయంగా నిలుస్తుందని కొనియాడారు. నీట్ ద్వారా మెడికల్ కాలేజీల్లో ఇతర రాష్ట్రాల విద్యార్థులను చేర్చుకోకుండా రాష్ట్రానికి మినహాయింపు ఇవ్వాలని, గతం మాదిరిగానే ఎంసెట్ ఆధారంగానే మెడికల్ అడ్మిషన్లు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు అనుమతినిచ్చేలా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలని కోరారు. రాష్ట్రాల విన్నపాలను కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పడితే సుప్రీంను ఆశ్రయించి, రాష్ట్రాలు తమ హక్కులను సాధించుకోవాలని బోయినపల్లి వినోద్ కుమార్ సూచించారు.





## మొహర్రానికి అన్ని సౌకర్యాలు కల్పించాలి

### మంత్రి పొన్నం ప్రభాకర్

**విశ్వంభర, హైదరాబాద్ :** మొహర్రం పవిత్ర మాసంలో నిర్వహించే కార్యక్రమాలకు అసౌకర్యం కలుగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని రవాణా, బి.సి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మొహర్రం పవిత్ర మాసం ఏర్పాట్లపై శుక్రవారం డా.బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ తో కలిసి వివిధ శాఖల అధికారులు, షియా మత పెద్దలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. మొహర్రం కార్యక్రమాలు నిర్వహించే ఆశుర్ ఖానాల వద్ద పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఆశుర్ ఖానాల పరిసర ప్రాంతాలలో పెండింగ్ లో ఉన్న డ్రైనేజ్, రోడ్ల మరమ్మత్తు పనులను వెంటనే పూర్తి చేయాలని, అన్ని చోట్ల హైమాస్ట్ లైట్లను ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రధాన ఏనుగు ఊరేగింపు రోజున ఊరేగింపు జరిగే మార్గాలలో విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని, వాటర్ బోర్డ్ అధికారులు త్రాగు నీరు అందించాలని, జి.హెచ్.యంసి అధికారులు పారిశుధ్య పనులను పర్యవేక్షించాలని అన్నారు. మొబైల్ టాయిలెట్స్ తదితర మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మొహర్రం ఊరేగింపు సందర్భంగా ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రధాన ఊరేగింపు ప్రారంభం కానున్న బీబీ-కా-ఆలం పరిసరాల ప్రాంతంలో పటిష్ట బందోబస్తూ ఏర్పాటు చేయాలన్నారు. సంతాపం తెలిపెందుకు ఆశుర్ ఖానాలకు వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌళిక వసతులు కల్పించాలని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ సూచించారు. వారి కోసం మినీ బస్సులను కూడా ఏర్పాటు చేయాలన్నారు. వైద్య శిబిరాలు, అంబులెన్స్ లను కూడా అందుబాటులో ఉంచాలని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండి, మీర్జా రహమత్ బేగ్, బల్మూరి వెంకట్, ఎమ్మెల్యేలు జాఫర్ హుస్సేన్ మెరాజ్, కౌసర్ మొహియుద్దీన్, మీర్ జుల్ఫెకర్ అలీ, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి తఫ్సీర్ ఇక్బాల్ , వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబైదుల్లా కొత్వాల్, వైస్ చైర్మన్, ప్రెసిడెంట్ టీఎంఆర్ఈఐఎస్ ఫహీమ్ ఖురేషి, హైదరాబాద్ నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, జీహెచ్ఎంసీ కమీషనర్ ఆమ్రపాలి, హైదరాబాద్ పోలీస్ కమీషనర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఒకే వేదికపై రానున్న చంద్రబాబు, రేవంత్..!

### త్వరలో ప్రపంచ కమ్మ మహాసభకు హైదరాబాద్ వేదిక కానుంది

**విశ్వంభర, హైదరాబాద్ :** కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జులై 20–21 తేదీలలో తొలి ప్రపంచ కమ్మ మహాసభ హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు జెట్టి కుసు మకుమార్ వెల్లడించారు. ఈ మహాసభకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఏపీ ముఖ్యమం త్రి చంద్రబాబు నాయుడు, తెలంగాణ సీఎం రేవం త్ రెడ్డిలు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొంటారని కుసుమ కుమార్ వెల్లడించారు.

## ఏపీ సచివాలయ ఉద్యోగులకు సీఎం గుడ్‌న్యూస్

**విశ్వంభర, అమరావతి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయ ఉద్యోగులకు నూతనంగా ఎన్నికైన ఎన్డీఏ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయ ఉద్యోగులకు వారానికి ఐదు రోజుల పాటు పని దినాలు ఉండేవి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ సచివాలయం, హెచ్ ఓడీ లలో వారానికి ఐదు రోజుల పని దినా ల విధానం ఈ నెల 27వ తేదీతో ముగిసింది. అయితే ఈ విధానాన్ని మరికొంత కాలం పొడిగిం చాలని ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ సచివాలయ సంఘం కోరింది. సచివాలయ ఉద్యోగుల సంఘం కోరిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డు స్పందించి ఆమోదం తెలిపారు. ఇవాళ లేదా రేపు అధికారికంగా ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. వారానికి ఐదు రోజుల పని విధానాన్ని పొడిగించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఆంధ్రప్రదేశ్ సచివాలయ సంఘం తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పలువురు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పది సప్లిమెంటరీ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**విశ్వంభర, కరీంనగర్ :** ఇటీవల నిర్వహించిన పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 483 మంది విద్యార్థులు ఉండగా 432 మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. 51 మంది హాజరు కాలేదని చెప్పారు. పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో 432 మంది విద్యార్థుల్లో 418 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. జిల్లాలో 96.76 శాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. మంచి ఫలితాలు వచ్చేందుకు ప్రత్యేకంగా కృషి చేసిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. కరీంనగర్లో మొత్తం 357 మందికి 321 మంది పరీక్ష రాశారని పేర్కొన్నారు. 36 మంది హాజరు కాలేదని, 318 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. కరీంనగర్లో 99.07 శాతం పాస్ కావడం గ్రేట్ అచీవ్మెంట్ అని కలెక్టర్ పేర్కొన్నారు. హుజూరాబాద్‌లో మొత్తం 126 మందికి 111 మంది హాజరయ్యారని చెప్పారు. 15 మంది హాజరు కాలేదని 100 మంది పాస్ అయ్యారని, ఇక్కడ 90.09% ఉత్తీర్ణత సాధించారని వెల్లడించారు. కరీంనగర్, హుజురాబాద్ కలుపుకొని మొత్తం 483 మంది విద్యార్థులకు 432 మంది విద్యార్థులు పరీక్ష రాసారని, ఇందులో 418 మంది పాసయ్యారని పేర్కొన్నారు. కేవలం 24 మంది మాత్రమే ఫెయిల్ అయ్యారని జిల్లా వైస్‌గా చూసుకుంటే 96.76 ఉత్తీర్ణత సాధించడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. అదే విధంగా ప్రతి పాఠశాలలో వ్రాయడం, చదవడం పై ప్రతి రోజు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. డీఈవో జనార్దన్ రావు తో పాటు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు.

## రాష్ట్రంలో మళ్లీ ఐపీఎస్‌లు బదిలీ

**విశ్వంభర, విశాఖపట్నం:** రాష్ట్రంలో ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్‌గా ఉన్న రవిశంకర్ అయ్యన్నార్‌ను సీఐడీ అడిషనల్ డైరెక్టర్ జనరల్‌గా నియమించింది. అలాగే ఏపీఎస్పీ బెటాలియన్ అదనపు డీజీగా ఉన్న అతుల్ సింగ్‌ను ఏసీబీ డీజీగా బదిలీ చేసింది. ఇక శాంతిభద్రతల అదనపు డీజీ శంకబ్రత బాగ్చీని విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్‌గా నియమించింది. మరోవైపు గత వారంలో ముగ్గురు ఐపీఎస్ అధికారులను ఏపీ ప్రభుత్వం బదిలీ చేసింది కూడా.



## పాములపర్తీ.. ఏమని చెప్పుదు నీ కీర్తి..

ఆయన.. చతురుడా.. చాణక్యుడా..
రాజనీతి కోవిదుడా..తాత్వికుడా..
సాత్వికుడా.. బహుభాషా పండితుడా..
ఒక మనిషిలో ఎన్ని గుణాలు..
ఒక రాజకీయవేత్తలో ఎన్ని కోణాలు..
మోమున విజ్ఞానం తెచ్చిన తేజస్సు...
మనిషిగా అంతేలేని యశస్సు..
అన్నిటినీ మించి పదహారణాల
తెనుంగు వాడు..మనవాడు...
పాములపర్తి నరసింహుడు..

ఎక్కడ లక్నేపల్లి..
ఇంకెక్కడి హస్తినాపురి...
ఎలా మోసుకెళ్ళావయా
ఈ అనంత ఝురి..
తాటికమ్మల బడిలో చదివి
దేశాన్ని ఏకతాటిపై
నడిపించిన ఘనాపాటి..
పదమూడు భాషలు
ఎరిగిన సమ్రాట్టు..
తెలుగుదనానికి మూలవిరాట్టు

కలం నుంచి కంప్యూటర్ వరకు
అన్నీ ఆయన వ్యాసంగానికి
ఉపకరణాలే..,
కరీంనగర్ కళాశాలలో
మంచి బాలుడుగా
రేడియో రూం అజమాయిషీ
రాజీవ్ మరణానంతరం
మంచి వ్యక్తిగా ప్రధాని పీఠంపై
ఇదే పెద్దమనిషి..
జవహర్ తో బోణీ కొట్టి
ఇందిరమ్మకు జై కొట్టి
రాజీవ్ కు పదవి కట్టబెట్టి...
అప్పుడే ప్రణబ్ నోట్లో మట్టికొట్టి
ఎన్ని కథలు నడిపావయ్యా
పాములపర్తీ..చాణక్యుడంతటి
చాతుర్యంతో దిగ్గజాలను
బురిడీ కొట్టించిన
ఘనశాల్తీ..

ఆర్థిక సంస్కరణల విరించి
నీ నిర్ణయాలే
భారతావనికి దిక్సూచి..
సాహసమే నీ పథమై..
చాతుర్యమే విధమై..
అభివృద్ధి శపథమై..
నడిపించావు జాతిని
ప్రపంచం మెచ్చిన రీతిని..
ఇంత చేసిన నరసింహుడికి
ఏమిచ్చింది కాంగిరేసు
శవదహనంలో తిరకాసు..
తెలుగువాడంటూ ఎన్టీఆర్
పెట్టలేదు పోటీ..
చచ్చాక సొంత పార్టీ
మాత్రం చేసేసింది
గౌరవం లూటీ..!
మతిలేని నాయకుల
సంగతి ఏల..
యావజ్జాతి నీరాజనాలు
లేవా నీ మ్రోల..!

తెలుగు తేజం..మాజీ ప్రధాని
పీవీ నరసింహా రావు జయంతి
సందర్భంగా ప్రణామాలు

– సురేష్ కుమార్ ఎలిశెట్టి
9948546286

# బ్యాంకర్లు నిర్దేశించిన రుణాలు మంజూరు చేయాలి

## కలెక్టర్ రాహుల్ శర్మ



**విశ్వంభర, భూపాలపల్లి :** బ్యాంకర్లు నిర్దేశించిన రుణాలు మంజూరు చేయాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో 2024-25 జిల్లా వార్షిక రుణ ప్రణాళికను కలెక్టర్ ప్రకటించారు. ఈ సందర్భంగా వార్షిక రుణ ప్రణాళిక పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకర్లు ప్రాధాన్యతారంగాలకు కేటాయించిన లక్ష్యాలను సాధించాలని తెలిపారు. 2023-24 ఆర్థిక సవత్సరంలో జరిగిన ప్రగతిపై బ్యాంకర్లతో డీసీసీ, డీఎల్ఆర్సీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 2024-05 సంవత్సరంలో 2223.41 కోట్లు రుణ మంజూరుకు కమిటీ ఆమోదించిందని తెలిపారు. ఈ సందర్భంగా 12 రంగాలకు 1991.55 కోట్లు రుణాలు మంజూరు. లక్ష్యం కాగా 1453.32 కోట్లు రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. పీఎం ఈజీపీ లక్ష్యం 75 యూనిట్లుకు 243.74 కోట్లు లక్ష్యం కాగా 26 యూనిట్లు మంజూరు 96.31 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. 35354 మందికి 209.94 కోట్లు ముద్ర రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. 2024-25 జిల్లా వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలను సాధించే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన లక్ష్యం మేరకు వ్యవసాయ, చేపలు పెంపకానికి, పామాయిల్ సాగు, స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు, మహిళ స్వయం సహాయక సంఘాలు ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్నదని, అట్టి ప్రాధాన్యతను గుర్తించి మహిళా సంఘాలకు బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా ఎస్‌హెచ్‌జీ మహిళా సంఘాలకు రుణాలు మంజూరుకు సమిష్టిగా కృషి చేయాలని అన్నారు. వీధి వ్యాపారులకు మొదటి విడతగా మంజూరు చేసిన 10, 20 వేలు చెల్లించిన 186 మందికి వక్కొక్కరికి 50 వేలు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. మన జిల్లాను నీతి ఆయోగ్ యాస్పిరేషనల్ జిల్లాగా ప్రకటించిందని, జిల్లాలో 50 కామన్ సర్వీస్ సెంటర్స్ ఏర్పాటు లక్ష్యం కాగా 40 ఏర్పాటు చేశారని, మిగిలిన 10 ఏర్పాటు చేయాలని సూచించారు. కామన్ సర్వీస్ సెంటర్స్ ఏర్పాటుకు 1.20 కోట్లు సబ్సిడీ మంజూరు చేసినట్లు తెలిపారు. రేగొండలో బాంక్ బ్రాంచ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు అందచేయాలని ఎల్డీఎంకు సూచించారు. జిల్లాలో చేపలు, డ్రాగేన్ పండ్ల తోటలు, గొర్రెలు పెంపకానికి. మంచి అవకాశాలున్నాయని బ్యాంకర్లు ఇట్టి యూనిట్స్ ఏర్పాటుకు రుణాలు మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎల్డీఎం తిరుపతి, ఆర్బీఐ నోడల్ అధికారి ఆలీబాబా, నాబార్డు ఈజీఎం రవి, డీఆర్డీఓ నరేష్, వ్యవసాయ అధికారి విజయభాస్కర్, ఉద్యానవన శాఖ అధికారి సంజీవరావు, మత్స్యశాఖ అధికారి అవినాష్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో కలెక్టర్ పర్యటన

**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ శుక్రవారం జిల్లాలోని చిట్యాల, మొగుళ్ళపల్లి మండలాలలో విస్తృతంగా పర్యటించారు. ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న మరమ్మతు పనులను, ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సేవలు, అంగన్వాడీ టీచర్లకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ముందుగా చిట్యాల మండలం జడల్ పేట, గాంధీనగర్, భీష్మనగర్‌లోని ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు.రామచంద్రపూర్ గ్రామంలో అంగన్వాడీ టీచర్లకు జరుగుతున్న శిక్షణ తరగతులను పరిశీలించినఅనంతరం చిట్యాల మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. అక్కడి నుంచి మొగుళ్ళపల్లి మండలంలోని అరేపల్లి ప్రాథమిక పాఠశాల, ఇస్సేపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో జరుగుతున్న మౌలిక సదు-పాయాలు కల్పన పనులను పరిశీలించివిద్యార్థులతో కొద్ది సేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతోపాటు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పాఠశాలలో మౌలిక వసతులు కల్పనతోపాటు పాఠశాలను ఆహ్లాదకకరంగా తీర్చి దిద్దుతున్నామని తెలిపారు. చిట్యాల మండలంలో



25 పాఠశాలలను, మొగుళ్ళ పల్లి మండలంలో 22 పాఠశాలలో మరమ్మతులు జరుగుతున్నాయని, కొన్ని పాఠశాలలో మరమ్మతులు పూర్తయ్యాయని వాటికి వెంటనే పెయింటింగ్ పనులు చేయించాలన్నారు. పనులు పురోగతిలో ఉన్న పాఠశాలలలో వేగం పెంచాలని కలెక్టర్ ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల నుంచే ఆరోగ్యవంతమైన పిల్లలు తయారు కావాలని అన్నారు. పిల్లలకు మేదా శక్తి పెంపొందించడానికి అంగన్వాడీలలో జులై నెల నుంచి పూర్వ ప్రాథమిక విద్యను ప్రవేశపెడుతున్నామని తెలిపారు. అంగన్వాడీ లలో పిల్లలకు ఎకరూప దుస్తులు ఆగస్టు 15 వరకు అందించనున్నట్లు తెలిపారు. బాల్యం నుంచి పిల్లలకు విద్యపై మక్కువ రావాలని, అందుకు అవగాహన కల్పించబోతున్నట్లు తెలిపారు. చిట్యాల మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను పరిశీలించిన కలెక్టర్ వానాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై రోగులకు అవగాహన కల్పించాలని, సీజనల్ వ్యాధులకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. తల్లికి కడుపుకోతను తగ్గించేందుకు సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని అందుకు గర్భ నిర్ధారణ జరిగిన నాటి నుంచే నిరంతర క్రమం తప్పక వైద్య సేవలు అందించాలని సూచించారు. వైద్య సిబ్బంది, డాక్టర్లు అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ డీడబ్ల్యుఓ అవంతిక, చిట్యాల సీహెచ్‌సీ సూపరిండెంట్ జీడీ తిరుపతి, చిట్యాల, మొగుళ్లపల్లి తహసిల్దార్లు, ఖాజా మోహినుద్దీన్, సునీత ఎంపీడీఓ, విజయలక్ష్మి, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.




# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేశాం

## జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

**విశ్వంభర, భూపాలపల్లి :** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేశామని జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు. శుక్రవారం ఎస్టీపీసీ మిలీనియం హాల్‌లో నిర్వహించిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ, విద్యాశాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలపై ప్రధానంగా చర్చించారు. సంబంధిత జిల్లా అధికారులు ఆయా శాఖలలో నిర్వహిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను తెలియజేశారు. వ్యవసాయ శాఖపై చర్చ జరుగుతుండగా, వానాకాలం పంట సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో జూలై 30 లోగా ప్రభుత్వ హామీ మేరకు రైతు భరోసా నిధులు, రైతు కూలీలకు 12 వేల రూపాయలు పంపిణీ చేయాలని, అదేవిధంగా ఆగస్టు 15 లోపు రైతు రుణమాఫీ ప్రక్రియ పూర్తి చేయాలని, రైతులు పండించిన ధాన్యానికి 500 రూపాయల బోనస్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం ప్రవేశపెట్టాలని ఓదెల జెడ్పీటిసి గంటా రాములు ప్రతిపాదించగా, పాలకుర్తి జెడ్పీటిసి కందుల సంధ్యారాణి దానిని బలపర్చరు. సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న సభ్యుల అంగీకారంతో ఆ తీర్మానాన్ని జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ ఆమోదించారు. విద్యా శాఖపై జరిగిన చర్చలో సభ్యులు మాట్లాడుతూ.., ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సదు-పాయాలను, మన దగ్గర అందుబాటులో ఉన్న అనుభవం, నైపుణ్యం గల ఉపాధ్యాయుల వివరాలను తెలియజేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని సూచించారు. గతంలో ప్రారంభించిన సీఎం అల్పాహార పథకం అమలు వివరాలను సభ్యులు ఆరా తీశారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని సూచించారు. వైద్యారోగ్య శాఖపై జరిగిన చర్చలో సభ్యులు మాట్లాడుతూ.. పోషకాహార లోపం ఉన్న పిల్లలను ముందుగానే గుర్తించి అవసరమైన చికిత్స అందించేందుకు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు వైద్య పరీక్షల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని కోరారు. డయాగ్నస్టిక్ హబ్ ద్వారా ఉచితంగా జరిగే వైద్య పరీక్షలపై సామాజిక మాధ్యమాలు, సిటీ కేబుల్ లలో విస్తృతంగా ప్రచారం చేయాలని, ప్రజలు అనవసరంగా డబ్బు ఖర్చుపెట్టుకుని ప్రైవేటు పరీక్షా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేదనే సందేశం పంపాలని సభ్యులు తెలిపారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ మాట్లాడుతూ.. జూలై 4, 2024తో స్థానిక సంస్థల గడువు ముగుస్తుందని, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గత 5 సంవత్సరాలుగా 20 జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాలను నిర్వహించడం జరిగిందన్నారు. అమ్మ తనకు జన్మ నిస్తే, ఈ స్థాయికి ఎదిగేందుకు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం కారణమని, ఈ ఇద్దరికీ తాను జీవితాంతం కృతజ్ఞతతో ఉంటానని అన్నారు. దేశంలోనే అత్యున్నత సభగా జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని తాను భావిస్తానని, అసెంబ్లీలో ఎమ్మెల్యేలు, పార్లమెంట్ లోక సభలో ఎంపీలు మాత్రమే ఉంటారని, జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను అమలు చేసే అధికారులు ఉంటారని, ప్రజా సమస్యలపై విస్తృతంగా ఇక్కడ చర్చ జరుగుతుందని తెలిపారు. దేశానికి, రాష్ట్రానికి దశ, దిశ చూపించే ఎంపీలు, ఎమ్మెల్యేలు సర్వసభ్య సమావేశంలో పాల్గొంటూ క్షేత్ర స్థాయి సమస్యల పట్ల అవగాహన కల్పించుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తారని అన్నారు. గత ఐదు సంవత్సరాలుగా ప్రజా సమస్యల పరిష్కారానికి నిస్వార్థంగా కృషి చేశామని, దీనికి అధికారులు సంపూర్ణంగా సహకారం అందించారని వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ప్రజా పరిషత్ సమావేశంలో పాల్గొని ప్రజా సమస్యలను అధికారులు, ఎమ్మెల్యేలు, ఎంపీల దృష్టికి తీసుకుని వచ్చిన జిల్లా ప్రజా పరిషత్ సభ్యులకు, ఎంపీపీ అధ్యక్షులకు జెడ్పీ చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో స్థానిక సంస్థలు మరింత బలోపేతం కావాలని జెడ్పీ చైర్మన్ ఆకాంక్షించారు. అనంతరం పుట్ట మధుకర్‌ను సన్మానించారు. జెడ్పీటీసీలు, ఎంపీపీ, కోఆప్షన్ మెంబర్‌లను, జెడ్పీ సీఈఓ అధికారులను జెడ్పీ చైర్మన్ సన్మానించారు. సమావేశంలో జెడ్పీ సీఈవో నరేందర్, జెడ్పిటిసిలు, ఎంపీపీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## మైసమ్మ ఆలయంలో ఎమ్మెల్యే కసిరెడ్డి పూజలు



**విశ్వంభర, ఆమనగల్లు :** రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం మైసిగండి గ్రామం మైసమ్మ మైసమ్మ దేవస్థానం వద్ద 15 లక్షలతో సీసీ రోడ్డు పనులకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయ-ణరెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం సతీ సమేతంగా మైసమ్మ అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక జడ్పీటిసి దశరథ్ నాయక్ కడ్తాల్ మండల కేంద్రంలో నిర్మించిన కస్తూర్బా పాఠశాలను ఈ సంవత్సరం నుంచే ప్రారంభించాలని కోరారు దానికి ఆయన సానుకూలంగా స్పందించి ఎంపీకి చెప్పి ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కమ్లి మోత్య నాయక్ ఎంపీటీసీ గూడూరు శ్రీనివాస్ రెడ్డి, యాట నరసింహ, మాజీ సర్పంచ్ తులసి రామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## గందోత్సవం వాల్ పోస్టర్లు విడుదల



**విశ్వంభర, ఆమనగల్లు :** 4వ గంథోత్సవం వచ్చే నెలజులై 1 నుంచి భార్గహే సయ్యదునా ముస ఖాద్రి పురాణపుల్ హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న గంథోత్సవం వాల్ పోస్టర్లను అమనగల్లు పట్టణంలోని మహ్మదియా మస్జీద్ అధ్యక్షులు అబ్దుల్ ఖాదర్ ఖాద్రి, నాయబ్ సదర్ మహ్మద్ అబ్దుల్ ఖాదర్ ఆధ్వర్యంలో స్థానిక ముస్లిం మైనారిటీ నాయకులతో విడుదల చేశారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని మండలాల ముస్లిం సోదరులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా కత్మ ఖురాన్, సందల్, సమర్పించడం, ఉపన్యాస ఉంటుందని వారు తెలిపారు. కార్యక్రమంలో ఇమామ్ అబూ తాలిబ్, మహ్మద్ అక్బర్, కమిటీ సభ్యులు చాంద్ పాషా, మహబూబ్ అలీ, ఖలీల్, అయ్యుబ్, రహీమ్, కరీం, బాసీద్ పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన

# అడిషనల్ డీఆర్డీఓ సురేష్



**విశ్వంభర ,ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలో శుక్రవారం జిల్లా గ్రామీణాభి వృద్ధి శాఖ(అడిషనల్ డిఆర్డీఓ) అదనపు కార్యనిర్వహణా ధికారి గుర్రం సురేష్ మండలంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. రాఘూవాపురం, కూరెళ్ళ, పల్లెర్ల గ్రామాల్లో పర్యటించారు. త్వరలో వనమహొత్సవం కార్యక్రమం ప్రారంభోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లు పరిశీలించారు. మండల కేంద్రంతో పాటుగా ఆయా గ్రామా లలోని ప్రభుత్వ ఖాళీ స్థలాలు రోడ్లకు ఇర-ువైపులా చెట్లు నాటేందుకు ఉపాధి హామీ కూలీలతో గుంతలు తీసే పనులు చేపట్టి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వనమహొ త్సవం కార్యక్రమం మొదలైయే వరకు గుంతలు పూర్తి చే యాలని అన్నారు. అనంతరం ఆయాగ్రామాల్లో ఉపాధి హామీలో నిర్వహిస్తున్న ఫిష్ పాండ్, ఫారం ఫండ్ పనులను పరిశీలించారు. అనంతరం ఉపాధి హామీ కూలీలకు ఉపాధి హామీ యాప్ అయిన జనమనరేగాను ఏలా చూడాలో వివ రించినారు. వీరివెంటా ఉపాధి హామీ ఎపీఓ బోడిగే రమేష్, టీఏలు ఏగు మల్లేష్, జమాండ్ల యాదిరెడ్డి, ఆయాగ్రామాల ఏఫ్ఏలు ఇస్తారి, యాదమ్మ, సురేష్, కూలీలు ఉన్నారు.

## ఆర్థిక సాయం

**విశ్వంభర, చింతపల్లి :** చింతపల్లి మండలం తీదేడు (వెంకటంపేట)గ్రామానికి చెందిన సందే ఇద్దయ్య అనారోగ్యంతో శుక్రవారం మరణిచిన సంగతి తెలిసి ఇద్దయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన తీదేడు మాజీ సర్పంచ్ కాయితి జితేందర్‌రెడ్డి. మృతుని కుమారుడు సందే యాదయ్యకు ఐదు వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. సందే ఇద్దయ్య మృతి చాలా బాధాకరం అని కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దాసరి శ్రీనివాస్ యాదవ్, పల్లెటి నర్సింహ,సందే లక్ష్మయ్య, మల్లిగారి యాదయ్య, కటపాక వెంకటయ్య, సందే చంద్రయ్య, ఉడుత లింగయ్య, సందే అంజయ్య, సందే కిరణ్, రాజయ్యసాయి, వెంకటయ్య, రామలింగం పాల్గొన్నారు.



## పీవీకి ఎంపీ వద్దిరాజు ఘన నివాళులు

**విశ్వంభర, హైదరాబాద్ :** మాజీ ప్రధానమంత్రి పీ.వీ.నర్సింహారావు జయంతి సందర్భంగా భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్లమెంటరీ పార్టీ లీడర్ కే.ఆర్.సురేష్ రెడ్డి, డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర, విప్ దీవకొండ దామోదర్ రావులు ఢిల్లీలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలు జల్లి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీవీ దేశానికి చేసిన సేవల్ని గుర్తు చేసుకున్నారు.



## ఎరువులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలి

### ఏడీఏ శ్రీలక్ష్మి

**విశ్వంభర, చింతపల్లి :** ఎరువుల దుకాణాల విక్రయదారులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీస్కుంటామని డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకురాలు శ్రీలక్ష్మి తెలిపారు. శుక్రవారం చింతపల్లి మండల వ్యవసాయ అధికారి పీ .శ్రావణ కుమారితో కలిసి మాల్ పట్టణంలోని ఎరువుల దుకాణాల డీలర్లతో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవరకొండ ఏడీఏ శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. రైతులకు ఎరువులు సకాలంలో అందుబాటులో ఉంచాలని అలాగే పురుగుల మందులను ఎరువులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని ఎమ్మార్పీకి మించి అధిక ధరలకు విక్రయిస్తే దుకాణాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని, దుకాణాలను సైతం సీజ్ చేస్తామనిడ హెచ్చరించారు. ఎరువుల అమ్మకపు వివరాలను రికార్డుల్లో ప్రతిరోజు పొందుపరచాలని సూచించారు. అలాగే రైతులను ఉద్దేశించి వానాకాలం వేసిన పంటల వివరాలను సర్వేనెంబర్ వారీగా వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఈవోలు మధు, శ్రీలత మరియు డీలర్లు యాదయ్య, వాసా శ్రీను, వెంకటయ్య, ప్రసాద్, శ్రీశైలం, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాజీ ప్రధాన మంత్రి భారత రత్న పీవీ నర్సింహా రావు 103 వ జయంతి సందర్భంగా నెక్లెస్ రోడ్డు లోని పీవీ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న టీజేఎస్ అధ్యక్షులు ప్రొ.కోదండరాం తదితరులు
– విశ్వంభర, హైదరాబాద్

# డిండి ప్రాజెక్ట్ నీటి విడుదల



**విశ్వంభర, డిండి :** డిండి మండల పరిధిలో ఉన్న డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ నుంచి ఆయకట్ట రైతాంగానికి శుక్రవారం దేవరకొండ, అచ్చంపేట ఎమ్మెల్యేలు నేనావత్ బాలు నాయక్, చిక్కుడు వంశీకృష్ణ, ప్రాజెక్టు అధికారి ఈ శ్రీధర్ రావు కలిసి గేట్లను ఎత్తి నీటిని కిందికి విడుదల చేశారు. దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే అది శాసనమని ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల రుణమాఫీ ఆగస్టు 15వ తేదీ లోపు చేయబోతున్నామని, వ్యవసాయాన్ని పండుగ చేయాలన్నదే కాంగ్రెస్ పార్టీ విధానమన్నారు. రైతు భరోసాతో ద్వారా రైతులకు సంవత్సరానికి రెండు దఫాలుగా ఎకరాకు 7500 అందిస్తామని, రైతులను రాజుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం. గత ప్రభుత్వం 26 వేల కోట్ల రూపాయలను రైతుబంధు ద్వారా దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాధవరం దేవేందర్ రావు, మాధవరం సునీత, నల్లవెల్లి రాజేష్ రెడ్డి, దొంతినేని వెంకటేశ్వరరావు, దొంతినేని యాదగిరిరావు, మల్ రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, తిప్పర్తి విజయేందర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, బుషిపాక వెంకటయ్య, ఆమనగంటి రాధిక, నూకం వెంకటేష్, పోలం లక్ష్మణ్,వావిళ్ళ సలయ్య, మేకల కాశన్న, పున్న దినేష్, షేక్ ఉమర్, అవుట మల్లేష్, లక్పతి, బద్దెల శ్రీనివాస్ యాదవ్, కిన్నెర హరికృష్ణ, కొర్ర రాంసింగ్, భీముడు,బాదమోని శ్రీనివాస్ గౌడ్, జంగాగిరి, వెంకట్ రెడ్డి, జరుపుల లక్ష్మి, గడ్డమీది సాయి,వేణు, రేఖ్య నాయక్, కృష్ణ, రవి, తేజు, పోషాలు, గణేష్, అజయ్ పాల్గొన్నారు.

## రైతుల పాలిట వరం కాంగ్రెస్ ప్రభుత్వం

**విశ్వంభర, డిండి :** డిండి మండల పరిధిలో ఉన్న డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నుండి ఆయకట్ట ప్రాంతానికి అచ్చంపేట ఎమ్మెల్యే శ్రీ చిక్కుడు వంశీ కృష్ణ, ప్రాజెక్టు అధికారి ఈఈ శ్రీధర్ రావు కలిసి నీటిని విడుదల చేసిన దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్ మాట్లాడుతూ.. వరంగల్ రైతు డిక్లరేషన్ లో ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీపై ఇప్పటికే కేబినెట్ ఆమోదం తెలిపింది. వ్యవసాయాన్ని పండగ చేయాలన్నదే కాంగ్రెస్ పార్టీ విధానం.మాట ఇస్తే మడమ తిప్పని నాయకులు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జునఖర్గే, రేవంత్ రెడ్డి. కాంగ్రెస్ మాట ఇస్తే అది శాసనం. ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. గత ప్రభుత్వం 11డిసెంబర్ 2018 వరకు కటాఫ్ తేదీతో రుణమాఫీ చేసింది. మా ప్రభుత్వం 12డిసెంబర్ 2018 నుంచి 9 డిసెంబర్ 2023 మధ్యకాలంలో రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ చేయాలని నిర్ణయించింది. రుణమాఫీకి దాదాపు రూ.31 వేల కోట్లు అవసరమవుతోంది. అయినప్పటికీ రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం రుణమాఫీ చేయాలని నిర్ణయించింది. రైతు భరోసాపై రకరకాల చర్చలు జరుగుతున్నాయి. రోడ్లు, కొండలు, గుట్టలకు, రియల్ ఎస్టేట్ భూములకు, ధనికులకు రైతు భరోసా ఇస్తున్నారని చర్చ జరుగుతోంది. అందుకే రైతు భరోసాను పారదర్శకంగా అందించేందుకు, నిజమైన రైతులకు భరోసాను అందించేందుకు ఉప ముఖ్యమంత్రి గారి నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘం నియమించడం జరిగింది. జూలై 15లోగా కేబినెట్ సబ్ కమిటీ ప్రభుత్వానికి నివేదిక అందిస్తుంది. ఈ నివేదికను శాసనసభలో పవేశపెట్టి అందరి సూచనలతో పారదర్శకంగా రైతు భరోసా అమలు చేస్తాం.




# ఓనస్ ఆస్పత్రిలో కార్డియాలజీ విభాగం ప్రారంభం

**ఆస్పత్రి ఎండీ బాలరాజునాయుడు**

**హైదరాబాద్, విశ్వంభర :** నగరంలోని చంపాపేట ప్రాంత వాసులకు అత్యున్నత స్థాయి గుండె వైద్య చికిత్సలు అందించేందుకు ఓనస్ రోబోటిక్, కార్డియాక్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో కొత్తగా అత్యాధునిక కార్డియాలజీ విభాగాన్ని ఆదివారం ప్రారంభిస్తున్నట్లు ఆస్పత్రి వ్యవస్థాపకులు, ఎండీ డాక్టర్ బాలరాజు నాయుడు విలేకరుల సమావేశంలో తెలిపారు.ఈ విభాగంలో అత్యాధునిక సాంకేతికత అందుబాటులో ఉందని అత్యంత నైపుణ్యం కలిగిన కార్డియాలజిస్టులు, నర్సులు, టెక్నీషియన్ల బృందంతో ఇక్కడ అత్యుత్తమ స్థాయి చికిత్సలను రోగులకు అందిస్తారని ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు. ఇక్కడ అత్యాధునిక క్యాథ్ ల్యాబ్, ఇమేజింగ్ పరికరాలు, ప్రత్యేకమైన కార్డియాక్ సర్జరీ సూట్లు తదితరాలు తోపాటు రోజువారీ పరీక్షలతో పాటు నాన్ ఇన్వేజివ్ చికిత్సలు, సంక్లిష్టమైన గుండె శస్త్ర చికిత్సలు, ఇంటర్వెన్షనల్ ప్రాసీజర్లు అన్నీ ఇక్కడ అందుబాటులో ఉన్నాయన్నారు. ఇప్పటివరకు ఈ ఆస్పత్రిలో 6,500కు పైగా శస్త్రచికిత్సలు చేసి, 1.35 లక్షల మంది రోగులకు చికిత్సలు అందించాము" అని ఆయన చెప్పారు. ఆదివారం నాటి కార్యక్రమంలో తెలంగాణ ప్రణాళికా మండలి వైస్ ఛైర్మన్ చిన్నారెడ్డి, తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీ ఎన్.ప్రకాష్ రెడ్డి ఐపీఎస్, యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మెరాజ్, మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొంటారు. గౌరవ అతిథులుగా ఐఎస్ సదన్ కార్పొరేటర్ శ్వేతా మధుకర్ రెడ్డి, ఐఎస్ సదన్ మాజీ కార్పొరేటర్ స్వప్నా సుందర్ రెడ్డి, బీజేపీ ఎల్బీనగర్ కన్వీనర్ వంగా మధుసూదన్ రెడ్డి, గాయత్రినగర్ కార్పొరేటర్ సబితా రాజశేఖర్‌రెడ్డి, లింగోజిగూడ కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్ రెడ్డి పాల్గొంటున్నారు.

# సీఎం కేజ్రీవాల్ అక్రమ అరెస్టుకు నిరసనగా నేడు బీజేపీ కార్యాలయం ముట్టడి

**ఆఫ్ కన్వీనర్ దిడ్డి సుధాకర్**



**విశ్వంభర, బషీర్ బాగ్:** బిజెపి కేంద్ర ప్రభుత్వం తన రాజకీయ ప్రయోజనాల కోసం అన్ని కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ పార్టీ పిలుపు మేరకు జూన్ 29న తెలంగాణ రాష్ట్ర బిజెపి కార్యాలయం (నాంపల్లి)ముందు ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తల నిరసన దీక్ష జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మద్యం కేసులో అరవింద్ కేజ్రీవాల్‌కు ట్రయల్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది ఆ మరుసటి రోజే ఈడీ హైకోర్టుకు చేరుకుని కేజ్రీవాల్ బెయిల్‌పై స్టే తీసుకుందన్నారు. రెండేళ్లుగా గాఢనిద్ర నుంచి మేల్కొన్న సీబీఐ కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయడంతో ఈ కేసులో బెయిల్‌పై నిషేధం హైకోర్టు ఎత్తివేయనుందని తెలిపారు. సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను గత రెండేళ్ల వరకు మద్యం కేసులో సీబీఐ నిందితుడిగా చేర్చలేదని, అరవింద్ కేజ్రీవాల్ సుప్రీంకోర్టు నుంచి బెయిల్ పొందబోతున్నారని బిజెపి భావించినప్పుడు, అది సిబిఐని ముందుకు తెచ్చిందన్నారు. వారి ఉద్దేశ్యం ఏ కేసును విచారించడం కాదు లేదా వారికి చట్టంతో సంబంధం లేదు. ఎలాగైనా అరవింద్ కేజ్రీవాల్ ను జైల్లో ఉంచాలని, ఎన్నికలకు దూరంగా ఉంచాలని, ఆమ్ ఆద్మీ పార్టీని రద్దు చేయాలని బీజేపీ కోరుతోందనీ మండిపడ్డారు. అందుకే బీజేపీ తన రాజకీయ లక్ష్యాలను నెరవేర్చుకునేందుకు కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేస్తోందన్నారు.2023 ఏప్రిల్ 16న మొదటిసారిగా సాక్షిగా కేజ్రీవాల్‌ను సీబీఐ విచారణకు పిలిచిందని, అప్పుడు ఆయన్ను ముద్దాయిని చేయలేదని 14 నెలలుగా కేజ్రీవాల్‌ను నిందితుడిగా చేయాలని సీబీఐకి గుర్తులేదా అని ప్రశ్నించారు. చాలా కాలం తర్వాత ఇప్పుడు హఠాత్తుగా మేల్కొన్న సీబీఐ కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసిందన్నారు. ట్రయల్ కోర్టు ఇచ్చిన బెయిల్ ఆర్డర్‌పై హైకోర్టు స్టేను సుప్రీంకోర్టు ఎత్తివేయనున్న నేపథ్యంలో సీబీఐ ఈ చర్య తీసుకుందని, సీబీఐ వద్ద ఎలాంటి ఆధారాలు లేవు అని అన్నారు. కేజ్రీవాల్‌ను ఎలాగైనా జైల్లో ఉంచాలని బీజేపీ కోరుకుంటోందనీ తద్వారా ఎన్నికలకు దూరంగా ఉండి ఆప్ పార్టీ నాశనం అవుతుందని బిజెపి కలలు కంటుంది కాని అవి కలలు గానే మిగిలిపోతాయని స్పష్టం చేశారు.

# కేంద్ర ప్రభుత్వం భూములను వెనక్కు తిరిగి ఇవ్వాలి

**మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**



**విశ్వంభర, హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ (పీఎస్‌యూ) లకు రాష్ట ప్రభుత్వం అప్పట్లో కేటాయించిన భూములను వెనక్కు తిరిగి ఇవ్వాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్ డి కుమారస్వామిని కోరారు. రాజధాని పర్యటనలో ఉన్న మంత్రి శ్రీధర్ బాబు కేంద్ర మంత్రితో సమావేశమై పలు అంశాలను చర్చించారు. ప్రభుత్వరంగ సంస్థలను కేంద్రం పెట్టుబడుల ఉపసంహరణ కార్యక్రమం కింద విక్రయించాలని నిర్ణయించినందున వీటి మిగులు భూములను తిరిగి అప్పగించాలని శ్రీధర్ బాబు అభ్యర్థించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 70 సంవత్సరాల్లో అనేక ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పాటు చేయగా వాటికి అప్పట్లో వేలాది ఎకరాల భూములను కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. ఖాయిలా పడిన ఆదిలాబాద్ సిసిఐ సిమెంటు పరిశ్రమను పునరుద్ధరించి స్థానికంగా ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాలని కోరారు. 4 లక్షల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం ఉన్న ఈ సిమెంటు పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం 2100 ఎకరాల సున్నపు రాతి గనులతో పాటు మొత్తం 2290 ఎకరాల భూమిని ఉచితంగా అందజేసిందని గుర్తు చేసారు. దీనిని ప్రయివేటు పరం చేసే నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని కోరారు. తెలంగాణాలో పరిశ్రమల ఏర్పాటుకు అత్యంత అనుకూల పరిస్థితులు ఉన్నందున కొత్తగా ఏర్పాటు చేయబోయే ఇండస్ట్రీస్ ను రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో రాష్ట్రం ముందుంది. ఇక్కడ భూములు, నీరు, విద్యుత్తు అవసరాల మేరకు అందుబాటులో ఉన్నందున పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో శిక్షణ పొందిన మానవ వనరులకు కొదవ లేదని, ఐటిఐ, డిప్లొమా, ఇంజనీరింగ్ స్థాయిల్లో స్కిల్డ్ మ్యాన్ పవర్ సమృద్ధిగా ఉందని వెల్లడించారు. రాష్ట్రాన్ని సందర్శించి ఇక్కడి అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలన్న శ్రీధర్ బాబు అభ్యర్థనకు కుమారస్వామి సానుకూలంగా స్పందించారు. త్వరలో హైదరాబాద్ కు వచ్చి తన దృష్టికి తెచ్చిన అన్ని విషయాలపై అధికారులతో చర్చిస్తానని హామీ ఇచ్చారు.



# సంక్షేమ పథ నిర్దేశకుడు పీవీ నరసంహా రావు

**వకుళాభరణం కృష్ణ మోహన్ రావు**

**విశ్వంభర, హైదరాబాద్ :** దేశంలో సంక్షేమ పథకాల అమలులో ఆద్యుడిగా మాజీ ప్రధాని పీవీ నరసంహా రావు చరిత్ర పుటలలో చిరస్థాయిగా నిలిచి ఉంటారని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిష్న ఛైరమన్ డాకటర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు అన్నారు. 103 వ జయంతి సంధరభంగా శుక్రవారం న్నడు నెక్లెస్ రోడ్ లోని పీవీ జ్ఞానభూమి లో స్థమరక సాలం వదద పుష్పపలు సమర్పంచి ఆయన ఘనంగా నివాళులు అర్పంచారు. ఈ సందరభంగా అకకడ పాత్రికేయులతో మాటాటడుతూ.. పీవీ నరసంహా రావు ఉమమడి రాష్ట్ర ముఖ్నమంత్రి గా, దేశ ప్రధాని గా చేసన సేవలను డాకటర్ వకుళాభరణం కొనియాడారు. రాష్ట్రంలో ముఖ్నమంత్రిగా, దేశంలో ప్రధానమంత్రిగా బీసీలకు విద్య, ఉద్యోగ రంగాలలో ర్జర్వేష్నను అమలులోకి తెచిన ఘనత పీవీ దే అన్నారు. కార్పపర్ధట్ విదు ను పేదలకు అంద్యబాటులోకి తేవాలని రాష్ట్రంలో రెసడెన్షియల్ పాఠశాలలను, దేశవ్వాపతంగా నవోదయ పాఠశాలలను నెలకొలిపంది పీవీ నే అన్నారు.జతీయ స్థాయిలో పీవీ ప్రధానమంత్రి గా ఉనాపుపడే, జ్ఞతీయ స్థాయిలో బీసీ కమిష్న మైన్నర్టీ కమిష్న లు బీసీ ఆర్థక కార్పపర్ధష్న లు ఏరపఢ్ఢాయి అన్నారు. స్థమాను ప్రజల జీవన ప్రమాణాలు పెర్గితేనే, దేశం ప్రగతిపథంలో ముంద్యకు వెళ్ళటానికి స్థధం అని భావించిన పీవీ, బలహీన వర్గాల అభ్యునాతికి అనేక పథకాలు ప్రవేశపెటాటరు అని అన్నారు. తన సేసాలం హుజూరాబాద్ సమీపం లోని వంగర గ్రామం నుండి పీవీ అంచెలంచెలుగా దేశ ప్రధాన మంత్రిగా ఎదగడం గొప అనుభూతిని ఇచే అంశం అని ఆయన పేర్కొన్నారు.

# సివిల్ సప్లై హమాలీ కార్మికులకు నూతన ఒప్పందం

**వేతనాలను వెంటనే అమలు చేయాలి : వెంకటేశ్వర్లు**




**విశ్వంభర, చివ్వెంల:** సివిల్ సప్లై హమాలీ కార్మికులకు నూతన ఒప్పంద రేట్లను వెంటనే అమలు చేయాలని ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చివ్వె%శే%ల మండల కేంద్రములోనీ సివిల్ సప్లై హమాలీ కార్మికులతో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. 2024 జనవరి ఒకటి నుంచి నూతన రేట్ల ఒప్పందాన్ని అమలు చేయాల్సి ఉన్న కానీ కాలయాపన చేయడం ఏమిటీ అని నెమ్మాది అన్నారు. ప్రభుత్వము అంగీకరించిన పీఎఫ్ స్వీపర్లకు కనీస వేతనాలు వెంటనే అమలు చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 35 వేల హమాలీ కార్మికులు రాష్ట్ర వ్యాపితంగా ఉన్న80 లక్షల తెల్ల రేషన్ కార్డులు, మధ్యాహ్న భోజన పేద పిల్లలకు, హాస్టల్ పిల్లలు, అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం ఇతర నిత్యావసర వస్తువులు అందించడంలో హమాలీ కార్మికులపాత్ర కీలక పాత్ర కీలకమని అందుకని వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం తో పాటు పిఎఫ్, ఈఎస్ ఐ పెన్షన్ గ్రాట్యూటి తదితర చట్ట బద్ద హక్కుల తో పని భద్రత కల్పించాలని నెమ్మాది కోరారు. ఈ కార్యక్రమంలో హమాలీ సంఘము అద్యక్షుడు అమ్మయ్య, ఉపాధ్యక్షుడు యేసు, నవీన్, వెంకన్న, వినయ్, వెంకన్న, ఈదయ్య తదితరులు పాల్గొన్నారు.



# ముగిసిన సత్యనారాయణ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

**విశ్వంభర, దిల్‌సుఖ్‌నగర్ :** దిల్‌సుఖ్‌నగర్ పరిధిలోని వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవాలయం 22వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ప్రధాన కుభారాధన, మహాపూర్ణాహోతి, అష్టోత్తర శతఘటాభిషేకం, చక్రతీర్థం, తదితత ప్రతేక పూజలు వేతపండితులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో కొడకండ్ల శ్రీరామ శరణ్ శర్మ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఈ సందర్భంగా వేదపండితులను ఆలయ ఛైర్మన్ పూర నరసింహ గుప్త సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# మోటకొండూర్ మస్జీద్ కమిటీ అధ్యక్షులుగా బురాన్



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని మజీద్ ఏ రెహమానియ కమిటీ నూతన అధ్యక్షులుగా మొహమ్మద్ బురాన్ ప్రధాన కార్యదర్శిగా మొహమ్మద్ షానూర్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం జరిగిన మస్జిద్ కమిటీ మాజీ అధ్యక్షులు మొహమ్మద్ జహంగీర్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. కమిటీ అధ్యక్షులుగా మహమ్మద్ బురాన్ ఉపాధ్యక్షులుగా మహమ్మద్ అఫ్జల్ ప్రధాన కార్యదర్శిగా మొహమ్మద్ షానూర్ సహాయ కార్యదర్శిగా షేక్ అన్వర్ కోశాధికారిగా మహమ్మద్ చాంద్ కార్యవర్గ సభ్యులుగా మహమ్మద్ జాహంగీర్ హాజీ మస్తాన్ సుభాని అంకుష్ జహంగీర్ సలీం ఖలీల్ మునీర్ అష్రఫ్ మౌలానా లతీఫ్, షానూర్ అజీమ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షునికి ప్రధాన కార్యదర్శికి మైనార్టీ సోదరులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోటకొండూరు మైనార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు పోటీలు

**విశ్వంభర, భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అంబేద్కర్ స్టేడియం కృష్ణ కాలనీ భూపాలపల్లిలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పాఠశాలల ప్రవేశాల కొరకు జిల్లా నలు మూలల నుంచి సుమారు 60 మంది నాలుగో తరగతి బాల బాలికలు పాల్గొన్నారు. జిల్లాకు చెందిన ఫిజికల్ డైరెక్టర్లు, కేలో ఇండియా కోచ్ శ్రీనివాస్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది శివసాగర్ తదితరులు పాల్గొన్నారని జిల్లా క్రీడల శాఖ అధికారి రఘు తెలిపారు. ఉత్తమ ప్రదర్శన ప్ర దర్శించిన బాల బాలికలు జూలై 8న హైదరాబాద్ హకీంపేటలో జరిగే జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు.



# ఐపీఎం ఉద్యోగి ఆనంద్‌రావుకి న్యాయం చేయాలి

- గిరిజన శక్తి, ఓయూ జేఏసీ డిమాండ్
- ఐపీఎం డైరెక్టర్‌కు వినతి
- వైద్యశాఖ మంత్రి జోక్యం చేసుకోవాలి

**విశ్వంభర, హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పనిచేస్తున్న తెలంగాణ ప్రాంతానికి చెందిన ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్(ఐపీఎం) ఉద్యోగి అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఆనంద్‌రావును తెలంగాణకు కేటాయించి గత 22 నెలలు గడుస్తున్న పోస్టింగ్ ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వెంటనే ఆనంద్‌రావుకు పోస్టింగ్ ఇవ్వాలని గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు, ఓయూ జేఏసీ అధ్యక్షుడు శరత్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నారాయణగూడ ఐపీఎం ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్ డాక్టర్ శివ లీలను కలిసి గిరిజన శక్తి రాష్ట్ర కమిటీ, ఓయూ జేఏసీ ఆధ్వర్యంలో విషయాన్ని వివరించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శరత్ నాయక్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014 ప్రకారం రెండు రాష్ట్రాల్లో ఐపీఎంలో పని చేస్తున్న ఉద్యోగుల విభజన 2022లో జరిగిందని, పోస్టింగ్ ఇవ్వకుండా గిరిజన ఉద్యోగిని మానసికంగా వేధిస్తున్నారని ఆగ్రం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జోక్యం చేసుకొని తక్షణమే గిరిజన బిడ్డ అయన ఆనంద్‌రావుకు న్యాయం చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా అన్ని దళిత సంఘాలతో కలుపుకొని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ప్రస్తుత పాలకులు దళిత ఉద్యోగుల పట్ల కక్ష సాధింపు చర్యలు సరికావని, జీవో నెంబర్ 106 ను అమలు చేయాలని, ఆనంద్ రావు పోస్టింగ్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన శక్తి వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బు నాయక్, రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ రమేష్ రాథోడ్, ఓయూ అధ్యక్షుడు హనుమంతు నాయక్, ప్రధాన కార్యదర్శి సతీష్ నాయక్,సైఫాబాద్ కళాశాల అధ్యక్షుడు మౌలాలి నాయక్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజశేఖర్ నాయక్ పాల్గొన్నారు.



# అప్రమత్తతో విధులు నిర్వర్తించాలి

## భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే

**విశ్వంభర, భూపాలపల్లి :** మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దులోని పోలీసులు మావోయిస్టుల కదిలికలపై అప్రమత్తంగా ఉండాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. శుక్రవారం కాళేశ్వరం పోలీసు స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో రికార్డులను, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. జిల్లాలో మావోల ప్రాబల్యం ఉన్నందున, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో పోలీసులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పక్కనే మహారాష్ట్రలో మావోలకదిలికలు అధికంగా ఉండడంతో గోదావరి నది దాటి వచ్చే అవకాశం ఉన్నందున పటిష్ట నిఘా పెట్టాలని ఎస్పీ సూచించారు. అలాగే పోలీసు స్టేసన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారం చేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. పోలిసు సిబ్బంది, అధికారులు క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని, పోలీసు సిబ్బందికి ఎలాంటి సమస్యలు ఉన్నా, తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. అనంతరం ఎస్పీ కాళేశ్వరంలోని ఇసుక క్వారీల పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాటారం డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి, ఎస్‌బీ ఇన్స్పెక్టర్ వసంత్ కుమార్, కాళేశ్వరం ఎస్ఐ చక్రపాణి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మేడిగడ్డ పునరుద్ధరణ పనులకు బ్రేక్

**విశ్వంభర, భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మేడిగడ్డ బ్యారేజీ ఏడవ బ్లాకులో మరమ్మతుల పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ఎగువన కురుస్తున్న వర్షపు నీరు వచ్చి బ్యారేజీలోకి చేరుతుండడంతో పునరుద్ధరణ పనులకు బ్రేక్ పడింది. బ్యారేజీ మొత్తం 85 గేట్లు ఉండగా అందులో 20వ గేటు మోరాయించడంతో గ్యాస్ కట్టర్ల సహాయంతో కట్ చేసి గేటు భాగాలను విడదీశారు. వరద నీరు ఏడవ బ్లాకు లోకి రాకుండా ఉండేందుకు ఆరవ బ్లాకు లోని 23 నుంచి 26వ పియర్స్ మధ్యలో ఉన్న మూడు గేట్లను మూసివేసి అప్ డౌన్ లో చేపట్టిన సిసి బ్లాక్ రీ అరేంజ్మెంట్ పనులను పూర్తి చేస్తున్నారు. గ్రౌంటింగ్ షీట్ ఫైల్స్, గ్రౌండింగ్ సి కెంట్ ఫైల్స్ పనులు ఇప్పటికే పూర్తి అయ్యాయి. పైనుంచి బ్యారేజీ లోకి వరద వచ్చి చేరుతుండడంతో అప్ స్ట్రీమ్, డౌన్ స్ట్రీమ్ లలో ఉన్న యంత్రాలను మూడు రోజుల ముందు నుంచి పైకి తీసుకొస్తున్నారు. మొత్తానికైతే వర్షాకాలం వెళ్లిన తర్వాతనే మళ్లీ బ్యారేజీ పునరుద్ధరణ పనులు మొదలుకానున్నాయి.

# స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఖాతాలో మిగిల్చింది రూ.7కోట్లు మాత్రమే

- అయిదు నెలల జీతాలకు మాత్రమే సరిపోతాయి
- 2020-21 ఆర్థిక సంవత్సరంలో రూ.2092 కోట్లు నిధి ఉంటే.. ఇప్పుడు ఈ దుస్థితి ఎందుకు వచ్చింది?
- కార్పొరేషన్ నిధులు ఎటు మళ్లించారు
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కార్యక్రమాలపై సమీక్షలో రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ విస్మయం



**విశ్వంభర, విజయవాడ :** 2020-21 ఆర్థిక సంవత్సరంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఖాతాలో రూ.2092.65 కోట్ల నిధులు ఉంటే ప్రస్తుతం కేవలం రూ.7 కోట్లు మాత్రమే మిగిల్చారా అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్.డబ్ల్యూ.ఎస్., పర్యావరణ, అటవీ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ విస్తుపోయారు. బుధవారం మంగళగిరిలోని నివాసంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కార్యక్రమాలు, కార్పొరేషన్‌కు ఉన్న నిధులు, రాష్ట్రంలో వ్యర్థాల నిర్వహణపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వ పాలన సమయంలో కార్పొరేషన్ నిధులు మళ్లింపు అంశంపై చర్చించారు.

2020-21లో రూ.728.35 కోట్లు మాత్రమే ఈ కార్పొరేషన్ వినియోగించింది. 2021-22లో రూ.508 కోట్లు ఖర్చు చేశారు. ఆ ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి రూ.1066.36కోట్లు ఖాతాలో ఉన్నాయి. అయితే 2022-23 ఆర్థిక సంవత్సరం ప్రారంభం అయ్యేనాటి కార్పొరేషన్ ఖాతాలో రూ.3 కోట్లు మాత్రమే ఉన్నాయని రికార్డుల్లో నమోదు అయింది. దీనిపై వివరణ ఇవ్వాలని, నిధులు ఎటు వెళ్ళాయి, ఏం చేశారో సవివరంగా పేర్కొనాలని ఉప ముఖ్యమంత్రివర్యులు అధికారులను ఆదేశించారు. ఆ ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.70 కోట్లు నిధులు మంజూరు చేయగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్లు నిధులు అందించింది. రూ.46 కోట్లు ఖర్చు చేసింది. 2023-24లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన నిధులు, వాటిపై వచ్చిన వడ్డీతో రూ.239 కోట్లు నిధులు సమకూరాయి. ఖర్చు రూ.209 కోట్లు మేర చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికీ మిగిలినవి రూ.7.04 కోట్లు మాత్రమే.

### స్వచ్ఛాంధ్ర నిధులనూ వదల్లేదు

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులు సక్రమంగా వినియోగమయితేనే ఈ సంస్థకు నిర్దేశించిన లక్ష్యాలు అందుకోగలమని ఉపముఖ్యమంత్రివర్యులు స్పష్టం చేశారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు సదుద్దేశంతో, ప్రజారోగ్యం కోసం స్వచ్ఛ భారత్ మిషన్ తీసుకువచ్చారని అందులో భాగంగానే స్వచ్ఛాంధ్ర ఏర్పాటైందని తెలిపారు. కేంద్రం ఇచ్చిన నిధులను నెలల తరబడి బ్యాంకు ఖాతాల్లో ఉంచడం, ఆ నిధుల ద్వారా వడ్డీ కూడా లభిస్తున్నా వినియోగించకుండా ఆపైన ఇతర అవసరాలకు మళ్లించడం అనేది గత ప్రభుత్వ పాలకులు చేసిన ఓ దురదృష్టకర ప్రక్రియ అని పవన్ కళ్యాణ్ తెలిపారు. అందుకు 2022-23 ఆర్థిక సంవత్సరం ప్రారంభం ఆయ్యేనాటికి కార్పొరేషన్ ఖాతాలో కేవలం రూ.3 కోట్లు మిగల్చడమే ఉదాహరణ అన్నారు. దీన్నిబట్టే వైసీపీ పాలకులు నిధుల మళ్లింపు ఏ స్థాయిలో ఉందో అర్థం అవుతోందన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ లక్ష్యాలను గాలికొదిలేసి, వ్యవస్థలను నిర్వీర్యం చేసేశారని చెప్పారు. ఇప్పుడు జీతాలకు సరిపడా నిధులు మాత్రమే ఖాతాలో ఉండే పరిస్థితి ఎందుకు వచ్చింది? అని అధికారులను ప్రశ్నించారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌లో నిధుల మళ్లింపుపై మరింత లోతుగా సమీక్షించాల్సిన అవసరం ఉందన్నారు. నిధులు ఎటు మళ్లించారో, ఎవరి ఆదేశాలతో ఆ పని చేశారో కూడా తెలియచేయాలని, గత అయిదేళ్లలో ఈ సంస్థ చేపట్టిన కార్యక్రమాలను సమగ్రంగా చర్చిద్దామని అధికారులకు ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సమీక్షలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎమ్‌డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వైసీపీకి అలీ గుడ్ బై

## రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటన

**విశ్వంభర, విజయవాడ:** సినీ నటుడు అలీ వైసీపీకి రాజీనామా చేశారు. అలాగే రాజకీయాల నుంచి తప్పుకు న్నట్లు ప్రకటించారు. తాను ప్రస్తుతం ఏ పార్టీకి చెందిన వ్యక్తిని కాదని ఓ వీడియో విడుదల చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో అలీ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారుగా పనిచేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో టికెట్ ఆశించిన అలీ భంగపడ్డారు. ఆయనకు వైసీపీ టికెట్ కేటాయిం చలేదు. దీంతో అలీ ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉన్నారు. తాజాగా తాను ఏ పార్టీకి చెందిన వ్యక్తిని కాదని, ఒక సామాన్యుడినని, ఐదేళ్ల ఒకసారి ఓటు హక్కు వినియోగించుకుంటానని ఓ వీడియో విడుదల చేశారు.



### ఇకపై ఏ పార్టీ వ్యక్తిని కాదు

"1999లో డాక్టర్ డి.రామానాయుడు కోసం నేను రాజకీయాల్లో అడుగుపెట్టాను. నాకు అద్భుతమైన అవకాశం ఇచ్చి సినిమాల్లో నిలదొక్కుకునేందుకు రామానాయుడు సాయం చేశారు. ఆయన కోసం నేను అప్పట్లో బాపట్లలో ప్రచారం చేశారు. ఆ తర్వాత మరో పార్టీలో జాయిన్ అయ్యాను. నాకు అన్నం పెట్టింది సినీ ఇండస్ట్రీ. ఈ రోజున ఈ స్థాయిలో ఉన్నానంటే అందుకు తెలుగు ప్రజలే కారణం. ఇవాళ 1200లకు పైగా చిత్రాల్లో నటించాను. 6 భాషల్లో నటించాను. దాదాపు 45 సంవత్సరాలుగా సినీ పరిశ్రమలో ఉన్నాను. నాకు ఇంత చేసిన తెలుగు ప్రజలకు సేవ చేయాలని రాజకీయాల్లోకి వచ్చాను తప్ప రాజకీయాలు చేయాలని రాజకీయాల్లోకి రాలేదు. మా నాన్న పేరుతో నేను ఒక ట్రస్ట్ నడుపుతున్నాను. కోవిడ్ సమయంలో కూడా నా ట్రస్ట్ ద్వారా సేవలు అందించాను. నేను సంపాదించిన దానిలో 20 శాతం ఆ ట్రస్ట్ ద్వారా పేద ప్రజలకు సేవ చేస్తున్నారు. విదేశాల్లో ప్రోగ్రామ్స్ చేస్తే 60 శాతం ట్రస్ట్ కు ఇస్తాను. ఇకపై నా జీవితం సినిమాలకే అంకితం. రాజకీయాలను దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాను. ఇకపై నేను ఏ రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తిని కాదు"

– సినీ నటుడు అలీ

# జైపాలస్తీన్ అంటే దాడులు చేస్తారా..?

## ఎంఐఎం అధినేత నివాసంపై దాడిని ఖండించిన గులాం అహ్మద్ హుస్సేన్

**విశ్వంభర, కరీంనగర్ :** హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ నివాసంపై అర్ధరాత్రి దుండగులు దాడి చేయడం సిగ్గుమాలిన చర్యఅని, ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుసేన్ అభివర్ణించారు. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ నివాసంపై దుండగులు దాడి జరపడాన్ని శుక్రవారం ఓ పత్రిక ప్రకటనలో ఆయన ఖండించారు. గాడ్సే వారసులను దేశం నుంచి బహిష్కరించే దమ్ము ఉందా, కనీసం వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే ధైర్యం కేంద్ర ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించారు. దేశం నుంచి ఇజ్రాయెల్‌తో జరుగుతున్న యుద్ధంలో పాలస్తీనలో అమాయక ప్రజలు చనిపోతున్న నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాధినేతలు, ప్రజాస్వామికవాదులు పాలస్తీనాకు మద్దతు పలక లేదా అని ప్రశ్నించారు. ఇదే కోణంలో తమ అధినేత సైతం జైపాలస్తీన్ అని ఉంటారని, ఇందులో తప్పు ఏముందన్నారు. దేశంలో ఎన్నో సమస్యలను పక్కనపెట్టి, ఈ అంశాన్ని భూతద్దంలో పెట్టి బీజేపీ, ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్ తమ ఉనికిని చాటుకునేందుకు రాజకీయ దుమారాన్ని సృష్టించడం సిగ్గుచేటని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఓవైసీ నివాసం వద్ద కట్టుదిట్టమైన మూడంచెల భద్రత వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



# నెంబర్ ప్లేట్ లేని వాహనాల సీజ్

**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ప్రజలకు స్థానిక ఎస్ఐ చక్రపాణి ఒక ప్రకటన విడుదల చేస్తూ పై అధికారుల ఆదేశాల మేరకు ఫ్రెండ్లీ పోలీసింగ్ అనునది బాధితులకు మాత్రమే వర్తించును కావున అసాంఘిక శక్తులు, మద్యం తాగి బండి నడిపే వాళ్ళు, బహిరంగంగా మద్యం సేవించే వాళ్ళు, గంజాయి, గుడుంబాకు అలవాటు పడిన వాళ్ళు మరియు మహిళలపై, చిన్నపిల్లలపై దౌర్జన్యం చేసే వాళ్లపై, ఇంకా రాత్రి సమయాన రోడ్లపై తిరిగే వాళ్లపై, ర్యాశ్ డ్రైవింగ్ చేసే వాళ్లపై కఠిన చర్యలు తీసుకొని శిక్షించనున్నట్లు తెలిపారు. అలాగే మైనర్లకు బండి ఇచ్చి నడిపిస్తే వాళ్ళ తల్లిదండ్రులపై చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. మహదేవపూర్ ఎస్సై మరియు కాళేశ్వరం ఎస్ఐ ఆధ్వర్యంలో కాలేశ్వరంలో పెట్రోలింగ్ నిర్వహిస్తూ నెంబర్ ప్లేట్ లేని 14 టూ వీలర్ బైక్ లను ఒక కారును సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



# పెద్దంపేటలో వైద్య శిబిరం

## దోమల నివారణకు చర్యలు

**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లా పెద్దంపేటలో రెండవ రోజువైద్య శిబిరం కొనసాగుతుం ది. అంబట్‌పల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పూ ణేం రామారావు ఆధ్వర్యంలో గ్రామంలోని రోగాల బారినపడిన వారికి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. గ్రామంలో ప్రబలిన వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కలుషి త నీరు తాగడం వలన వచ్చే వ్యాధుల పట్ల జాగ్రత్త పడాలని, మంచినీరు కాచి చల్లార్చి వడపోసి తాగా లని సూచించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో మురి కి నీరు నిల్వలు ఉండకుండా చూడాలని జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్ర మంలో అంబట్ పల్లి వైద్యాధికారి డాక్టర్ రామారావు, హెల్త్ అసిస్టెంట్ సత్యానారాయణ, ఏఎన్ఎంలు బూల్య శ్రీలత, ఆశలు సమ్మక్క, శ్రీలత, పంచాయితీ కార్యదర్శి సృజన్, సిబ్బంది పాల్గొన్నారు.



# పదవి విరమణ సన్మానోత్సవం

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయునిగా 38 సంవత్సరాల 7 నెలల పాటు సేవలందించి, ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్ది, ఈ మాసం చివరన ఉద్యోగ విరమణ పొందుతున్న మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల మోరిపిరాల ప్రధానోపాధ్యాయులు యాస పద్మారెడ్డిని పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు ముత్యం అశోక్ అధ్యక్షతన ఉపాధ్యాయ బృందం మరియు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో పూలదండ, శాలువా, ప్రశంసా పత్రంతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తండా మంగమ్మ శ్రీశైలంగౌడ్, పాఠశాల శాశ్వతదాత చింతపట్ల వినుకర్‌రావు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ముద్దసాని జయమ్మ, తాజా మాజీ సర్పంచ్ సామ తిరుమలరెడ్డి, గ్రామ పంచాయతీ సెక్రెటరీ అంబోజు శేఖర్, తాజా మాజీ ప్రధానోపాధ్యాయులు దడిపల్లి వెంకన్న పాల్గొని వారి అంకిత భావాన్ని, వృత్తి నిబద్ధతను కొనియాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ ముదసాని చిన్న శంకరయ్య గౌడ్, మాజీ ప్రజా ప్రతినిధులు బద్దం వెంకటరెడ్డి, పంజాల స్వామి, మాజీ పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ దేవెళ్ళ శ్రీధర్, గ్రామ పెద్దలు సామ వెంకటరెడ్డి, యువజన మండలి అధ్యక్షులు ముద్దసాని శ్రీనివాస్ గౌడ్ మరియు ముప్పిడి స్వామి, ఉపాధ్యాయులు వేనేపల్లి సుజాత, జూకంటి కరుణాకర్, ఎర్రబెల్లి నాగమల్లు, విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## ఢిల్లీ విమానాశ్రయంలో కూలిన పైకప్పు

- ఒకరు మృతి, ఐదుగురికి గాయాలు
- ప్రమాద స్థలాన్ని సందర్శించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు
- మృతి చెందిన వారికి రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా
- ఘటనపై పూర్తి స్థాయి విచారణకు ఆదేశం

**విశ్వంభర, ఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలోని ఇందిరాగాంధీ విమానాశ్రయంలో పెను ప్రమాదం తప్పింది. శుక్రవారం తెల్లవారుజామున ఎయిర్‌పోర్టులోని టెర్మినల్-1 పైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో ఒకరు మరణించగా మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. పైకప్పు కూలినట్లు ఉదయం 5.30 గంటలకు తమకు సమాచారం అందిందన్నారు. పైకప్పు ట్యాక్సీలు సహా పలు వాహనాలపై పడటంతో ధ్వంసమయ్యాయని చెప్పారు. భారీ వర్షాల వల్ల ఈ ప్రమాదం జరిగిందని వెల్లడించారు. టెర్మినల్-1లోని పైకప్పు కూలడం వల్ల విమాన రాకపోకలపైనా ప్రభావం పడింది. అక్కడి నుంచి బయలుదేరాల్సిన విమాన సర్వీసులను నిలిపివేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ముందు జాగ్రత్తగా చెకిన్ కౌంటర్లు మూసివేశామని చెప్పారు. కాగా, పైకప్పు కూలిన ఘటనపై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు స్పందించారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. క్షతగాత్రులను వెంటనే దవాఖానకు తరలించి వైద్యం అందిస్తున్నామని చెప్పారు. టెర్మినల్-1 వద్ద ప్రయాణికులందరికీ తగిన ఏర్పాట్లు చేయాలని విమానయాన సంస్థలకు సూచించారు. ఈ ఘటన నేపథ్యంలో టెర్మినల్‌ను కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు సందర్శించారు. కూలిన ప్రాంతాన్ని పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఘటనలో మృతి చెందిన వారికి రూ.20 లక్షలు, క్షతగాత్రులకు ఒక్కొక్కరికి రూ.3 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. అనంతరం కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడారు. 'భారీ వర్షాల కారణంగా ఎయిర్‌పోర్ట్ వెలుపల ఉన్న కొంత భాగం కూలిపోయింది. ఈ విషాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలియజేస్తున్నా. ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్, ఫైర్ సేఫ్టీ టీమ్‌లు ఘటనాస్థలం వద్ద అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం టెర్మినల్‌ను మూసివేశాం. ఇక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. కూలిపోయిన భవనం పాతది. 2009లో ప్రారంభించారు. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకుంటున్నాం. పూర్తి స్థాయి విచారణకు ఆదేశించాం' అని మంత్రి తెలిపారు.

# నీట్ పరీక్షపై లోక్‌సభలో రచ్చ

- లోక్‌సభ సోమవారానికి వాయిదా
- రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానం
- వాయిదా తీర్మానం ఇచ్చిన విపక్షం
- 12 గంటల వరకు సభ వాయిదా వేసిన స్పీకర్
- అటు రాజ్యసభలోనూ ఇదే గందరగోళం



**విశ్వంభర, న్యూఢిల్లీ :** నీట్ పేపర్ లీక్ అంశం ఉభయ సభలను కుదిపేస్తోంది. దీనిపై చర్చ జరపాలని విపక్ష కూటమి సభ్యులు డిమాండ్ చేయడంతో శుక్రవారం లోక్‌సభ, రాజ్యసభలో గందరగోళ పరిస్థితి నెలకొంది. దీంతో విపక్షాల ఆందోళనలతో దిగువ సభ సోమవారానికి వాయిదా పడింది. ఉదయం 11 గంటలకు ఉభయ సభలు ప్రారంభం కాగానే రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని కేంద్రం ప్రవేశపెట్టింది. ఈ చర్చను లోక్‌సభలో స్పీకర్ ప్రారంభించిన వెంటనే.. విపక్షాలు సభలో నీట్ అంశాన్ని లేవనెత్తాయి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చను నిలిపివేసి.. నీట్ పరీక్షపై ఇచ్చిన వాయిదా తీర్మానంపై చర్చించాలని పట్టుబట్టాయి. నీట్ పరీక్ష గురించి సభలో చర్చించాలని రాహుల్ డిమాండ్ చేశారు. ఇరు వైపుల నుంచి విద్యార్థు లకు సందేశం ఇవ్వాలని ఆశిస్తున్నానని తెలిపారు. ప్రభు త్వం వైపు నుంచి, విపక్షాల వైపు నుంచి నీట్ పరీక్ష గురిం చి విద్యార్థులకు తెలియజేస్తామని రాహుల్ అన్నారు. నీట్‌పై ప్రత్యేక చర్చ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

### స్పీకర్ ఓం బిర్లా అభ్యంతరం

అందుకు స్పీకర్ ఓం బిర్లా అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం చేపట్టడానికి ముందు ఎటువంటి వాయిదా తీర్మానాలను స్వీకరించరు అని తెలిపారు. కానీ విపక్ష ఎంపీలు మాత్రం తమ పట్టువీడలేదు. నీట్‌పై చర్చ చేపట్టాలంటూ నినాదాలు చేయడంతో సభలో గందరగోళ పరిస్థితి నెలకొంది. దీంతో సభను 12 గంటల వరకు స్పీకర్ వాయిదా వేశారు. ఆ తర్వాత తిరిగి సభ ప్రారంభమైనప్పటికీ ఎలాంటి మార్పు లేదు. ప్రతిపక్షాల నిరసనల నేపథ్యంలో సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓంబిర్లా ప్రకటించారు. మరోవైపు ఎగువ సభలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. రాజ్యసభలో నీట్ అంశంపై చర్చకు విపక్షాలు పట్టుబడుతూ నినాదాలు చేశారు. పేపర్ లీకేజీపై ఖర్గే ఆరోపణలు చేశారు. దీంతో సభలో గందరగోళం ఏర్పడింది. ఈ నేపథ్యంలో చైర్మెన్ జగదీప్ ధన్‌కర్ సభను 12 గంటల వరకు వాయిదా వేశారు. ఆ తర్వాత సభ ప్రారంభమైనప్పటికీ విపక్ష సభ్యులు ఆందోళన కొనసాగించాయి. అయినప్పటికీ చైర్మన్ ధన్‌కర్ సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చను చేపట్టారు. సభ్యులు ఆందోళన కొనసాగిస్తుండటంతో సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు.



## నీట్ రద్దు చేయాలంటూ..
# తమిళనాడు అసెంబ్లీ తీర్మానం

- నీట్ రద్దు తీర్మానాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ప్రభుత్వం
- పలు పార్టీలు తీర్మానానికి మద్దతు

**విశ్వంభర, తమిళనాడు :** వైద్య విద్యా సంస్థల్లో ప్రవేశాలకు నిర్వహించే జాతీయస్థాయి అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్) పేపర్ లీక్‌పై దేశ వ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. శుక్రవారం పార్లమెంట్‌ను ఈ అంశం కుదిపేసింది. ఈ నేపథ్యంలో నీట్ రద్దు చేయాలంటూ ఏకగ్రీవ తీర్మానాన్ని తమిళనాడు అసెంబ్లీ ఆమోదించింది. నీట్‌ను రద్దు చేయాలని, నీట్ అమలుకు ముందు మాదిరిగా 12వ తరగతి మార్కుల ఆధారంగా మెడికల్ అడ్మిషన్లు చేపట్టేం దుకు రాష్ట్ర ప్రభుత్వాలను అనుమతించాలని కేంద్ర ప్రభు త్వాన్ని కోరింది. కాగా నీట్-యూజీ 2024 ఎగ్జామ్ పేపర్ లీక్, నీట్-పీజీ 2024 పరీక్షను ఆకస్మికంగా వాయిదా వేయడంపై అభ్యర్థుల్లో గందరగోళం నెలకొన్నది. ఈ తరు ణంలో తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ శుక్రవారం నీట్ రద్దు తీర్మానాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. మణితనేయ మక్కల్ కట్చి, మరుమలార్చి ద్రవిడ మున్నేట్ర కజగం, తమిళగ వెట్రి కజగం, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) సహా పలు ప్రాంతీయ పార్టీలు ఈ తీర్మానానికి మద్దతు తెలిపాయి. మరోవైపు దేశవ్యాప్తంగా మెడికల్ అడ్మిషన్ల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) నిర్వహిం చిన నీట్ నుంచి మినహాయించాలన్న తమిళనాడు డిమాండ్‌ను డీఎంకే ఎంపీ కనిమొళి ఢిల్లీలో పునరుద్ఘాటించారు. మాకు నీట్ వద్దు అని తమిళనాడు స్పష్టంగా చెబుతోంది. నీట్ సరైన పరీక్ష కాదని ఇప్పుడు రుజువైంది. నీట్ వల్ల విద్యార్థులు చాలా నష్టపోతున్నారు' అని మీడియాతో ఆమె అన్నారు. తీర్మానాన్ని రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిందని వెల్లడించారు.



## హేమంత్ సోరెన్‌కు బిగ్ రిలీఫ్

- భూ కుంభకోణం కేసులో బెయిల్
- ఐదు నెలల తర్వాత జైలు నుంచి బయటకు
- హర్షం వ్యక్తం చేసిన జేఎంఎం శ్రేణులు

**విశ్వంభర, జార్ఖండ్ :** జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు భారీ ఊరట దక్కింది. భూ కుంభకోణం కేసులో అరెస్టైన ఆయనకు జార్ఖండ్ హైకోర్టు తాజాగా బెయిల్ మంజూరు చేసింది. దీంతో రాంచీలోని బిర్సా ముండా జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న ఆయన హైకోర్టు తీర్పుతో ఐదు నెలల తర్వాత జైలు నుంచి బయటకు వచ్చారు. జార్ఖండ్ ముఖ్యమంత్రిగా ఉన్న హేమంత్ సోరెన్‌ను భూ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జనవరి 31న అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. విచారణలో అధికారులు అడిగిన ప్రశ్నలకు సోరెన్ సమాధానం దాటవేస్తున్న క్రమంలో మనీలాండరింగ్ నియంత్రణ చట్టం(పీఎంఎల్‌ఏ) కింద ఆయన్ను కస్టడీలోకి తీసుకున్నారు. అప్పటి నుంచి జైల్లోనే ఉన్న ఆయన దాదాపు ఐదు నెలల తర్వాత ఇప్పుడు బెయిల్‌పై బయటకు రాబోతున్నారు. కాగా, అరెస్ట్ అనంతరం సోరెన్ సీఎం పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో ఆయన స్థానంలో జార్ఖండ్ ముఖ్యమంత్రిగా చంపై సోరెన్ బాధ్యతలు చేపట్టారు. ఇక భూ కుంభకోణం కేసులో జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్‌కు జార్ఖండ్ హైకోర్టు బెయిల్ మంజూరు చేయడాన్ని ఆయన భార్య కల్పనా సోరెన్ స్వాగతించారు. ఎన్నో నెలల తర్వాత సంతోషకరమైన రోజు ఎదురైందని హర్షం వ్యక్తం చేశారు. కష్టకాలంలో తమకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నానని ఆమె పేర్కొన్నారు.

### జేఎంఎం శ్రేణుల ఆనందం

హేమంత్ సోరెన్ ప్రస్తుతం జార్ఖండ్ ముక్తి మోర్చా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఉన్నారు. ఆయనకు బెయిల్ మంజూర్ కావడంపై పార్టీ శ్రేణులు ఆనందోత్సాహాలతో మిఠాయిలను పంచుకున్నారు. సోరెన్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు జనవరి 31న అరెస్టు చేశారు. సోరెన్‌ను అన్యాయంగా టార్గెట్ చేశారని, ఆయనపై పెట్టింది రాజకీయ ప్రేరేపిత, కల్పిత కేసు అని ఆయన తరపు న్యాయవాది, సీనియర్ అడ్వొకేట్ మీనాక్షి అరోరా వాదించారు.



## రాహుల్ గాంధీ మాట్లాడుతుండగా మైక్ కట్!

**ఎక్స్‌లో పోస్టు చేసిన కాంగ్రెస్ పార్టీ**

**విశ్వంభర, ఢిల్లీ:** పార్లమెంట్ సమావేశాల్లో శుక్రవారం గందరగోళం నెలకొంది. నీట్‌లో అవకతవకలపై కేంద్ర ప్రభుత్వాన్ని విపక్ష పార్టీలు నిలదీశాయి. ఇండియా కూటమి, ఎన్డీఏ వాగ్వాదానికి దిగాయి. నీట్ పేపర్ లీక్ అంశాన్ని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లేవనెత్తడంతో మైక్‌ను ఆఫ్ చేశారని కాంగ్రెస్ శుక్రవారం పేర్కొంది. ఆ తర్వాత మైక్రోఫోన్ యాక్సెస్ కోసం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను రాహుల్ గాంధీ అభ్యర్థిస్తున్నట్లు ఉన్న వీడియోను కాంగ్రెస్ తమ అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. నీట్ వివాదంపై చర్చ జరగాలని రాహుల్ గాంధీ కోరారు. నీట్‌పై ప్రభుత్వం నుంచి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. నీట్ డిమాండ్‌పై విపక్షాలు గందరగోళం సృష్టించడంతో స్పీకర్ ఓం బిర్లా లోక్‌సభను సోమవారానికి వాయిదా వేశారు. దేశంలో జరుగుతున్న పేపర్ లీకేజీల వల్ల యువత భవిష్యత్తు పాడైపోతుందని కాంగ్రెస్ ఎంపీ దీపేందర్ హుడా అన్నారు. హరియాణాలో పేపర్ లీక్ కేసులు అధికంగా నమోదయ్యాయని చెప్పారు. నీట్ పేపర్ లీక్ అయితే దీనికి బాధ్యత వహించాల్సిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దాని నుంచి దూరంగా పారిపోతున్నారంటూ విమర్శించారు. నీట్ పై తాము చర్చను లేవనెత్తుతుంటే ప్రతిపక్ష నాయకుడి మైక్ ను స్విచ్ ఆఫ్ చేస్తున్నారని అన్నారు.

## నాపై పోక్సో కేసు కొట్టి వేయండి


**హైకోర్టులో యడియూరప్ప పిటిషన్ దాఖలు**



**విశ్వంభర, కర్ణాటక :** కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప పోక్సో చట్టం కింద తనపై నమోదైన బాలలపై లైంగిక వేధింపుల కేసును కొట్టివేయాలని కర్ణాటక హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పోక్సో కేసులకు సంబంధించిన ప్రత్యేక కోర్టులో యడియూరప్పపై పోలీసులు ఇటీవల చార్జిషీట్ దాఖలు చేసిన నేపథ్యంలో, శుక్రవారం ఆయన కేసును రద్దు చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేయడం గమనార్హం. ఈ ఏడాది ఫిబ్రవరిలో యడియూరప్ప తన కుమార్తెపై లైంగిక దాడికి పాల్పడ్డారని 17 ఏళ్ల బాలిక తల్లి చేసిన ఫిర్యాదు ఆధారంగా, ఆయనపై పోక్సో చట్టం, సెక్షన్ 354 %ూ% కింద లైంగిక వేధింపుల కేసు నమోదైంది. కర్ణాటక డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, అలోక్ మోహన్ దర్యాప్తును క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సీఐడీ)కి బదిలీ చేశారు. అయితే తనపై వచ్చిన ఆరోపణలను యడియూరప్ప ఖండించారు. నాపై కుట్ర చేస్తున్న వారికి ప్రజలు గుణపాఠం చెబుతారని అన్నారు. తన కూతురిపై మాజీ సీఎం లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆరోపించిన 54 ఏళ్ల మహిళ ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో గత నెలలో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో మరణించింది. అయితే దానికి ముందుగానే పోలీసులు ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి జూన్ 17న యడియూరప్పను సీఐడీ మూడు గంటల పాటు ప్రశ్నించింది.

## దక్షిణ పెరూలో భారీ భూకంపం

**రిక్టర్ స్కేలుపై 7.2గా తీవ్రత నమోదు**



**విశ్వంభర, లిమా:** దక్షిణ పెరూలో భారీ భూకంపం సంభవించింది. స్థానిక కాలమానం ప్రకారం శుక్రవారం తెల్లవారుజామున 12.30 నిమిషాలకు భూకంపం వచ్చిందని, దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.2గా నమోదైనట్లు అధికారులు తెలిపారు. ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలు తెలియాల్సి వుందని అన్నారు. భూకంప కేంద్రం కారవెలి ప్రావిన్స్ లో ఆంటిక్విపా జిల్లాకు పశ్చిమాన 8 కి.మీ దూరంలో పసిఫిక్ సముద్రంలో భూకంప కేంద్రం ఉంది. చిలీ, బలీవియా సరిహద్దుకి సమీపాన రాజధాని లిమాకు 380 మైళ్ల దూరంలో ఉంది. 28 కి.మీ లోతులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. రాజధాని లిమాతో పాటు ఐకా, అయాకుచో ప్రాంతాల్లో భూమి కంపించినట్లు స్థానిక మీడియా తెలిపింది. ప్రధాన రహదారిపై రాళ్లు పడటంతో జిల్లాకు ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోయినట్లు అయాకుచో ప్రాంతంలోని శాంకోస్ జిల్లా మేయర్ స్థానిక మీడియాకు తెలిపారు.



# సీఎం బాబుతో తెలంగాణ గవర్నర్ భేటీ

**విశ్వంభర, అమరావతి:** తెలంగాణ గవర్నర్ రాధాకృష్ణన్ శుక్రవారం ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసానికి వెళ్లారు. చంద్రబాబుతో ఆయన మర్యాద పూర్వకంగా సమావేశం అయ్యారు. ఇప్పటికీ పెండింగులోనే ఉన్న కొన్ని విభజన సమస్యలపై ఇరువురు చర్చించినట్లు సమాచారం. సుమారు రెండు గంటల పాటు ఏపీ సీఎం చంద్రబాబుతో తెలంగాణ గవర్నర్ భేటీ అయ్యారు. ఆ తర్వాత విజయవాడలోని ఇంద్రకీలాద్రి కనకదుర్మ అమ్మవారి దర్శనానికి గవర్నర్ రాధాకృష్ణన్ వెళ్లారు. ఆలయ మర్యాదలతో తెలంగాణ గవర్నర్ రాధాకృష్ణన్ కు అధికారులు, స్వాగతం పలకగా.. పూర్ణకుంభంతో ఆలయ వేద పండితులు స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం తెలంగాణ గవర్నర్‌కు వేదా ఆశీర్వచనం అందజేసి.. అమ్మవారి ప్రసాదం, శేష వస్త్రాన్ని ఈఓ కేఎస్ రామారావు అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ గవర్నర్ రాధాకృష్ణన్ మాట్లాడుతూ.. ఏపీ సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసాను అని పేర్కొన్నారు. తెలంగాణ, ఏపీ విభజన అంశాలపై చర్చ ఏమీ జరగలేదు అని తేల్చి చెప్పారు. చంద్రబాబు అభివృద్ధిపై అవగాహన ఉన్న వ్యక్తి.. ప్రత్యేకంగా ఎటువంటి అంశాలూ మా మధ్య చర్చకు రాలేదు.. విభజన అంశాలపై ఎటువంటి చర్చ జరగలేదు.. అమ్మవారి దర్శనం చాలా అద్భుతంగా జరిగింది.. అమ్మవారిని దర్శించుకుందామనే విజయవాడ వచ్చాను అని గవర్నర్ చెప్పారు.

# మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లికి షాక్

**• తాజాగా మరో కేసు నమోదు • దాడి చేశాడని కొమర శివ ఫిర్యాదు**



**విశ్వంభర, హైదరాబాద్ :** మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి మరో షాక్ తగిలింది. ఆయనపై తాజాగా మరో కేసు నమోదైంది. తెలుగు యువత పల్నాడు జిల్లా కార్యదర్శి కొమర శివపై దాడి చేసినందుకు ఆయనపై ఐపీసీ సెక్షన్ 323 కింద కేసు నమోదు చేశారు. అయితే బుధవారం రాత్రి పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని అరెస్టు చేసిన అనంతరం మాచర్ల కోర్టుకు తీసుకెళ్తున్న సమయంలో తనను కడుపులో పిడికిలితో బలంగా గుద్దినందుకు కొమర శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు చర్యలు తీసుకున్నారు. పోలింగ్ రోజు రెంటచింతల మండలం పాల్వాయి గేటు పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ధ్వంసం చేయడం, అడ్డుకోబోయిన టీడీపీ పోలింగ్ ఏజెంట్‌పై దాడి చేయడంతో పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై పల్నాడు జిల్లా పోలీసులు కేసు నమోదు చేశారు. పోలింగ్ మరుసటి రోజు కారంపూడిలో అరాచకం సృష్టించడం, అడ్డుకోబోయిన సీఐపై దాడి చేసి కేసుల్లో పిన్నెల్లితో పాటు ఆయన తమ్ముడు, అనుచరులపై కేసులు పెట్టారు. ఈ నాలుగింటిలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రధాన నిందితుడిగా ఉన్నారు. ఈవీఎంల ధ్వంసంతో పాటు ఎన్నికల రోజు దాడులకు పాల్పడటం, ఇతరత్రా నాలుగు కేసులపై బుధవారం రాత్రి విచారణ జరిపిన మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి.. రెండు కేసుల్లో బెయిల్ మంజూరు చేశారు. మరో రెండు కేసులకు సంబంధించి 14 రోజుల రిమాండ్ విధించారు. దీంతో పిన్నెల్లిని నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

# వారి లెక్క తేలాల్సిన అవసరముంది

**టీడీపీ అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాసరావు బాధ్యతలు**



**విశ్వంభర, విజయవాడ:** ఏపీ టీడీపీ అధ్యక్షుడిగా, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని పార్టీ కార్యాలయంలో ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కార్యకర్తలు ఏమీ ఆశించకుండా కార్యకర్తలు చాలా కష్టపడ్డారని పేర్కొన్నారు. గత పాలకులు అధికార దుర్వినియోగానికి పాల్పడిన వారికి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, వారి లెక్క తేలాల్సిన అవసరముందని వెల్లడించారు. రాజకీయ ప్రేరేపిత కేసులను టీడీపీ నాయకులు, కార్యకర్తలపై పెట్టిన కేసులను మూడు నెలలో తొలగిస్తామని అన్నారు. బాధ్యతగా పనిచేస్తానని, రాష్ట్ర అభివృద్ధికి, సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. ఎన్టీఆర్ ఆలోచనలనుకు ణంగా, నాయకుల ఆదేశాల మేరకు పార్టీ నాయకులు కృషి చేయాలని కోరారు. అధికారంలో ఉన్నామని ప్రజాస్వామానికి విఘాతం కలిగించే పనులు ఏవి చేయవద్దని సూచించారు. వైసీపీ పాలనలో ప్రతిపక్షాన్ని అణగదొక్కారని, దాడులకు పాల్పడ్డారని , వ్యక్తిగత హననానికి దిగి అవమానపరిచారని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని పట్టించుకోక పోవడం వల్లే వైసీపీని ప్రజలు ఇంటికి పంపించారని పల్లా శ్రీనివాసరావు విమర్శించారు.


# నేడు కొండగట్టుకు డిప్యూటీ సీఎం పవన్

**విశ్వంభర, విజయవాడ :** నేడు కొండగట్టుకు ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రానున్నారు. ఈ మేరకు షెడ్యూల్ ఖరారు అయింది. ఇవాళ కొండగట్టు అంజన్నను దర్శించుకోనున్నారు ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్. డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టాక తొలిసారి కొండగట్టుకు వస్తున్నారు. ఉదయం హైదరాబాద్ నుండి రోడ్డు మార్గంలో కొండగట్టుకు చేరుకోనున్నారు. తమ ఇలవేల్పు కొండగట్టు అంజన్నకు మొక్కులు చెల్లించిన అనంతరం తిరిగి హైదరాబాద్ వెళ్లనున్నారు పవన్ కళ్యాణ్. వారాహి వాహనానికి కొండగట్టులోనే పూజలు నిర్వహించిన పవన్ అనంతరం ప్రచారంకు వెళ్లిన విషయం తెలిసిందే. అదే విధంగా పవన్ కళ్యాణ్ పిఠాపురం పర్యటన ఖరారు అయ్యింది. జులై 1 నుంచి మూడు రోజుల పాటు సొంత నియోజకవర్గంలో ఆయన పర్యటించనున్నారు. అదే రోజు (జులై 1న) సాయంత్రం పిఠాపురంలో వారాహి సభ నిర్వహిస్తారు. తనను గెలిపించిన పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు ఈ సందర్భంగా పవన్ కృతజ్ఞతలు తెలపనున్నారు. 3 రోజులపాటు పిఠాపురంతోపాటు ఉమ్మడి తూ. గో. జిల్లాలో పలు అధికారిక కార్యక్రమాలలో పవన్ పాల్గొంటారని సమాచారం.

# 'మొత్తం ఏడు శ్వేతపత్రాలు'

## పోలవరంపై సీఎం చంద్రబాబు శ్వేతపత్రం విడుదల

- పోలవరం ధ్వంసం జాతికి విద్రోహం
- జగన్ శాపంలా మారాడు
- బడ్జెట్ కంటే ముందే శ్వేతపత్రాలు విడుదల
- అన్ని డాక్యుమెంట్లను వెబ్‌సైట్‌లో పెడుతాం
- రాష్ట్ర పునర్నిర్మాణం జరగాల్సి ఉంది
- చేతకాక పోతే వెళ్లి ఇంట్లో కూర్చోవాలి
- రాష్ట్ర విభజన కంటే.. జగన్ వల్లే ఎక్కువ నష్టమని ధ్వజం




**విశ్వంభర, అమరావతి :** పోలవరం ధ్వంసం జాతికి జరిగిన విద్రోహమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. శుక్రవారం పోలవరం ప్రాజెక్టుపై చంద్రబాబు శ్వేత పత్రం విడుదల చేశారు. పోలవరానికి శాపం జగన్ అంటూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశాక అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం. గత ఐదేళ్లు రాష్ట్రం ఏ విధంగా నష్టపోయిందో ప్రజల్లో చర్చ జరగాలి. రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని గుర్తించారు కాబట్టే ఇంత అఖండ విజయం అందించారు. మీడియాను కూడా భయపెట్టే పరిపాలన గత ఐదేళ్లలో జరిగిందని విమర్శించారు. న్యాయస్థానాలను సైతం బ్లాక్ మెయిల్ చేసేలా న్యాయమూర్తుల వ్యక్తిత్వాన్ని విమర్శించారు. రాష్ట్ర పునర్ నిర్మాణ జరగాల్సిన పరిస్థితి నెలకొంది. వివిధ అంశాలపై వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించాలని నిర్ణయించాం. రాష్ట్రానికి ఎంత నష్టం జరిగిందో వివరించాలని నిర్ణయించారు. ఎన్నికల్లో ప్రజలు గెలిచారు. ప్రజా సహకారంతో రాష్ట్రాన్ని నిలబెడతాం. ఇందులో భాగంగా బడ్జెట్ కంటే ముందే తొలుత 7 శ్వేతపత్రాలు విడుదల చేస్తున్నాం. రాష్ట్రంలో నదుల అనుసంధానానికి గుండెకాయ పోలవరం. అలాంటి పోలవరం పట్ల జాతి క్షమించరాని నేరానికి పాల్పడుతూ జగన్ ఓ శాపంలా మారాడు. వృధాగా సముద్రంలో కలిసే 3 వేల టీఎంసీల నీటిని ఒడిసి పట్టుకుని కరువు రహిత రాష్ట్రంగా మార్చే ప్రాజెక్టు ఇది. అలాంటి ప్రాజెక్ట్ జగన్ చేసిన విధ్వంసానికి గురైంది. 1941 నుంచి తెలుగు ప్రజల కలగా పోలవరం ఉంది. 90 మీటర్ల కిందవరకూ దయాఫ్రమ్ వాల్ అత్యాధునిక సాంకేతికతతో పూర్తి చేశాం. పోలవరం అంత భారీ ప్రాజెక్టు దేశంలో ఇక ఉండదేమో? 2014లో తెలంగాణలో 7 ముంపు మండలాలు నేను ప్రమాణ స్వీకారం చేయకముందే ఏపీలో విలీనం జరిగేలా కృషి చేశా. 31 సార్లు క్షేత్రస్థాయి పర్యటనలు, 104 సమీక్షలతో పోలవరం ప్రాజెక్టును పరుగులెత్తించి 72 శాతం పూర్తి చేశామని చెప్పారు.

### జగన్ మూర్ఖత్వం వల్లే..

దయాఫ్రమ్ వాల్‌ను రూ.436 కోట్లతో పూర్తి చేస్తే.. ఇప్పుడు మరమ్మతులకు రూ.447 కోట్లు అవుతుందన్నారు. 'ఇంత ఖర్చు చేసినా నష్టం పూర్తిగా భర్తీ అవుతుందని చెప్పలేం. కొత్త దయాఫ్రమ్ వాల్ కట్టాలంటే ఇప్పుడు రూ.990 కోట్లు అదనంగా ఖర్చవుతుంది. ఇందుకు 2 నుంచి 4 సీజన్ల సమయం కూడా వృధా అవుతుంది. జగన్ మూర్ఖత్వం వల్లే దయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. 2019 జూన్ నుంచి ఏజెన్సీలు తొలగించి పోలవరం పనులు నిలుపుదల చేశారు. దయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్న విషయం రెండేళ్ల తర్వాత కానీ గుర్తించలేదు. 2009 లో కూడా వైఎస్ కాంట్రాక్టర్‌ను మార్చటం వల్ల హెడ్ వర్క్స్ నిలిచిపోయాయి. అదే తప్పు జగన్ 2019లో చేసి తీవ్ర తప్పిదానికి పాల్పడ్డారు. జగన్ ప్రభుత్వ తప్పిదాలపై 2019 ఆగస్టు 16న జలవనరుల కార్యదర్శి పీపీఏకి లేఖ కూడా రాశారు. పోలవరం పట్ల జగన్ ప్రభుత్వ తప్పిదాలపై నీతి ఆయోగ్ ఐఐటీ హైదరాబాద్‌తో ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ 2021 నవంబర్ 5న స్పష్టమైన నివేదిక ఇచ్చిందని' అన్నారు.

### పోలవరాన్ని గోదాట్లో ముంచేశారు

పిచ్చి కుక్క, పిచ్చి కుక్క అని పదే పదే చెబుతూ మంచి కుక్కని చంపేసిన మాదిరి జగన్ పోలవరం పట్ల వ్యవహ రించారని సీఎం చంద్రబాబు ఎద్దేవా చేశారు. ప్రాజెక్ట్‌ను సర్వనాశనం చేసేందుకు జగన్ అహంతో చేసిన దుస్సాహసమే పోలవరం వినాశనమని, జగన్ ప్రభుత్వ నిర్వాకం వల్ల పోలవరం ప్రాజెక్టుకు 4 విధాల నష్టం జరిగిందని వాపోయారు. మొదటిది దయాఫ్రమ్ వాల్ అయితే అప్పర్, లోయర్ కాపర్ డ్యాంలు దెబ్బతిన్నాయని, గైడ్ బండ్ దెబ్బతినడంతో పాటు విద్యుత్ ప్రాజెక్టు నిర్మా ణమూ ఆగిపోయిందన్నారు. మొత్తంగా పొలవరాన్ని గో దాట్లో ముంచేశారన్నారు. ఇప్పుడు కేంద్రం అంతర్జాతీయ నిపుణులతో కమిటీ వేసి నిరంతర అధ్యయనం పెట్టిందని, ఇక్కడ ఉండే సెంట్రల్ వాటర్ కమిషన్ చేతులు ఎత్తేయ టంతో అంతర్జాతీయ నిపుణుల నివేదిక ఆధారంగా ఇప్పు డు నిర్ణయం తీసుకోవాలి. నిర్ణీత సమయానికి పోలవరం పూర్తి చేయకపోవడం వల్ల వేలాది కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందన్నారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో పోలవరం నష్టం చూస్తుంటే బాధ, కోపం, ఆవేశం కలుగుతున్నాయని సీఎం చంద్రబాబు నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు.

# వైసీపీ ఎంపీలను మా పార్టీలో చేర్చుకోం

**• అలాంటి ఆలోచన కూడా లేదు • బీజేపీ నేత సోము వీర్రాజు కీలక వ్యాఖ్యలు**



**విశ్వంభర, విజయవాడ:** వైసీపీ ఎంపీలు బీజేపీలోకి చేరతారనే ప్రచారంపై ఏపీ బీజేపీ మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు కీలక వ్యాఖ్యలు చేశారు. వైసీపీ ఎంపీలను బీజేపీలోకి చేర్చుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. వైసీపీ ఎంపీలు, కడప లోక్ సభ సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి, రాజంపేట ఎంపీలు మిథున్ రెడ్డిలు.. బీజేపీలో చేరతారనే ప్రతిపాదన ఏదీ లేదని సోము వీర్రాజు తెలిపారు. అలాంటి ఆలోచన కూడా లేదని, వైసీపీ ఎంపీలను చేర్చుకునేది లేదని స్పష్టం చేశారు. మరోవైపు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లపై వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలను సోము వీర్రాజు తప్పుబట్టారు. ఈవీఎంలపై అనుమానాలు ఉన్నాయంటూ వైసీపీ నేతలు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్న ఆయన.. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని సోము వీర్రాజు తెలిపారు. ఏపీకి నిధులు, ప్రాజెక్టులు వచ్చేలా బాధ్యతగా వ్యవహరిస్తుందని సోము వీర్రాజు చెప్పారు. సోము వీర్రాజు విషయానికి వస్తే.. ప్రస్తుత ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి కన్నాముందు ఏపీ బీజేపీ చీఫ్‌గా వ్యవహరించారు. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి బీజేపీకి టచ్‌లో ఉన్నారని మొదటగా జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మిథున్ రెడ్డి స్వయంగా కేంద్ర నాయకత్వంతో మాట్లాడుతున్నారని తెలిపారు. బీజేపీ ఒప్పుకుంటే అవినాశ్ రెడ్డి మినహా వైసీపీ ఎంపీలంతా పార్టీ మారడానికి రెడీగా ఉన్నారని బాంబు పేల్చారు. అయితే బీజేపీ నాయకత్వం వారిని అక్కర్లేదని చెప్పిందని, అయినప్పటికీ మిథున్ రెడ్డి ఇంకా లాబీయింగ్ నడిపిస్తున్నారని చెప్పారు. ఆదినారాయణ రెడ్డి వ్యాఖ్యల తర్వాతే వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి బీజేపీలో చేరబోతున్నట్లుగా ప్రచారం జోరందుకుంది.

# ఏయూ వీసీ, రిజిస్ట్రార్ రాజీనామా



**విశ్వంభర, అమరావతి:** ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ స్టీఫెన్‌సన్ తమ పదవులకు రాజీనామా చేశారు. గత ఐదేండ్లలో యూనివర్సిటీని వీసీ, రిజిస్ట్రార్ భ్రష్టు పట్టించారని విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ.కిశోర్‌బాబుకు బాధ్యతలు అప్పగించారు. వీసీ ప్రసాదరెడ్డి యూనివర్సిటీ వైసీపీ కార్యాలయంగా మార్చేశారని టీడీపీ, జనసేన నేతలు కొద్దిరోజులుగా విమర్శిస్తున్నారు. అలాగే వైసీపీ గెలుపు కోసం పరిశోధకులను ఉపయోగించుకున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ క్రమంలోనే ఏపీలో ప్రభుత్వం మారినప్పటికీ ఇంకా ఆంధ్రా యూనివర్సిటీలోని వీసీ కార్యాలయంలో ఇప్పటి వరకు సీఎం చంద్రబాబు ఫొటోను పెట్టలేదు. మాజీ సీఎం వైఎస్ జగన్ ఫొటోనే ఇంకా కార్యాలయంలో ఉంచారు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాలు గురువారం ఆందోళనకు దిగాయి. టీఎన్‌ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్ గోపాల్ ఆధ్వర్యంలో వీసీ కార్యాలయం ఎదుట నిరసనలు చేపట్టారు. వీసీ చాంబర్‌లో తక్షణమే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫొటోలు ఏర్పాటు చేయాలని, ప్రసాదరెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పైగా రాజీనామా చేయాలని ప్రసాదరెడ్డికి కొద్దిరోజులుగా బెదిరింపు కాల్స్ కూడా వస్తున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే వీసీ పదవికి ప్రసాదరెడ్డి రాజీనామా చేయడం ఆసక్తికరంగా మారింది.



# ఉడుత బెదిరింపులకు భయపడం

- ప్రజల్లో వైసీపీకి ఆదరణ తగ్గలేదు
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి

**విశ్వంభర, నెల్లూరు:** వైసీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం నెల్లూరు జిల్లాలోని పొదలకూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. మే నెలలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు టీడీపీని అధికారంలోకి తీసుకువచ్చారన్నారు. అనుభవమున్న.. చంద్రబాబుగా పరిపాలన చేస్తారని ప్రజలు ఎన్నుకున్నారు.. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వైసీపీ నేతల ఆస్తులు ధ్వంసం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు అని ఆయన మండిపడ్డారు. వైసీపీకి 40 శాతం ఓట్లు వచ్చాయి.. మూడు పార్టీలు కూటమిగా ఏర్పడితే వచ్చిన ఓట్లు 60 శాతం.. మా ప్రభుత్వ హాయంలో జరిగిన లోపాలను గుర్తించి సమీక్షించుకుంటామన్నారు.. నేతలతో కలిసి కార్యాచరణ రూపొందించి ముందుకు వెళ్తామని కాకాణి గోవర్ధన్ రెడ్డి తెలిపారు. టీడీపీ చోటా నాయకుల ఉడత బెదిరింపులకు భయపడాల్సిన అవసరం లేదు అని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తెలిపారు. ప్రజల్లో వైసీపీకి ఆదరణ తగ్గలేదు.. గత ప్రభుత్వ హయాంలో అవినీతి జరిగిందని.. సీబీఐ విచారణ వేస్తామని అంటున్నారు.. ఎవరి చేత విచారణ చేయించినా ఎలాంటి భయం లేదన్నారు. ఇక, జగన్ కు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వడం అనేది సమాజం.. ప్రతి పక్షం లేకుంటే ప్రభుత్వం నిర్వీర్యం అవుతుంది అని ఆయన చెప్పుకొచ్చారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఎన్నో హామీలు ఇచ్చి ఓట్లను వేయించుకున్నారు.. ఇప్పుడు పింఛను తప్ప మరే పథకం గురించి మాట్లాడడం లేదు.. నాకు పదవి ఉన్నా.. లేకున్నా సర్వేపల్లి నియోజకవర్గ ఇంటి బిడ్డనే.. అధికారం ఉన్నపుడు ప్రజలకు న్యాయం చేసాం.. ఇప్పుడు ప్రజలకు అన్యాయం జరగనియ్యకుండా అడ్డుకుంటానని కాకాణి గోవర్ధన్ రెడ్డి చెప్పారు.

# సిల్లీగా మాట్లాడటం మానేయండి



## సాకులు చెప్పడానికి బుద్ధుండాలి

## ఇంగ్లాండ్ మాజీ ప్లేయర్లకు భజ్జీ కౌంటర్

**విశ్వంభర, స్పోర్ట్స్:** సెమీఫైనల్‌లో భారత్ చేతిలో తమ జట్టు ఓటమిపాలవ్వడాన్ని ఇంగ్లండ్ మాజీలు జీర్ణించుకోలేకపోతున్నారు. సెమీస్ జరిగిన వేదిక టీమిండియాకు అనుకూలంగా ఉందని, అందుకే తమ జట్టుపై పైచేయి సాధించిందని అంటున్నారు. అయితే ఈ వ్యాఖ్యలపై భారత మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ తీవ్రంగా మండిపడ్డాడు. ఇరు జట్లు ఒకే వేదికపై ఆడాయని, కాస్త బుర్రతో ఆలోచించి మాట్లాడాలని ధ్వజమెత్తాడు. గయానా వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన సెమీ ఫైనల్‌లో భారత్ 68 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 171 పరుగులు చేసింది. కెప్టెన్ రోహిత్ శర్మ (57బీ 39 బంతుల్లో, 6 ఫోర్లు, 2 సిక్సర్లు), సూర్యకుమార్ యాదవ్ (47బీ 36 బంతుల్లో, 4 ఫోర్లు, 2 సిక్సర్లు) సత్తాచాటారు. మ్యాచ్ అనంతరం ఇంగ్లండ్ మాజీ క్రికెటర్లు నాజర్ హుస్సేన్, మైకేల్ వాన్ భారత విజయం గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ ఫైనల్‌కు చేరేలా పిచ్, వేదిక ప్రతీది కలిసొచ్చిందని హుస్సేన్ అన్నాడు. మరోవైపు మైకేల్ వాన్ ఎప్పటిలానే వివాదాస్పద ట్వీట్ చేశాడు. 'సూపర్-8లో సౌతాఫ్రికాపై విజయం సాధించి ఉంటే ట్రినిడాడ్ వేదికగా ఇంగ్లండ్ సెమీఫైనల్ ఆడేది. అప్పుడు అఫ్గానిస్థాన్‌పై తప్పక గెలిచేది. కాబట్టి దాని గురించి ఎలాంటి ఫిర్యాదులు లేవు. అయితే గయానా వేదిక మాత్రం భారత్‌కు కలిసొచ్చేలా చక్కని ఎంపిక' అని వాన్ భారత్‌పై అక్కసుతో ట్వీట్ చేశాడు. ఈ వ్యాఖ్యలకు హర్భజన్ సింగ్ స్పందిస్తూ.. భారత్‌కు గయానా మంచి వేదిక అని మీరెలా అనుకుంటున్నారు? ఇరు జట్లు ఒకే వేదికపై ఆడాయి. అంతేగాక ఇంగ్లండ్ టాస్ గెలిచి అదనపు ప్రయోజనం పొందింది. సిల్లీగా మాట్లాడటం మానేయండి. అన్ని విభాగాల్లో ఇంగ్లండ్‌పై టీమిండియా గొప్ప ప్రదర్శన చేసింది. వాస్తవాన్ని అంగీకరించి, ముందుకు వెళ్లండి. ఈ చెత్త మాటలు మీ దగ్గరే ఉంచుకోండి. నాన్సెన్ కాదు, లాజిక్‌తో మాట్లాడండి' అని హర్భజన్ ట్వీట్ చేశాడు.

# న్యూ లుక్‌లో 'మిస్టర్ కూల్'

## హీరోలా ఉన్నావంటూ అభిమానుల కామెంట్స్



**విశ్వంభర, స్పోర్ట్స్:** భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అంతర్జాతీయ క్రికెట్ నుంచి వైదొలిగి నాలుగేళ్లు అవుతున్నప్పటికీ ఎంఎస్‌డీ ఫ్యాన్ ఫాలోయింగ్ మాత్రం తగ్గలేదు. ఇంకా చెప్పాలంటే అంతకంతకూ పెరుగుతూ వస్తోంది. ఇందుకు ఇటీవల జరిగిన ఐపీఎల్ మ్యాచులే నిదర్శనం. తలా బ్యాటింగ్‌కు వచ్చిన ప్రతిసారి అతడి నామస్మరణతోనే స్టేడియాలు దద్దరిల్లిపోయాయి. మహేంద్రుడు క్రికెట్‌తో పాటు ఫ్యాషన్‌ను కూడా బాగా ఫాలో అవుతుంటాడనే విషయం తెలిసిందే. అందుకే అతడు తరచూ ట్రెండీ లుక్స్‌లో దర్శనమిస్తుంటాడు. దీనిలో భాగంగా తరచుగా తన హెయిర్ స్టైల్ ను మారుస్తూ ఉంటాడు. ఇటీవల ముగిసిన ఐపీఎల్ 17వ సీజన్‌లో లాంగ్ హెయిర్‌తో మహీ వింటేజ్ లుక్‌లో కనిపించాడు. ఇటీవలే ఓ యాడ్ షూట్ కోసం ధోనీ లాంగ్ హెయిర్ పెంచుకున్న విషయం కూడా బయట పడింది. అప్పుడు తన హెయిర్ స్టైల్స్ వల్ల కలిగే ఇబ్బందుల గురించి మిస్టర్ కూల్ ఓ ఇంటర్వ్యూలో వివరించారు. 'ఫ్యాన్స్ ఇష్టపడుతున్నారని లాంగ్ హెయిర్ పెంచుకుంటున్నా. అయితే యాడ్స్ షూటింగ్ కోసం రెడీ అవ్వడానికి లాంగ్ హెయిర్ వల్ల ఆలస్యం అవుతోంది. గతం లో 20 నిమిషాల్లో మేకప్ పూర్తి అయ్యేది. కానీ ఇప్పుడు రెడీ అవ్వడానికి గంట అయిదు నిమిషాల నుంచి గంట పది నిమిషాల వరకు సమయం పడుతోంది. మేకప్ కోసం అంతసేపు కుర్చీలో కూర్చొని ఉండటం బోరింగ్‌గా అనిపిస్తోంది. కానీ నా ఫ్యాన్స్ అందరూ హెయిర్ స్టైల్ బాగుందని చెబుతున్నారు. ఇంత హెయిర్ మెయిన్‌టెయిన్ చేయడం అంత ఈజీ కాదు. ఫ్యాన్స్ కోసం మరి కొంతకాలం ఇలానే ఉంచడానికి ప్రయత్నిస్తా. ఏదో ఒక మంచి రోజు చూసి కట్ చేస్తా' అంటూ చెప్పుకొచ్చారు.

# చరిత్ర సృష్టించిన టీమిండియా ఓపెనర్!




**విశ్వంభర, స్పోర్ట్స్:** టీమిండియా మహిళా ఓపెనర్ షెఫాలీ వర్మ చరిత్ర సృష్టించింది. మహిళల టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే అత్యంత వేగంగా డబుల్ సెంచరీ నమోదు చేసిన బ్యాటర్‌గా రికార్డుకెక్కింది. సౌతాఫ్రికాతో చెన్నై వేదికగా శుక్రవారం మొదలైన ఏకైక టెస్ట్‌లో షెఫాలీ వర్మ విధ్వంసకర బ్యాటింగ్‌తో డబుల్ సెంచరీ సాధించింది. 197 బంతుల్లో 23 ఫోర్లు, 8 సిక్స్‌లతో 205 పరుగులు చేసి పలు రికార్డులను తన పేరిట లిఖించుకుంది. వన్డే తరహా బ్యాటింగ్‌తో 194 బంతుల్లోనే డబుల్ సెంచరీ నమోదు చేసిన షెఫాలీ వర్మ.. ఆస్ట్రేలియా బ్యాటర్ అన్నబెల్ సదర్లాండ్ పేరిట ఉన్న ఫాస్టెస్ట్ డబుల్ సెంచరీ రికార్డ్‌ను అధిగమించింది. ఈ ఏడాది ప్రారంభంలో సౌతాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో సదర్లాండ్ 248 బంతుల్లో డబుల్ సెంచరీ సాధించింది. ఇప్పటి వరకు ఇదే ఫాస్టెస్ట్ డబుల్ సెంచరీగా కొనసాగగా.. షెఫాలీ వర్మ ఆ రికార్డును తిరగరాసింది. అంతేకాకుండా భారత్ తరఫున డబుల్ సెంచరీ నమోదు చేసిన రెండో మహిళా బ్యాటర్‌గా కూడా షెఫాల్మీ వర్మ రికార్డు నమోదు చేసింది. అప్పుడెప్పుడో షెఫాలీ వర్మ పుట్టకముందు 22 ఏళ్ల క్రితం టీమిండియా మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్.. ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 407 బంతుల్లో 214 పరుగులతో డబుల్ సెంచరీ సాధించింది. మళ్లీ రెండు దశాబ్దాల తర్వాత 20 ఏళ్ల షెఫాలీ వర్మ భారత్ తరఫున మరో డబుల్ సెంచరీ నమోదు చేసింది.

### తొలిరోజు భారత జట్టు జోరు

షెఫాలీ వర్మ డబుల్ సెంచరీకి తోడుగా స్మృతి మంధాన(161 బంతుల్లో 27 ఫోర్లు, సిక్స్‌తో 149) శతక్కొట్టడంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 98 ఓవర్లలో 4 వికెట్లకు 525 పరుగులు చేసింది. దాంతో తొలి రోజే 500 పరుగులు చేసిన జట్టుగా భారత్ అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. క్రీజులో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(42 బ్యాటింగ్), రిచా ఘోష్(43 బ్యాటింగ్) ఉన్నారు.తొలి వికెట్‌కు షెఫాలీ వర్మ, స్మృతి మంధాన(149) 292 పరుగుల రికార్డ్ భాగస్వామ్యాన్ని నెలకొల్పింది.




# ఏటీఎమ్ కార్డు ఉందా.?

## అయితే మీకు రూ.10లక్షల బీమా ఉన్నట్లే..

**విశ్వంభర, బిజినెస్ :** ప్రస్తుతం బ్యాంక్ ఖాతా లేని వారు లేరని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రభుత్వ పథకాలు మొదలు అన్నింటికీ బ్యాంకు ఖాతా అనివార్యంగా మారింది. దీంతో సహజంగానే ఏటీఎమ్‌ల వినియోగం కూడా పెరిగింది. వీటిలో డెబిట్ కార్డులు, క్రెడిట్ కార్డులు ఉంటాయని తెలిసిందే. అయితే మనం ఉపయోగించే ఏటీఎమ్ కార్డులపై బీమా ఉంటుందని మీలో ఎంత మందికి తెలుసు. అవును కార్డుల ఆధారంగా ఏకంగా రూ.10లక్షల వరకు కూడా బీమా అందిస్తారు. ఇంతకీ ఏ కార్డులపై ఎంత బీమా వర్తిస్తుంది.? వీటిని ఎలా క్లైమ్ చేసుకుంటారో ఇప్పుడు తెలుసుకుందాం.. ఎస్‌బీఐ గోల్డ్ మాస్టర్ కార్డ్ లేదా వీసా కార్డ్ కలిగి ఉన్న వారికి రూ.4లక్షల ఎయిర్ డెత్ (విమాన ప్రమాదాల్లో మరణిస్తే), రూ.2లక్షల నాన్ ఎయిర్ ఇన్సూరెన్స్ కవర్ అవుతుంది. ఇక ప్రీమియం కార్డ్ హోల్డర్స్‌కు రూ.10లక్షల ఎయిర్ డెత్, రూ.5లక్షల నాన్ ఎయిర్ కవర్ లభిస్తుంది. కాగా సాధారణ మాస్టర్‌కార్డ్‌పై రూ. 50 వేలు, ప్లాటినం మాస్టర్‌కార్డ్‌పై రూ. 5 లక్షల రూపాయలు, వీసా కార్డుపై రూ.2లక్షల వరకు బీమా సౌకర్యం కల్పిస్తారు. అలాగే ప్రధాన మంత్రి జనధన్ యోజన కింద ఓపెన్ చేసిన వారికి రూ.1 నుంచి రూ.2లక్షల వరకు ఇన్సూరెన్స్ లభిస్తుంది. అయితే ప్రమాదం జరిగిన తేదీ నుంచి 90 రోజుల ముందు ఏటీఎమ్ కార్డుతో ఏదైనా లావాదేవీ చేస్తేనే బీమా క్లెయిమ్ చేసుకోవడానికి అర్హులు. ప్రమాదం జరిగితే, క్లెయిమ్ చేయడానికి ఆసుపత్రి బిల్లు, చెల్లుబాటు అయ్యే సర్టిఫికేట్, పోలీసుల ఎఫ్ఐఆర్ కావాల్సి ఉంటుంది. ఏటీఎమ్ ఉన్న వ్యక్తి ప్రమాదంలో మరణిస్తే నామినీ డెత్ సర్టిఫికేట్‌ను అందించాల్సి ఉంటుంది.క్లెయిమ్‌ను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో అప్లై చేసుకోవచ్చు. ఆఫ్‌లైన్ విధానంలో అప్లై చేసుకునే వారు బ్యాంకుకు వెళ్లి ఫామ్‌ను ఫిల్ చేయాల్సి ఉంటుంది. క్లెయిమ్ చేయగానే బ్యాంకు ఒక అధికారికి నియమిస్తుంది. అనంతరం అధికారులు దర్యాప్తు చేస్తారు. వెరిఫికేషన్ తర్వాత తుది నివేదికను సిద్ధం చేస్తారు. ఆ తర్వాత, క్లెయిమ్ మొత్తం 10 రోజుల వ్యవధిలో అందిస్తారు. ప్రమాదం జరిగిన 60 రోజుల్లోపు క్లెయిమ్ చేసుకుంటే బీమా మొత్తం పొందొచ్చు లేదంటే క్లెయిమ్‌ను తిరస్కరించే అవకాశాలు ఉన్నాయి.

# ఈ రైల్వే స్టాక్ హాట్ కేక్..

### ఏకంగా 27శాతం వడ్డీతో టాక్ ఆఫ్ ది మార్కెట్..

**విశ్వంభర, బిజినెస్ :** ప్రస్తుతం మార్కెట్లో అత్యధిక రాబడినిచ్చే మార్గాలు ఏమైనా ఉన్నాయంటే అది షేర్, స్టాక్ మార్కెట్లని కచ్చితంగా చెప్పొచ్చు. అయితే వాటిల్లో ఎంత రాబడి ఉంటుందో.. అంతే స్థాయిలో రిస్క్ కూడా ఉంటుంది. పరిస్థితులు వేగంగా మారిపోతుంటాయి. మార్కెట్ ఎప్పుడు ఎలా స్పందిస్తుందో అంచనా వేయడం, అర్థం చేసుకోవడం అంత సులభమైంది ఏమి కాదు. అయితే దానిపైనే ఉండే కొంతమంది నిపుణులు మాత్రం ఏ స్టాక్ పుంజుకుంటుంది? ఏ స్టాక్ లో పెట్టుబడులు పెడితే దీర్ఘకాలంలో మంచి లాభాలు వస్తాయన్న అంశాలను లెక్కించి సూచనలు చేస్తుంటారు. అలాగే ప్రస్తుతం భారతీయ రైల్వేకు ఫైనాన్సింగ్ చేసే ఓ కంపెనీకి ఓ మల్టీ బ్యాగర్ స్టాక్ గురించి అంతా చర్చించుకుంటున్నారు. ఇది దీర్ఘకాలం సస్టైన్ అయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. ఆ స్టాక్ ఏంటి? దాని పరిస్థితి ఏంటి? తెలుసుకుందాం రండి..

### రైల్వే పీఎస్‌యూ స్టాక్ ఐఆర్‌ఎఫ్‌సీ..

రైల్వే పీఎస్‌యూ స్టాక్ ఐఆర్‌ఎఫ్‌సీని దీర్ఘకాలానికి కొనుగోలు



చేయాలని నిపుణులు సలహా ఇస్తున్నారు. రైల్వేల నుంచి కంపెనీలకు భారీగా ఆర్డర్లు వస్తున్నాయని.. రైల్వే కంపెనీల నిధుల అవసరాలను ఈ ఐఆర్‌ఎఫ్సీ తీరుస్తుందని వివరిస్తున్నారు. ఇది చాల పెద్ద సంస్థని, దేశ వ్యాప్తంగా చేపట్టే రైల్వే ప్రాజెక్టులకు ఫైనాన్సింగ్ చేయడంలో ఈ సంస్థ ప్రత్యేకత కలిగి ఉందని చెబుతున్నారు..ఈ కంపెనీ ఎన్‌సీఏ పూర్తిగా శూన్యం. ఇటీవల ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌తో ఎంఓయూ కుదుర్చుకుంది. ఇది కూడా పెద్ద సానుకూలాంశం. కంపెనీకి బలమైన ఫండమెంటల్స్ ఉన్నాయి. కంపెనీ భవిష్యత్తులో వృద్ధికి మంచి అవకాశం ఉంది. కొనుగోలు స్టాక్‌లో 9 నుంచి 12 నెలల వరకూ పెట్టుబడులు పెట్టొచ్చు. దీనిలో 27 శాతం కంటే ఎక్కువ రాబడులు ఊహించవచ్చని చెబుతున్నారు.

### మార్కెట్లో జోష్..

మార్కెట్ అస్థిరత కారణంగా భారతీయ ఈక్విటీ బెంచ్‌మార్క్‌లు భారీగా ముగిశాయి. సెన్సెక్స్ 131 పాయింట్లు లేదా 0.17 శాతం పెరిగి 77,341 వద్ద, నిఫ్టీ 36 పాయింట్లు లేదా 0.18 శాతం పెరిగి 23,537 వద్ద ముగిశాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 147 పాయింట్లు (0.27 శాతం) పెరిగి 55,577 వద్దకు చేరుకుంది. అయితే, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 18 పాయింట్లు (0.10 శాతం) పడిపోయి 18,217 వద్దకు చేరుకుంది. సెక్టోరల్ ఇండెక్స్‌లలో ఎఫ్ఎంసీజీ, ఆటో, ఫైనాన్షియల్ సర్వీసెస్, కన్స్యూమర్ ఇండెక్స్‌లు అత్యధికంగా లాభపడ్డాయి. పీఎస్ యూ బ్యాంక్, మెటల్, మీడియా, హెల్త్‌కేర్ ఇండెక్స్‌లు వెనుకబడి ఉన్నాయి.

# రిలయన్స్ సరికొత్త రికార్డు..

## దేశంలోనే తొలి కంపెనీగా ఘనత.




**విశ్వంభర, బిజినెస్ :** స్టాక్ మార్కెట్ సూచీలు ఎప్పుడు ఎలా కదలాడతాయో ముందుగానే ఊహించడం కాస్త కష్టమేనని చెప్పొచ్చు. ఎన్నో అంశాలు దీనిని ప్రభావితం చేస్తుంటాయి. ఇంకా రిలయన్స్ ఇండస్ట్రీస్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ వంటి హెవీ వెయిట్ షేర్లు స్టాక్ మార్కెట్ కదలికలపై తీవ్ర ప్రభావం చూపుతుంటాయి. కొద్దిరోజులుగా మార్కెట్ విపరీతంగా పుంజుకుంటున్నప్పటికీ ఇదే సమయంలో దేశంలో మార్కెట్ విలువ అన్నింటికంటే ఎక్కువగా ఉన్న దిగ్గజ వ్యాపారవేత్త ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ స్టాక్ పెద్దగా రాణించింది లేదు. అయితే ఇప్పుడు మాత్రం పరిస్థితి మారిపోయింది. సడెన్‌గా విపరీతంగా పుంజుకుంటోంది. ఇదే సమయంలో కొత్త కొత్త రికార్డుల్ని సృష్టిస్తోంది. వరుసగా నాలుగో సెషన్‌లో కూడా ఇప్పుడు రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు ముందుకు దూసుకెళ్లింది. ఈ క్రమంలో 4 రోజుల్లోనే దాదాపు 10 శాతం పెరగడం విశేషం. ఇదే క్రమంలో ఈ స్టాక్ 52 వారాల గరిష్టాన్ని నమోదు చేసింది. శుక్రవారం సెషన్‌లో దాదాపు 3 శాతం లాభంతో ఇంట్రాడేలో రూ. 3162 వద్ద ఆల్ టైమ్ గరిష్టాన్ని తాకింది. ఈ క్రమంలోనే ఈ షేర్లను కొనుగోలు చేసిన ఇన్వెస్టర్లకు అదిరిపోయే ప్రాఫిట్స్ దక్కుతున్నాయని చెప్పొచ్చు. మరోవైపు ఇదే సమయంలో మరో సరికొత్త రికార్డును కూడా సృష్టించడం విశేషం.

### రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ క్యాప్..

రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ రూ. 21 లక్షల కోట్ల మార్కును దాటేసింది. ప్రస్తుతం రూ. 21.30 లక్షల కోట్లుగా ఉంది. అయితే దేశంలోనే మార్కెట్ విలువలో ఈ మైలురాయిని అధిగమించిన భారత తొలి కంపెనీగా నిలిచింది. మరే కంపెనీ కూడా కనీసం రూ.20లక్షల కోట్ల మార్కును కూడా తాకలేదు. దీంతో దేశంలో మార్కెట్ విలువ పరంగా అతిపెద్ద కంపెనీగానే కొనసాగుతోంది రిలయన్స్ సంస్థ. ఈ ఏడాది రిలయన్స్ ఇండస్ట్రీస్ స్టాక్.. బెంచ్‌మార్క్ ఇండెక్స్‌ను దాటి మంచి ప్రదర్శన చేస్తోంది. మంచి లాభాలు సాధించింది. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు సెన్సెక్స్ 10 శాతం పెరిగితే.. ఇదే క్రమంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ స్టాక్ మాత్రం 21 శాతం పెరిగింది. గతేడాది కూడా రిలయన్స్ షేరు 36 శాతం పెరగ్గా.. ఈ క్రమంలో బెంచ్‌మార్క్ సెన్సెక్స్ 25 శాతం మాత్రమే పెరిగింది.

### జియో టారిఫ్స్ పెంపు..

ఇవాళ రిలయన్స్ ఇండస్ట్రీస్ స్టాక్ పుంజుకునేందుకు ప్రధాన కారణం జియో టారిఫ్స్ పెంపు అని తెలుస్తోంది. రిలయన్స్ జియో.. తమ రీఛార్జి ప్లాన్లను పెంచుతున్నట్లు ప్రకటించింది. గరిష్టంగా 25 శాతం వరకు రేట్లు పెరగడం గమనార్హం. ఇది జులై 3 నుంచి అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. దీంతోనే రిలయన్స్ స్టాక్ దూసుకెళ్తోంది. అయితే స్టాక్ మార్కెట్ సూచీలు మాత్రం ఒడుదొడుకుల్లో కొనసాగుతున్నాయి.

# ఆ సమయంలో చాలా భయపడ్డా..

ఊహలు గుసగుసలాడే సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది అందాల తార **రాశీఖన్నా**. తొలి సినిమాలోనే తనదైన నటనతో ప్రేక్షకులను మెస్మరైజ్ చేసిందీ చిన్నది. క్యూట్ యాక్టింగ్‌తో ప్రేక్షకులను కట్టిపడేసింది. తొలి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకున్న రాశీఖన్నాకు అనంతరం వరుస ఆఫర్లు క్యూ కట్టాయి. టాలీవుడ్ టాప్ యంగ్ హీరోల సరసన నటించే అవకాశం కొట్టేసింది. ఆ తర్వాత తెలుగుతో పాటు మలయాళం, హిందీ సినిమాల్లోనూ నటించి మెప్పించింది. కాగా తాజాగా ఊహలు గుసగుసలాడే సినిమా విడుదలై 10 ఏళ్లు గడిచాయి. ఈ సందర్భంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో రాశీఖన్నా పలు ఆసక్తికర విషయాలు పంచుకుంది. టాలీవుడ్‌లో 10 ఏళ్లు పూర్తి చేసుకోవడం ఈ బ్యూటీ ఆనందాన్ని వ్యక్తి చేసింది. తెలుగులో పదేళ్లు పూర్తి చేసుకున్నానంటే నమ్మలేకపోతున్నాని చెప్పుకొచ్చింది. తొలి సినిమా సమయంలో తనకు తెలుగు భాష రాదని, ఇక్కడి సంస్కృతి తెలియదని కానీ అభిమానులు వారి ఇంటి మనిషిలా సొంతం చేసుకున్నారని తెలిపింది.






# రేవ్ పార్టీ ఇష్యూపై స్పందించిన హేమ

క్యారెక్టర్ ఆర్టిస్ట్ హేమ ఇటీవల బెంగుళూరు రేవ్ పార్టీలో పాల్గొని వివాదంలో నిలిచిన సంగతి తెలిసిందే. రేవ్ పార్టీలో పాల్గొన్నా పాల్గొనలేదని చెప్పడం, బెంగుళూరు పోలీసులు హేమ పాల్గొంది అని చెప్పడం, హేమ డ్రగ్స్ తీసుకున్నట్టు పరీక్షల్లో పాజిటివ్ వచ్చిందని పోలీసులు చెప్పడం, విచారణకు పిలవడం.. ఇలా కొన్ని రోజుల పాటు హేమ వైరల్ అయింది. అయితే ఆ వివాదం తర్వాత హేమ మీడియా ముందుకు రాలేదు. తాజాగా హేమ శుక్రవారం ఉదయం తిరుమలలో వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంది. దీంతో తిరుమల నుంచి హేమ వీడియోలు వైరల్ గా మారాయి. పలువురు జనాలు హేమతో సెల్ఫీలు దిగడానికి ఎగబడ్డారు. హేమ దర్శనం చేసుకొని బయటకి వచ్చిన తర్వాత మీడియా ఆమె వద్దకు వచ్చారు. హేమ మీడియాతో మాట్లాడుతూ.. స్వామివారి దర్శనం బాగా జరిగింది. నేను ఇక్కడే పుట్టానని మీకు తెలుసు. ఎప్పుడు ఇక్కడికి వచ్చినా నా పుట్టిల్లులా ఉంటుంది అని తెలిపింది. అయితే మీడియా రేవ్ పార్టీ ఇష్యూ గురించి ప్రశ్నించడంతో హేమ సమాధానమిస్తూ.. ఏమో మీకే తెలియాలి, మీరే వార్తలు రాస్తున్నారు కదా అని చెప్పడం గమనార్హం.

# కల్కి ఫస్ట్ డే కలెక్షన్స్ ఎంతంటే?

రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన మూవీ కల్కి 2898AD. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా జూన్ 27న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. విడుదలైన అన్నిచోట్ల పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతుంది. ఈ మూవీలోని విజువల్స్, యాక్షన్ సీన్స్, మహాభారతం సీన్స్ చూసి ప్రేక్షకులు ఆశ్చర్యపోతున్నారు. కలియుగాంతానికి, మహాభారతానికి లింక్ పెట్టి నాగ్ అశ్విన్ అదిరిపోయే చిత్రాన్ని తీశాడని అంటున్నారు. ఇదిలా ఉంటే.. కల్కి మూవీ కలెక్షన్స్‌లో దుమ్ములేపుతోంది. కల్కి మూవీ తొలి రోజు ప్రపంచ వ్యాప్తంగా 191.5 కోట్లు కలెక్ట్ చేసింది. ఈ విషయాన్ని చిత్ర బృందం అధికారికంగా వెల్లడించింది. బాక్సాఫీస్ సమాచారం ప్రకారం.. తెలుగులో రూ.70 కోట్లు, హిందీలో రూ.25 కోట్లు, మిగిలిన భాషల్లో రూ.10 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించింది. భారత్‌లో కల్కి సినిమా దాదాపు 115 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్ వసూలు చేసినట్టు సమాచారం.






# అందరికి చెప్పండి.. మార్పు తీసుకురండి..

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా కృషి చేస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి ప్రజలు సహకరించాలని మెగాస్టార్ చిరంజీవి పిలుపునిచ్చారు. మీకు తెలిసిన వారెవరైనా డ్రగ్స్ వాడుతున్నా, కొనుగోలు చేస్తున్నా లేదా పంపిణీ చేస్తున్నట్లయితే వెంటనే తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరోకు తెలియజేయాలని చిరు సూచించారు. తెలంగాణ సీఎంఓ నేతృత్వంలో డ్రగ్స్ వ్యతిరేక ప్రచారంలో చిరంజీవి భాగమయ్యారు. ఈ నేపథ్యంలో ఓ వీడియోను, ఓ మెసేజ్‌ను ఎక్స్(గతంలో ట్విట్టర్) షేర్ పోస్ట్ చేశారు. తెలంగాణ సీఎంఓ నేతృత్వంలోని డ్రగ్స్ వ్యతిరేక ప్రచారంలో భాగమైనందుకు ఆనందంగా ఉందని చిరు చెప్పారు. మీరు లేదా మీకు తెలిసిన వారెవరైనా డ్రగ్స్ వాడుతున్నా, కొనుగోలు చేస్తున్నా లేదా పంపిణీ చేస్తున్నట్లయితే వెంటనే తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో 87126 71111 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు. బాధితులను వ్యసనాల నుండి విముక్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యం తప్ప వారిని శిక్షించడం కాదన్నారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని సాధించేందుకు నాతో పాటు తెలంగాణ ప్రభుత్వంతో చేతులు కలపాలని చెప్పారు. ఈ సందేశాన్ని అందరికీ తెలియజేసి మార్పు తీసుకురావాలని చిరంజీవి కోరారు. ఈ మేరకు ట్వీట్ చేశారు. అలాగే వీడియోలో డ్రగ్స్ వాడకం వల్ల జీవితాలు ఎలా నాశనం అవుతున్నాయో కళ్లకు కట్టినట్లు చూపించారు.

# చల్లని నీళ్లు - వేడి నీళ్లు..

- ఈ రెండింటిని కలిపి ఎందుకు తాగకూడదు?

**విశ్వంభర, ఫీచర్ :** మీరు తాగడానికి ఫ్రిజ్ నుండి నీటిని తీసివేసి అది చాలా చల్లగా ఉన్నప్పుడు, అందులో వేడి నీటిని కలపడం చేస్తుంటారు చాలా మంది. ఇది చాలా సాధారణం. మరి కొందరేమో వేడి నీటిలో చల్లని నీరు పోసి తాగుతుంటారు. ప్రజలకు ఇలాంటివి చేయడం సర్వసాధారణం. కానీ ఇలా చేయడం ఆరోగ్యానికి మంచిది కాదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఎప్పుడు కూడా వేడి, చల్లటి నీటిని కలిపి తాగకూడదని నిపుణులు చెబుతున్నారు. చల్లటి నీరు జీర్ణం కావడానికి బరువుగా ఉంటుందని, వేడినీరు తేలికగా ఉన్నప్పుడు రెండూ కలిస్తే అజీర్తి కలుగుతుందని చెబుతున్నారు.

**చల్లని, వేడి నీటిని ఎందుకు కలపకూడదు?**

వేడి నీటిలో బ్యాక్టీరియా ఉండదు. అయితే చల్లటి నీరు కలిపితే కలుషితం అవుతుంది. కాబట్టి రెండింటినీ కలపడం వల్ల ప్రతికూల ఆరోగ్య ప్రభావాలు ఉంటాయి. వేడి నీరు వాత, కఫాలను శాంతింపజేస్తుంది. అయితే చల్లటి నీరు రెండింటినీ కలపడం వల్ల కఫ దోషం కూడా పెరుగుతుంది. వేడి, చల్లని నీరు కలపడం జీర్ణక్రియను బలహీనపరుస్తుంది. అపానవాయువుకు దారితీస్తుంది. అలాగే పోషకాలను గ్రహించడంలో ఆటంకం కలిగిస్తుంది. వేడి నీరు రక్త నాళాలను విడదీస్తుంది. వాటిని శుభ్రపరుస్తుంది. అందువల్ల చల్లని, వేడి నీటిని కలపడం సరైనది కాదంటున్నారు. ఇది కాకుండా వేడినీటి ప్రక్రియ కాంతి, బాక్టీరియా రహితంగా చేయడమే కాకుండా ఔషధ గుణాలను కలిగి ఉంటుంది. ఇది పూర్తిగా శుభ్రంగా, మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. చల్లటి నీటిలో కలపడం వల్ల ఈ లక్షణాలు చాలా వరకు తగ్గుతాయి. ఇది ఆరోగ్యానికి తక్కువ ప్రయోజనకరంగా ఉంటుంది.

**అలాంటప్పుడు ఏ నీరు తాగాలి?**

మట్టి కుండలోని నీరు ఆరోగ్యానికి అమృతం లాంటిది. ఇది సహజంగా నీటిని చల్లగా, స్వచ్ఛంగా ఉంచుతుంది. ఇది నీటిలో ఉండే ఖనిజాలను కూడా సంరక్షిస్తుంది. మట్టి కుండలు స్థిరమైన, మితమైన ఉష్ణోగ్రతను కలిగి ఉంటాయి. ఇది ఆయుర్వేద పరంగా శరీరానికి మంచిది. మట్టి పాత్రలో ఉంచిన నీటిలో ఆక్సిజన్ కూడా వస్తూ పోతూ ఉంటుంది. ఇది నీటిని చాలా చల్లగా ఉంచడంలో సహాయపడుతుంది.

# రైలు పట్టాల మధ్య కంకర ఎందుకు ఉంటుంది

**విశ్వంభర, ఫీచర్ :** ఈ డౌట్ మీకు ఎప్పుడైనా వచ్చిందా..? రైలు పట్టాల మధ్య.. రెండు వైపులా కంకర రాళ్లు ఎందుకుంటాయని..? ఒకప్పుడు బొగ్గుతో రైళ్లు నడిచేవి.. కాలక్రమేణ కరెంట్ సాయంతో నడిచే రైళ్లు వచ్చాయి. అంతేనా రైళ్లలో చాలా మార్పులు వచ్చాయి. సకల సౌకర్యాలతో పాటు లేటెస్ట్ టెక్నాలజీతో దూసుకెళ్లే.. ఎక్స్‌ప్రెస్, వందే భారత్, బుల్లెట్ ట్రైన్స్ వచ్చాయి. అయినా పట్టాల చుట్టూరా కంకర వేసే పద్ధతి మాత్రం మారలేదు. దేశంలో ఏ మారుమూల రైల్వే ట్రాక్ వద్దకు వెళ్లి చూసినా.. ఆ కంకర రాళ్లు కనిపిస్తూనే ఉంటాయి. ఈ రాళ్లను ట్రాక్ బ్యాలస్ట్ అని పిలుస్తారు. అంత భారీగా ఉండే ట్రైన్.. అన్ని భోగీలతో, పట్టాలపై వెళ్లే సమయంలో భారీ కంపనాలు ఏర్పడుతుంటాయి. దీని కారణంగా పెద్ద శబ్దంతో పాటు.. దగ్గర్లోని భవనాలు, నిర్మాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. అందుకే ఈ పదునైన రాళ్లను రైల్వేశాఖ వినియోగిస్తుంది. ఈ రాళ్లు శబ్ధం తీవ్రతతో పాటు కంపనాలను చాలావరకు తగ్గిస్తాయి. ఇదొక్కటే కాకుండా.. ఇలా కంకర వేయడం వల్ల... పిచ్చి చెట్లు, కలుపు పెరిగే ఆస్కారం ఉండదు. అంతేకాదు ఈ కంకర కారణంగా వర్షాకాలంలో పట్టాలపై నీరు నిలవదు. ఈ కంకర రాళ్లు మాత్రమే కాకుండా.. రైల్వే ట్రాక్‌పై కాంక్రీట్‌తో చేసిన పొడవాటి ప్లేట్‌లు కూడా మీరు గమనించే ఉంటారు. ఆ ప్లేట్లపైనే రైల్వే ట్రాక్‌లు వేస్తారు. వీటిని స్లీపర్స్ అంటారు. ట్రాక్ బ్యాలస్ట్‌లు కూడా ఈ స్లీపర్‌లకు స్థిరత్వాన్ని అందించడంలో సాయపడతాయి.



**మరి మెట్రోకు ఎందుకు ఉండవు..**

మెట్రో స్టేషన్లను పరిశీలిస్తే.. పట్టాల మధ్య రాళ్లు ఉండవు. ఇందుకు కారణం.. ఇక్కడ నడిచే రైళ్లు పరిమిత వేగంతో నడుస్తాయి. వీల్ లోడ్ తట్టుకునే విధంగా.. మెట్రో ట్రాక్స్‌ను నిర్మిస్తారు. అంతే కాకుండా మెట్రో స్టేషన్లలో రైల్వే ట్రాక్‌కు, ప్రయాణీకులకు మధ్య ఎక్కువ డిస్టెన్స్ ఉండదు. బ్యాలస్ట్ ఉంటే.. రాళ్లు ఎగిరి ప్రయాణికులకు తగిలే ప్రమాదం ఉంది. మెట్రో ట్రైన్స్ పొడవు, బరువు కూడా సాధారణ వాటితో పోల్చుకుంటే చాలా తక్కువగా ఉంటాయి. అందుకు తగిన సాంకేతికతతో మెట్రో ట్రాక్ నిర్మాణం చేస్తారు. అందుకే రాళ్లు కనిపించవు.

# రేడియేషన్ గుండె జబ్బు అంటే ఏమిటి? ఇది ఎవరికి ఎక్కువ ప్రమాదకరం!

**విశ్వంభర, ఫీచర్ :** చెడు ఆహారం, చెడు జీవనశైలి వల్ల గుండె జబ్బులు వస్తాయి. గత కొన్నేళ్లుగా గుండె జబ్బులు గణనీయంగా పెరిగాయి. చిన్నవయసులోనే వీటి బారిన పడుతున్నారు. అత్యంత సాధారణ కేసులు గుండెపోటు, కార్డియాక్ అరెస్ట్‌లు. కానీ క్యాన్సర్ రోగులకు ఎక్కువ ప్రమాదం ఉన్న గుండె జబ్బులు కూడా ఉన్నాయని మీకు తెలుసా? దాని గురించి తెలుసుకుందాం. ఈ వ్యాధిని రేడియేషన్ హార్ట్ డిసీజ్ అంటారు. ఒక వ్యక్తి చాలా కాలం పాటు రేడియేషన్‌కు గురైనప్పుడు ఈ వ్యాధి సంభవిస్తుంది. క్యాన్సర్ రోగులు ఈ వ్యాధి బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయంటున్నారు నిపుణులు. క్యాన్సర్ రోగులు రేడియేషన్ థెరపీని అందుకోవడమే దీనికి కారణం. ఈ రేడియేషన్‌కు గురికావడం వల్ల వారు అనారోగ్యానికి గురవుతారు. రేడియేషన్ గుండె కండరాలు, నరాలకు హాని కలిగిస్తుంది. దీని వల్ల రేడియేషన్ గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఉంది. ఈ వ్యాధి కారణంగా గుండె పనితీరు దెబ్బతింటుంది. దీంతో గుండెపోటు లేదా గుండె ఆగిపోయే ప్రమాదం ఉంది.క్యాన్సర్ రోగులకు రేడియేషన్ గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఉంది. అయితే ప్రతి క్యాన్సర్ రోగికి ఈ సమస్య ఉండదని మాక్స్ హాస్పిటల్‌లోని ఆంకాలజిస్ట్ డాక్టర్ రోహిత్ కపూర్ చెప్పారు. చాలా ఎక్కువ రేడియేషన్ పొందిన రోగి ప్రమాదంలో ఉండవచ్చు. ఇప్పటికే గుండె జబ్బులు ఉన్న రోగులకు ఎక్కువ ప్రమాదం ఉంది.

**ఎలా రక్షించుకోవాలి?**

యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. మీరు మీ ఆహారంలో టమోటాలు, వాల్‌నట్‌లు, అవకాడోస్ వంటి యాంటీఆక్సిడెంట్ రిచ్ ఫుడ్‌లను చేర్చుకోవచ్చు. ఏవైనా లక్షణాలు కనిపిస్తే వైద్యుడిని సంప్రదించండి



**లక్షణాలు ఎలా కనిపిస్తాయి?**

రేడియేషన్ థెరపీ చేయించుకుంటున్న, ఈ లక్షణాలను అనుభవిస్తున్న క్యాన్సర్ రోగి రేడియేషన్ గుండె జబ్బుతో బాధపడుతూ ఉండవచ్చు. ఈ లక్షణాలు సాధారణ గుండె జబ్బులు లేదా గుండెపోటు వల్ల కూడా సంభవించవచ్చు. అయితే ఒక క్యాన్సర్ రోగి రేడియేషన్ థెరపీకి గురవుతున్నట్లయితే, ఈ లక్షణాలన్నింటినీ అనుభవిస్తున్నట్లయితే ఆ రోగి ఖచ్చితంగా వైద్యుడిని సంప్రదించాలి.నిరంతరం ఛాతీ నొప్పి. శ్వాస ఆడకపోవడం. వేగవంతమైన, నెమ్మదిగా హృదయ స్పందన. ఎప్పుడూ అలసిపోతుంటారు. కాళ్ళలో వాపు ఉంటుంది.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com